

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-10-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 259 పేజీలు: 10+4 వెల: 6.50



రష్యా గ్యాస్‌ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి

కాల్పుల విరమణకు పాక్, అఫ్ఘాన్ అంగీకారం 5


## శుభాకాంక్షలు

దీపావళి పర్వదినం సందర్భంగా మా పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.

-డా॥గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

### సెలవు

పండుగ సందర్భంగా సోమవారం వార్త కార్యాలయానికి సెలవు. మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 22వ తేదీ బుధవారం.




## రాముని కోటలో లక్షల దీపాలు



9వ దీపోత్సవంలో భాగంగా ఆదివారం లక్షల దీపకాంతులతో వెలిగిపోతోన్న అయోధ్యలోని సరయూ నదీతీరం

## బంగాళాఖాతంలో అల్పపీడనం



### తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు19:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాగల మూడు నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దక్షిణ అండమాన్ సముద్రాన్ని ఆనుకొని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. దాని ప్రభావంతో మంగళవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది 48 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఉందని చెప్పింది. ఈ >>2

## రుణాలు, జీతాలకే ఖజానా చెల్లు!



### ఆ వ్యయం దాదాపు రూ.2.68 లక్షల కోట్లు

### 9 ప్రధాన రంగాలకు రూ.1.59 లక్షల కోట్లు

### గాబరా పెంచుతున్న ఆర్థిక శాఖ లెక్కలు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నిబద్ధత బాధ్యతలు ఆధిపత్యం చెలాయిస్తూ అభివృద్ధి వ్యయాన్ని పరిమితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఖజానాలో సింహభాగం రుణాలు, జీతాలకే వ్యయం అవుతోంది. ఆర్థిక శాఖ డేటా ప్రకారం, డిసెంబర్ 2023లో అధికారం చేపట్టినప్పటి నుండి గత నెల వరకూ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది ప్రధాన రంగాలలో రూ. 1,59,213 కోట్లు ఖర్చు చేసింది. అత్యధిక వ్యయం నిబద్ధత బాధ్యతలపైనే జరిగింది. రుణ చెల్లింపులు మరియు వడ్డీలపై రూ.1.15 లక్షల కోట్లు, జీతాలు మరియు పెన్షన్లపై రూ.1.37 లక్షల కోట్లు. ఈ ఖర్చులు కలిపి రూ.2.53 లక్షల కోట్లుగా లెక్క తేల్చింది. ఆర్థిక శాఖ నుండి పొందిన గణాంకాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడిని హైలైట్ చేస్తున్నాయి. ఇక్కడ అభివృద్ధి ఆధారిత వ్యయం కంటే నిబద్ధత బాధ్యతలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. 2023-24 నవంబర్ వరకు సంవత్సరంలో మూడింట రెండు వంతులు గత ప్రభుత్వం అధికారంలో ఉంది. డిసెంబర్ నుండి >>2

# ఎమ్మెల్యేల అర్హత వయసు 21 చేయాలి

## రాజ్యాంగ సవరణ అవసరం

### 'జూబ్లీ'లో ఓట్లు చీల్చేందుకే బిఆర్ఎస్ కుట్ర రాజకీయాలు

### బిజెపికి బి టీమ్‌గా మారిన బిఆర్ఎస్

### రాజీవ్ సద్భావన యాత్ర సభలో ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు19:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాటల యుద్ధం మరింత ముదిరింది. విపక్షాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగబోయే ఉప ఎన్నికలో బీజేపీతో ఆ పార్టీ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఓట్లను చీల్చేందుకే బీఆర్ఎస్ ఈ ఎత్తుగడ వేస్తోందని ఆయన విమర్శించారు. ఆదివారం చారిత్రక చార్మినార్ వద్ద జరిగిన రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ బిజెపికి బీ టీమ్‌గా మారిందని, 2024 లోక్‌సభ >>2



ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్


రాష్ట్రాభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకం
సదర్ సమ్మేళనంలో సిఎం రేవంత్
ఘనంగా జరిగిన దీపావళి సమ్మేళనం 2


ఇందిరా మహిళా డెయిరీ అభివృద్ధిపట్ల డి.సిఎం భట్టి వార్నం వారు 5 వేల కోట్లు సంపాదించాలని ఆకాంక్ష

## పాల ఉత్పత్తులలో యేడాదికి వెయ్యి కోట్లు



**బోనకల్, ప్రభాతవార్త అక్టోబర్ 19:** పాల ఉత్పత్తుల ద్వారా మధిర నియోజకవర్గం మహిళా సంఘాల సభ్యులు దేశానికి ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ ఇందిరా మహిళ డైయిరీ లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని బోనకల్ లోని షిరిడీ సాయి కమ్యూనిటీ హాల్ లో నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఇందిరా మహిళా డైయిరీ తన చిరకాల వాంఛ అని, ఉమ్మడి రాష్ట్రంలో 2013 సంవత్సరంలో మధిర నియోజకవర్గంలోని 52,000 మహిళా సంఘాల సభ్యులకు రెండు గేదలు కొని వ్వాలని ఆరోజు భావించానన్నారు. బోనకల్లు మండలంలోని ఇందిరా మహిళా శక్తి పాల పరిశ్రమను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ పరిశ్రమను అమూల్, విజయ డైరీ, హెరిటేజ్ పరిశ్రమల మాదిరిగా బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఇక్కడి పాల ఉత్పత్తులు దేశవ్యాప్తంగా అమ్మేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. పాల ఉత్పత్తులను పెంచడం ద్వారా మదిర నియోజకవర్గ మహిళలు 1000 కోట్లు సంపాదించేలా చర్యలు తీసుకుంటామని ఈ విధంగా 5 ఏళ్లలో 5000 కోట్లు సంపాదించాలని ఆకాంక్షి ంచారు.

ఇందుకు రాష్ట్రంలోనే మధిర నియోజకవర్గం లో ప్రాథమిక పునాది పడిందని అన్నారు. ఈ ఏడాది 20 వేల మంది మహిళలకు గేదలను పంపిణీ చేస్తామని వచ్చే ఏడాది మరో 20 వేల మందికి, ఆ తర్వాత మిగిలిన 20వేల మందికి గేదెలను పంపిణీ చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, డిప్యూటీ సీఎం ఒక ఆశయం తో మధిర నియోజకవర్గంలో చేపట్టిన ఇందిరా మహిళా డెయిరీ విజయవంతానికి దిశానిర్దేశం చేస్తున్నారని అన్నారు.



ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కెటిఆర్. చిత్రంలో సబిత తదితరులు

### ఎమ్మెల్యేల ఫిరాయింపులపై

## 'సుప్రీం'కు వెళ్తాం

### బిఆర్ఎస్‌లో చేరిన నేతలకు కండువా కప్పిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు19:** ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు వెళ్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను మొదటి దెబ్బ జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ కొట్టబోతుందని స్పష్టం చేశారు. రెండో దెబ్బ రాజేంద్రనగర్ లేదా ఖైరతాబాద్‌లో కొడుతామని తేల్చి చెప్పారు. కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాడని మండిపడ్డారు. దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికకు రావాలని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి చెందిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్, పాశం యాదగిరి కూతురు పాశం పల్లవి, అల్లుడు అంజిబాబు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరిని కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల స్థానాల్లో >>2


పార్టీ ద్రోహులను శిక్షించండి..
మల్లోజుల, ఆశన్నలు పార్టీకి ద్రోహం చేశారు:
మావోయిస్టు కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ 3


## మావోయిస్టులతో సంబంధాలు కట్ చేయండి



### పలువురు నాయకులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన

### లేదంటే కేంద్ర ఏజెన్సీలతో బట్టబయలు చేస్తామని హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబరు 19 ప్రభాతవార్త:** తెలంగాణలోని కొందరు రాజకీయనాయకులకు మావోయిస్టులతో సంబంధాలను ఉన్నాయని, తక్షణమే వాటిని తెంచుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. మావోయిస్టులతో ఉన్న సంబంధాలు తెంచుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. తెలంగాణలోని పలువురు రాజకీయ నాయకులు దీనిని ఒక హెచ్చరికగా పరిగణించాలన్నారు. వేదికలపై ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూ, తెరవెనుక సాయుధ గ్రూపులకు అండగా నిలుస్తున్న వారు వెంటనే తమ సంబంధాలను వదులుకోవాలన్నారు. లేకపోతే వారినిబట్టబయలు చేస్తామన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యలు కేవలం మావోయిస్టు కేడర్‌తోనే ఆగిపోవు అని బండి సంజయ్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో అవినీతి, నేరాలు, తీవ్రవాద సంబంధాలను కాపాడుతున్న శక్తులను కేంద్రం కనికరం లేకుండా అణిచివేస్తుందని ఆయన తెలిపారు. సమస్యలో భాగమైన వారు ఎంత పెద్దవారైనా సరే, పక్కకు తప్పుకోవాలంటూ హెచ్చరికలు చేశారు. దేశఅంతర్గత భద్రత విషయంలో తప్పు వైపు నిలబడితే ఎంతటి ఉన్నత నాయకులైనా పతనం కాక తప్పదు అని స్పష్టం చేశారు. ఇటీవల మహారాష్ట్రలో లొంగిపోయినమావోయిస్టు నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి, తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్నలు చేసిన >>2

### 10 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు

## అమరవీరుల సంస్మరణ

### రేపు గోషామహల్ కార్యక్రమానికి హాజరుకానున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు19:** అక్టోబర్ 21వ తేదిన పోలీసు అమరవీరుల సంస్మరణదినం గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించనున్నామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి పత్రికా ప్రకటనలో ఆదివారం నాడు తెలియజేశారు. ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కార్యక్రమంలో ప్రసంగిస్తారని వెల్లడించారు. అదేవిధంగా, ఈనెల 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు పోలీస్ అమర వీరుల సంస్మరణ కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుపనున్నామని పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీస్ కార్యాలయాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు పోలీస్ స్టేషన్ పరిధిలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన ఈనెల 31వ తేదీన జరగనున్న జాతీయ సమైక్యత రోజు వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.పది రోజులపాటు పోలీస్ అమరవీరుల సంస్కరణ కార్యక్రమాల జరుగుతాయని తెలిపారు. ఈ సంవత్సరం, భారతదేశం అంతటా 191 మంది పోలీసు సిబ్బంది విధి >>2






కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద ఉన్న బంకర్ లోపల ఆదివారం ఆఫ్‌డ్యూటీ సమయంలో చెస్ ఆడుతున్న సైనికులు

## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు19:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజల జీవితాల్లో ప్రజా ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకువచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ వెలుగుల పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని, ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## మావోయిస్టులతో సంబంధాలు కట్ చేయండి

>> వ్యాఖ్యల నేపథ్యంలో బండి సంజయ్ ఈ హెచ్చరిక చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రూ.6 కోట్ల రివార్డు ఉన్న భూపతి, మరో 60 మంది కేడర్‌తో కలిసి ఈనెల 15న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. తెలంగాణలోని కొందరు రాజకీయ నాయకుల రహస్య అండతో మావోయిస్టు పార్టీలోని ఒక వర్గం పనిచేస్తుందని వారు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. నక్సలిజం పతనమవుతుందని బండి సంజయ్ గతంలోనే వ్యాఖ్యానించారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోయారని, 1,785 మందిని అరెస్టు చేశామని, 477 మందిని మట్టుబెట్టామని బండి సంజయ్ తెలిపారు. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## ఎమ్మెల్యేల ఫిరాయింపులపై 'సుప్రీం'కు వెళ్తాం

>> ఉపఎన్నికలు తథ్యమని స్పష్టం చేశారు. రెండేళ్ల తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని, కేటీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాబోతున్నాడని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎవరెవర్ని ఏం చేయాలో, ఎవరి బెండ్ ఎలా తీయాలో తీసి తీరుతామని హెచ్చరించారు. ఎవరెవరు ఏం చేస్తున్నారన్న అందరి జాతకాలు తనకు తెలుసని.. లెక్కలన్నీ తేలుస్తామని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.ఆక్రమణల పేరుతో పేదల ఇండ్లను కూలుతున్నారని.. ఇప్పటివరకు ఒక్క బడా వ్యక్తి ఇంటిని కూల్చలేకపోయిందని.. మూసీకి అడ్డంగా కడుతున్నవారిని ఎవరూ పట్టించుకోవట్లేదని విమర్శించారు. బడా నేతల ఇళ్ల కూల్చివేసేందుకు హైడ్రాకు దారి దొరకడం లేదని.. కానీ, పేదల వద్ద నివాస పత్రాలు ఉన్నా రాత్రికి రాత్రే కూల్చివేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు చెరువులోనే ఉందని.. ఆ ఇంటి జోలికి మాత్రం వెళ్లడం లేదన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్ చెరువులో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ ఇళ్లు చెరువులోనే ఉన్నా వాటిని ముట్టుకోవడం లేదని.. కేవీపీ రామచంద్రరావు ఇంటి జోలికి కూడా వెళ్లడం లేదని.. పెద్ద ఇండ్ల అడ్రస్‌లు కూడా హైడ్రాకు తెలియదంటూ సెటైర్లు వేశారు. పేదల ఇళ్లు కూలిస్తే అడిగేవారే లేరని భావిస్తున్నారన్నారు. పెద్దల వద్ద డబ్బులు గుంజి బెదిరింపులకు దిగుతున్నారని,రియల్ ఎస్టేట్ కుప్పకూలడానికి ప్రభుత్వ విధానాలే కారణమని మండిపడ్డారు.దిక్కుమాలిన ఆలోచనలు, విధానాలతోనే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోయిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే సీఎం మొదట దెబ్బకొట్టింది రాజేంద్రనగర్ నియోజకవర్గాన్నేనన్నారు. 2023 కేబినెట్ భేటీలో 400 కిలోమీటర్ల మెట్రో మంజూరు చేశామని.. ఎయిర్‌పోర్టు మెట్రోకు టెండర్లు పూర్తి చేస్తే రేవంత్ వచ్చాక రద్దు చేశారని.. తనకు భూములు ఉన్నాయనే అనుమానంతో ఆ పని చేశారని విమర్శించారు. రాజేంద్రనగర్‌లో భూములున్నాయని సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేశారని.. భూములు చూపితే రాసిస్తానని సబితా ఇంద్రారెడ్డి చెబుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి తాను బంపర్ ఆఫర్ ఇస్తున్నా.. భూములు ఎక్కడున్నాయో చూపించాలని.. కంపెనీలు, భవనాలు నావేనని చెబుతూ రెండేళ్లుగా జల్లెడ పడుతున్నారన్నారు. గత దీపావళికి మంత్రి బాంబులేటి.. బాంబులు పేలుతాయని చెప్పారని.. మళ్లీ దీపావళి వచ్చిందంటూ చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో పారిశ్రామికవేత్తలకు గొడుగులు పట్టి తీసుకువెళ్లామని.. కాంగ్రెస్ పాలనలో పారిశ్రామివేత్తలకు తుపాకులు పెడుతున్నారని.. ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా దందాలు చేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## నవీన్ యాదవ్‌కి బి-ఫామ్ అందజేసిన మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు19:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నవీన్యాదవ్కి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీ బీఫాం అందజేశారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అటు పార్టీ పరంగా రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జి మంత్రులు, పార్టీ ముఖ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణుల్లో ప్రచారంలో పాల్గొంటున్నారు. తాజాగా ఆయనకు పార్టీ బీఫాం అందజేసింది. జూబ్లీహిల్స్‌లో ఈనెల 21 వరకూ నామినేషన్లు, నామినేషన్ల పరిశీలన ఈనెల 22, ఉప సంహారణ 24న, పోలీంగ్ తేదీ నవంబర్ 11న జరుగునున్నది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరుగనున్నది.

## వారం - వర్జ్యం

20-10-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
చతుర్దశి మ.3.47
హస్త రా.8.18
వర్జ్యం : తె.5.12-ఉ.6.58
దు.మ.12.17-మ.1.04, 2)మ.2.37-3.24
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బంధువులకు సంబంధించిన వ్యవహారాలు పర్యవేక్షించవలసి వస్తుంది.

**వృషభం:** ఇతరుల కార్యకలాపాలు, వారికి సహాయసహకారాలు అందించటంతోటే కాలం గడుస్తుంది.

**మిథునం:**మీ గురించి మీరు శ్రద్ధ తీసుకోవడానికి మాత్రం సమయం సరిపోదు.

**కర్కాటకం:**ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించండి. ఉద్యోగాలు సానుకూలంగా ఉంటాయి.

**సింహం:**ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దలు, అనుభవజ్ఞుల సలహాలు కూడా పాటించండి.

**కన్య :** కోర్టు కేసుల నుండి బయట పడుతారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

**తుల :** రెండు, మూడు విధాలుగా ధనలాభం పొందుతారు. సోదరుల కలయిక.

**వృశ్చికం:**ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. వస్తు కొనుగోలు.

**ధనుస్సు:** నూతన వ్యక్తులు పరిచయమై మీరు సహాయం అందిస్తారు.

**మకరం:** అవకాశాలు అప్రయత్నంగా కలిసివస్తాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** రాజకీయ రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**మీనం :** పురోభివృద్ధిలో కొంత ప్రతికూల పరిస్థితి చోటు చెడుకుంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

21-10-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
●అమావాస్య సా.5.56
చిత్త రా.10.59
వర్జ్యం : తె.5.16-ఉ.7.03
దు.ఉ.8.22-9.09,
2) రా.10.24-11.11
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** దూర ప్రాంత ప్రయాణాలు, నూతన పెట్టుబడులు కొంత కాలం వాయిదా వేయడం మంచిది.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలలో స్తబ్దత నెలకొంటుంది. ప్రయాణాలు.

**మిథునం:** ఆర్థికంగా చెప్పకోదగిన ఒడుదుడుకులుండవు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** అన్నీ ప్రతికూలంగా ఉన్నా సంతాన పురోభివృద్ధి బాగుంటుంది.

**సింహం:**ఆస్తి తగాదాలు చికాకు కలిగిస్తాయి. సంతాన రీత్యా సంతృప్తిని పొందుతారు.

**కన్య :** జీవిత భాగస్వామి ద్వారా ఆస్తిలాభం పొందుతారు.

**తుల :** పట్టుదలతో ముందుకు సాగి పనులు చక్కబెట్టుకుంటారు.

**వృశ్చికం:**ఆకస్మిక ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి.

**ధనుస్సు:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకంటాయి.

**మకరం:**ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**కుంభం:** ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు.

**మీనం :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రాభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకం

### సదర్ సమ్మేళనంలో సిఎం రేవంత్

### ఘనంగా జరిగిన దీపావళి సమ్మేళనం



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగిన సదర్ సమ్మేళనంలో సిఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్ తదితరులు

**హైదరాబాద్ (ముషీరాబాద్), అక్టోబర్ 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో యాదవులు కీలక పాత్ర పోషిస్తున్నారని, నమ్మినవారి కోసం ఎంత కష్టం వచ్చినా, నష్టం వచ్చినా యాదవులు అండగా నిలబడతారని, వారి అండతోనే హైదరాబాద్ ప్రపంచ పెట్టుబడులకు ఆదర్శ నగరంగా మారిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఆదివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఆధ్వర్యంలో అత్యతం వైభవంగా జరిగిన దీపావళి సమ్మేళనంకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రజలందరి మధ్య ఐక్యతను పెపొందిస్తూ యాదవ సోదరులు సదర్ ఉత్సవాలను నిర్వహించటం అభినందనీయమని, యాదవ సోదరుల ఖదర్ హైదరాబాద్ సదర్ అని, ఎంతో చరిత్ర కలిగిన సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరినప్పుడు వెంటనే అమోదించటమే కాకుండానిధులు కేటాయించామని గుర్తు చేశారు. యాదవుల సహకారంతోనే తెలంగాణ రాష్ట్రంను ముందుకు తీసుకు వెళ్తామని, వారికి ప్రభుత్వంలో ప్రాతినిధ్యం, సముచిత స్థానం కల్పిస్తామని, ఆ బాద్యత పార్టీ పరంగా ప్రభుత్వ పరంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. మీకు ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దగ్గరకు వచ్చి చెప్పాలని, మీ సమస్యలు ఏవి మా దృష్టికి తీసుకువచ్చినా, చిత్తశుద్ధితో పరిష్కరించే బాద్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని దేశంలోనే ఒక అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చి దిద్దే బాద్యత నాదని, హైదరాబాద్‌లో శాంతి భద్రతలను కాపాడే బాద్యత మీ అందరిదీ అని, యాదవ సోదరుల సహకారంతోనే ఏదైనా సాధ్యమవుతుందని అన్నారు. ఈ సదర్‌ఉత్సవాలలో మంత్రులు పొన్నంప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్రఅధ్యక్షులు రాంచందర్‌రావు,మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## 'ధరణి' వల్లే బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది

### దానిని రద్దు చేసి భూభారతి కొత్త విధానం తెచ్చాం

### శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు అందజేసిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు19:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి ధరణి చట్టమే ప్రధాన కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఒక్క చట్టం వల్లే బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందని ఆయన స్పష్టం చేశారు. శిక్షణ పొందిన సర్వేయర్లకు ఆదివారం శిల్పకళా వేదికలో లైసెన్సుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గత కేసీఆర్ ప్రభుత్వం మీద సీఎం విమర్శలు గుప్పించారు.కొంతమంది దొరలు భూములపై పెత్తనం చెలాయించేందుకే గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ తెచ్చిన ధరణి చట్టం.. కొందరికి చుట్టంగా మారిందని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. ధరణి చట్టాన్ని అడ్డుపెట్టుకుని ఆధిపత్యం చెలాయించాలని చూశారు. తమ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు చాలా కారణాలు ఉండవచ్చని, కానీ బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ధరణి చట్టం మాత్రమే కారణమని ఆయన అన్నారు. తాము అధికారంలోకి వస్తే ధరణి నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని గుర్తుచేశారు. ఆ మాట ప్రకారమే, అధికారం చేపట్టిన వెంటనే ధరణిని రద్దు చేసి భూ భారతి అనే కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వివరించారు. భూ సమస్యలు పరిష్కరించాలనే లైసెన్స్ సర్వేయర్లను తీసుకొచ్చామన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలోనూ గత ప్రభుత్వంపై సీఎం విమర్శలు గుప్పించారు. వారి హయాంలో టీజీపీఎస్సీ ఓ పునరావాస కేంద్రంగా మారిందని, ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో లీక్ అయ్యేవని ఆరోపించారు. కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిజిపిఎస్సీని ప్రక్షాళన చేశామని, ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. కొందరు కావాలనే కోర్టుల్లో కేసులు వేసి నియామక ప్రక్రియను అడ్డుకుంటున్నారని, అయినప్పటికీ న్యాయపోరాటం చేసి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. కోర్టుల్లో పోరాడి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశామని, త్వరలో గ్రూప్ 3,4 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని అన్నారు. దేశ జిడిపిలో తెలంగాణ వాటా ప్రస్తుతం 5 శాతంగా ఉందని, జిడిపిలో తెలంగాణ వాటా త్వరలోనే 10 శాతానికి చేరాలని కోరారు. ఉద్యోగులు కష్టపడితేనే.. ప్రజలు సమస్యలు పరిష్కరిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, లైసెన్సులు పొందిన కొత్త సర్వేయర్లను సీఎం అభినందించారు. చరిత్రలో భూమి కోసమే ఎన్నో యుద్ధాలు జరిగాయని, సర్వేలో చిన్న తప్పు జరిగినా ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. సర్వేయర్లందరూ బాధ్యతాయుతంగా పనిచేసి, రైతులకు అండగా నిలవాలని ఆయన సూచించారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఆ దిశగా ముందుకెళ్లేందుకు మీ సహకారం ఉండాలి. రైతే దేశానికి వెన్నెముక.. అలాంటి రైతుకు అండగా ఉండండి. తెలంగాణ అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావాలి అని సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా ఎంపికైన సర్వేయర్లకు దిశానిర్దేశం చేశారు. సర్వేయర్లకు లైసెన్స్‌ల అందజేత కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మందుల సామేల్, నాగరాజు తదితరులు హాజరయ్యారు.



ఆదివారం హైదరాబాద్‌లో సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్ గాంధీ సద్భావన పురస్కారాన్ని అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ తదితరులు

## ఎమ్మెల్యేల అర్హత వయసు 21 చేయాలి

>>ఎన్నికల్లోనూ బీజేపీతో బీఆర్ఎస్ రహస్య ఒప్పందం చేసుకుందని ఆయన ఆరోపించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు 21 శాతం బీజేపీకి బదిలీ కావడమే వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. "ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా బీఆర్ఎస్ అదే రాజకీయ వ్యూహాన్ని అనుసరిస్తోంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీల మధ్య పొత్తు రాజకీయాలు కొనసాగుతాయని ఆయన జోస్యం చెప్పారు.జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓట్లను చీల్చేందుకు బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలో ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేయాలంటే అర్హత వయసు 25 ఏళ్లుగా ఉందని, ప్రస్తుతం 21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్‌లు తయారై దేశాన్ని నడిపిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. అలాంటప్పుడు 21 ఏళ్లకే ఎమ్మెల్యేగా ఎందుకు పోటీ చేయకూడదని ప్రశ్నించారు. రాజీవ్‌గాంధీ హయాంలో ఓటుహక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని గుర్తు చేశారు. ఓటుహక్కు 21 ఏళ్లు ఉన్నప్పుడు ఎన్నికల్లో పోటీకి 25 ఏళ్లుగా ఉందని,ఓటుహక్కు 18 ఏళ్లుగా మారినప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి 21 ఏళ్లకు పోటీ చేసే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా 21 ఏళ్లకే పోటీ చేసేలా అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం ఆమోదింపజేస్తామని సీఎం రేవంత్ వెల్లడించారు. సీడబ్ల్యూసీ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీలోనూ సవరణ అమలు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనూ మార్పులకు కృషిచేయాలని సల్మాన్ ఖుర్షీద్ కోరుతున్నట్లు తెలిపారు. దేశాన్ని నడిపేందుకు యువకులకు అవకాశం ఇవ్వాలని, 21 ఏళ్లకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం సల్మాన్ ఖుర్షీద్ బాధ్యత తీసుకోవాలని కోరారు. గత 35 ఏళ్లుగా రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర జరుగుతోందని, గాంధీ భారతదేశానికి పర్యాయపదం అని తెలిపారు. భారత్‌లో అన్ని మతాల సహజీవనం స్ఫూర్తినిస్తుందని, గాంధీ కుటుంబం కూడా దేశానికి అదే విధంగా స్ఫూర్తి నిచ్చిందని పేర్కొన్నారు. బ్రిటీషర్లపై పోరాడిన మహాత్మాగాంధీని వారు ఏమీ చేయలేకపోయారని, స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది నెలల్లోనే మతతత్వ వాదులు గాంధీని పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. గాంధీని హత్య చేసిన వారు బ్రిటీషర్ల కంటే ప్రమాదకరమైన వ్యక్తులన్న రేవంత్ దేశ సమగ్రత, సమైక్యత కాపాడడానికి ఇందిరాగాంధీ అసువులు బాసారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ వారసత్వం, త్యాగాలను రాజీవ్‌గాంధీ పుణికిపుచ్చుకున్నారని, దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన ఎంతో కృషిచేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మతసామరస్యం దెబ్బతీసి దేశాన్ని విచ్ఛిన్నం చేసేటపుడు రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర చేశారన్నారు. దేశ సమగ్రత కాపాడడానికి గాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. రాజీవ్ స్ఫూర్తితో రాహుల్ గాంధీ దేశ సమగ్రత కోసం భారత్ జోడో యాత్ర చేశారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించి దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలోపేతం చేశారని గుర్తుచేశారు. దేశ సమగ్రతను కాపాడేందుకు రాజీవ్ గాంధీ చార్మినార్ నుంచి ప్రారంభించిన సద్భావన యాత్ర స్ఫూర్తిని కొనసాగించడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్ గాంధీ సద్భావన పురస్కారాన్ని సీఎం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తదితర నేతలు పాల్గొన్నారు.

## రుణాలు, జీతాలకే ఖజానా చెల్లు!

>> మార్చి వరకు ప్రస్తుత ప్రభుత్వం కేవలం నాలుగు నెలలు మాత్రమే ఆర్థిక వ్యవహారాలను నిర్వహించింది. ఆ సమయంలో రుణ సేవలకు రూ.24,643 కోట్లు కేటాయించింది. ఈ ధోరణి తరువాతి సంవత్సరాల్లో తీవ్రమైంది. 2024-25లో రూ.66,374 కోట్లు మరియు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 22వ తేదీ వరకు రుణ సేవలకు రూ.46,431 కోట్లు ఖర్చు చేసింది. జీతాలు మరియు పెన్షన్ల విషయంలో, కాంగ్రెస్ ప్రభుత్వం 202324లో మొదటి నాలుగు నెలల్లో రూ.19,315 కోట్లు, 202425లో రూ. 64,367 కోట్లు మరియు 202526 మొదటి అర్ధభాగంలో రూ.32,303 కోట్లు ఖర్చు చేసింది. కాగా ఇప్పటికే ఆదాయం కంటే ఖర్చు ఎక్కువ కావడంతో ప్రతీ నెలా దాదాపు రూ.2 వేల కోట్ల మేర వ్యత్యాసం ఉంటోంది. ప్రభుత్వానికి ప్రతీ నెలా సగటున పన్నులు, పన్నేతర ఆదాయం సుమారు రూ.11 వేల కోట్ల వరకూ వస్తోంది. ఈ విధంగా నెలనెల రాష్ట్రానికి దాదాపు 15వ వేల కోట్ల రూపాయలు సమకూరుతుండగా, ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు 4 వేల కోట్లు, అప్పులు, వాటి కిస్తీలకు మరో 4 వేల కోట్ల రూపాయలు, అప్పులకు చెల్లించాల్సిన వడ్డీల కింద ఇంకో 1,800 కోట్ల రూపాయలు, సామాజిక పెన్షన్లకు 1,200 కోట్ల రూపాయలు విధిగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాగే సంక్షేమ కార్యక్రమాల అవసరాలను తీర్చడానికి వస్తున్న ఆదాయం సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో పెరుగుతున్న భారం అనివార్యమని ఆర్థిక శాఖ అధికారవర్గాలు అంగీకరించాయి. ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా రుణాల చెల్లింపులో లేదా దాని ఉద్యోగులకు చెల్లింపులలో కోత పెట్టలేదని పేర్కొంది. ఈ అప్పులు దీర్ఘకాలిక రుణాల నుండి వచ్చాయని, కొన్నింటికి 30 సంవత్సరాల వరకు తిరిగి చెల్లించే కాలాలు ఉన్నాయని ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.గత రెండు మూడు దశాబ్దాలుగా పేరుకుపోయిన అప్పులను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోందని ఆయన ఎత్తి చూపారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ

>> నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించారు. వీరిలో తెలంగాణకు చెందిన పోలీస్ సిబ్బంది ఐదుగురు ఉన్నారు. పోలీసు అమరవీరులసంస్మరణ దినం అక్టోబర్ 21, 1959 నుండి జరుపుకుంటున్నాము. ఆరోజు లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద ఎస్ఐ కరణ్ సింగ్ నేతృత్వంలోని సిఆర్‌పిఎఫ్ గస్తీ బృందాన్ని చైనా దళాలు మెరుపుదాడికి గురిచేశాయి. తీవ్ర పరిస్థితులు ఉన్నప్పటికీ, పది మంది జవాన్లు ధైర్యంగా పోరాడి అమరులైనందున ఆ రోజును స్మరించుకుంటూ పోలీస్ అమరవీరుల సంస్థల కార్యక్రమాలను చేపడుతున్నాము. పోలీసు అమరవీరులను గౌరవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరంలో ప్రాణాలను త్యాగం చేసిన తెలంగాణ పోలీసు సిబ్బంది ధైర్యసాహసాలను వివరించే ఒక బుక్‌లెట్‌ను తెలంగాణ సురక్ష ప్రచురిస్తుంది. ఈ బుక్‌లెట్ వారి ధైర్యం, అంకితభావానికి నివాళిగా ఉపయోగపడుతుంది. కళాకృతులు, నినాదాలతో కూడిన హోర్డింగ్‌లు, బ్యానర్‌లు మరియు పోస్టర్‌లు ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రదర్శిస్తారు. తెలంగాణ పోలీసులు భౌతిక, వర్చువల్ ఫార్మాట్‌లలో ఓపెన్ హౌస్‌లను నిర్వహిస్తారు. పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, పౌర సమూహాలు అధికారులతో సంభాషించడానికి పోలీస్ స్టేషన్‌లనులకు పిలుస్తారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్, సిసిటీవీలు, షీ టీమ్స్, భరోసా సెంటర్లు, పోర్ట్రెయిట్ పార్లే, బీట్ సిస్టమ్ వంటి వాటిని వివరిస్తారు. రాష్ట్రంలోని అన్ని ర్యాంకుల పోలీసులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. పాల్గొనేవారు తెలుగు, ఉర్దూ లేదా ఇంగ్లీషులో రాయవచ్చు. పోలీసు సిబ్బందికి రెండు విభాగాల వ్యాసరచన పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

>> క్రమంలో తెలంగాణలో ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసినట్లు తెలుస్తోంది. సోమ, మంగళవారాల్లో పలుచోట్లు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం కూడా పలు జిల్లాల్లో వానలు కురిసే ఛాన్స్ ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది.

**పాడేరు ఏజెన్సీలో మధ్యాహ్నం నుంచి భారీ వర్షాలు**

పాడేరు ఏజెన్సీలో ఆదివారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ కాసింది. ఆ తరువాత వాతావరణం మారిపోయి ఉరుములతో కూడిన వర్షం మొదలైంది. పాడేరుతోపాటు ఏజెన్సీ వ్యాప్తంగా అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షంకురిసింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం కాగా, జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.అరకులోయ మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వర్షం కురిసింది. శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి.

# కానిస్టేబుల్ హత్య కేసు నిందితుడు

## రియాజ్ బతికే ఉన్నాడు..

### ఎన్‌కౌంటర్ వార్త అవాస్తవం : సిపి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 19, నిజామాబాద్:** కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో ట్విస్ట్ నెలకొంది. నిందితుడు రియాజ్‌ను



ఎన్‌కౌంటర్ చేసి నట్లు వార్తలు గుప్పుమన్నాయి. సారంగపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులు అతన్ని ఎన్ కౌంటర్ చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఎన్‌కౌంటర్ ఘటనపై నిజామాబాద్ సీపీ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రచారం జరుగుతున్నట్లుగా నిందితుడు రియాజ్‌పై ఎలాంటి కాల్పులు జరపలేదని స్పష్టం చేశారు. రియాజ్ ప్రాణాలతోనే ఉన్నాడని తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తుండగా పట్టుపడ్డాడని, అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అయితే ఓ వ్యక్తితో జరిగిన ఘర్షణలో రియాజ్‌కు గాయాలయ్యాయని సీపీ పేర్కొన్నారు. రియాజ్‌కు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామని, అతని ప్రాణాలతోనే ఉన్నారని తేల్చి చెప్పారు. నిజామాబాద్‌లోని సారంగపూర్ సమీపంలో ఎప్పుడో రోడ్డు ప్రమాదానికి గురై నిరుపయోగంలో ఉన్న ఒక లారీలో నిందితుడు రియాజ్ దాక్కున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శనివారం రాత్రి నుంచి 9 బృందాలతో పోలీసులు రియాజ్ కోసం గాలించారు. ఎట్టకేలకు రియాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు తప్పించుకునే క్రమంలో రియాజ్, మరో యువకుడికి ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రియాజ్ కు గాయాలైనట్లు సమాచారం.

# పేద క్రీడాకారిణికి మాజీమంత్రి కెటిఆర్ భరోసా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 19:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఉదారత చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద క్రీడాకారిణికి అండగా నిలబడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేట గ్రామా నికి చెందిన పారా త్రోబాల్ ప్లేయర్ మిట్టపల్లి అర్చన స్వతహాగా ఎదిగింది. ఖేలో ఇండియా, నేషనల్ లెవెల్ పారా త్రోబాల్ స్థాయిలో సత్తాచాటి ఇప్పుడు ఇండియా తరపున తెలంగాణ నుంచి శ్రీలంక లో పారా త్రోబాల్ ఆడటానికి అర్హత సాధిం చింది. పేద కుటుంబానికి చెందిన అర్చనకు చిన్నతనం నుంచే క్రీడలంటే ఆసక్తితోనే ఎంత కష్టమొచ్చినా ఈ స్థాయికి వచ్చింది. అద్దె ఇంట్లో ఇద్దరు పిల్లలను పోషిం చుకుంటూ తనకు ఇష్టమైన ఆటలో గెలుపే లక్ష్యంగా కృషిచేస్తున్నది. అయితే ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలుసుకున్నారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చి, ఆమెకు ఆటకు సంబంధించిన క్రీడా పరికరాలు, ఆర్థికసాయం చేసి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు.

# జనవరి 21 నుంచి 30 వరకు జెఇఇ మెయిన్ మొదటి సెషన్

### ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఎన్‌టిఎ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** దేశంలోని ఐఐటిలు, ఎన్ఐటీల్లో ఇంజి నీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) జాతీయ స్థాయిలో జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) (మెయిన్) పరీక్షను నిర్వహి స్తున్న సంగతి తెలిసిందే. ప్రతి ఏడాది రెండు విడతలుగా జెఈఈ మెయిన్ పరీక్షలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా జెఈఈ మెయిన్- 2026 మొదటి సెషన్ పరీక్షలను వచ్చే ఏడాది జనవరి 21 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులను శనివారం నుంచే స్వీకరించడం ప్రారంభించినట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. సిబిటి విధానంలో జెఇఇ మెయిన్-2026ను రెండు సెషన్‌లలో (జనవరి, ఏప్రిల్ 2026) నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి సెషన్1 కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ ఎన్‌టిఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ఎన్‌టిఏ డైరెక్టర్ ఎగ్జామ్స్ ప్రకటించారు. రెండో సెషన్‌కి సంబంధించిన పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 10 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను జనవరి చివరి వారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి పూర్తి చేయాలని సూచించారు. ఆధార్‌తోపాటు, మెమో ఆధారంగా ఉన్న పేర్లను నమోదు చేసుకునే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# పాల్వంచ ఆర్టీఏ చెక్‌పోస్టుపై ఎసిబి దాడి

### 25,100 నగదు స్వాధీనం

**పాల్వంచ, అక్టోబరు 19 ప్రభరతవార్త:** అర్ధరాత్రి నుంచి ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడులు నిర్వహించారు. అసలు ఎం జరుగుతుందో తెలియదు... అక్కడ ఉన్న వారు కూడా ఒక్కసారిగా షాక్ అయ్యారు... తేరుకునే సరికే అధికారులు సోదాలు మొదలుపెట్టారు. పాల్వంచ జాతీయ రహదారిలోని నాగారం లో ఉన్న అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టుపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ దాడులు నిర్వహించింది. ఖమ్మం జిల్లా ఏసీబీ డిఎస్పీ రమేష్ ఆదేశాల మేరకు వరంగల్ ఏసీబీ డీఎస్పీ



సాంబయ్య బృందం ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి దాడి చేశారు. గత కొద్ది రోజులుగా ఈ చెక్‌పోస్టులో అవినీతి జరుగుతోందని, రవాణా శాఖ అధికారులు రహదారిపై వెళ్లే వాహనదారులపై ఆర్టీఏ చట్టం ప్రకారం సరైన ఫైన్లు వేయకుండా లేదా వైలెట్ చేసిన వారికి ఫైన్లు వేయకుండానే ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు ఏసీబీ దృష్టికి వచ్చాయి. ముఖ్యంగా, ప్రభుత్వం చెక్‌పోస్టులను ఎత్తివేసినప్పటికీ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అదే స్థానంలో అనధికారికంగా చెక్‌పోస్టులను నిర్వహిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి.

పై అధికారుల సూచన మేరకు రంగంలోకి దిగిన వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, తమ ఇన్‌స్పెక్టర్ నట్ల రాజు, లావుడియా రాజులు బృందంతో కలిసి రాత్రి 12:30 గంటల నుంచి ఆదివారం ఉదయం 6.30 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సిబ్బంది వద్ద ఓవల్ ఓవర్ లోడ్ వాహనాల నుంచి ఫైన్ వేసినట్లుగా రసీదులు, పర్మిట్లు ఇచ్చినట్లుగా, టాక్సీ కలక్షన్ చేసినట్లు గాని ఎలాంటి ఓచర్లు లేని నగదు రూ. 25,100 అన్‌అకౌంటెడ్ (లెక్కల్లో చూపని) నగదును గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన నగదు పై చెక్ పోస్ట్ లో ఉన్న మోటార్ వెహికల్ ఇనిస్పెక్టర్ మనోహర్ ను వివరణ కోరిన ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో దాడి చేసిన డిఎస్పి సాంబయ్య తనిఖీల వివరాలపై సమగ్ర నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ప్రజలకు ఏవైనా ప్రభుత్వ ఉద్యోగులు తమ పనులు చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తే, వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సాంబయ్య విజ్ఞప్తి చేశారు.

# రేపటి నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

# బిసి గురుకుల డిగ్రీ కాలేజీలో బిఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో ప్రవేశాలు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెను కబడిన తరగ తుల సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థల సొసైటీ అధ్వర్యంలో కొనసాగుతున్న డిగ్రీ కాలేజీలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజేటిఏయు) అనుబంధ కాలేజీలో బిఎస్‌సి (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం ఈ నెల 21 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగుల సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశం కోసం ఇంటర్‌మీడియట్ (బైపీసీ గ్రూప్) దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు, తెలంగాణ స్టేట్ టీజీ ఈఏపీసెట్-2025 పరీక్షలో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యా ర్థినీవిద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సొసైటీ సెక్రటరీ సూచించారు. ఈ కోర్సు లో చేరడానికి దరఖాస్తు చేసుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ 1,50,000.. పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదా యం రూ. 2,00,000 మించకూడదని సూచించారు.

ఆసక్తి గల విద్యార్థులు ప్రాస్పెక్టస్‌ను పరిశీలించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం బిసి గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లను సందర్శించాలని తెలిపారు. ఈనెల 21 నుంచి 29వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు రుసుము రూ.1,000/ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. అభ్యర్థుల ఎంపిక టిజి ఎప్‌సెట్-2025 ర్యాంకుల ఆధారంగా జరు గుతుంద న్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు ఆఫీస్ పని దినాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 040-23328266 నంబరులో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చని, బిసి గురుకుల సొసైటీ మెయిల్‌కు మెయిల్ చేయవచ్చని గురుకుల సొసైటీ సెక్రటరీ బడుగు సైదులు సూచించారు.

# అగ్రవర్ణ పేదల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

### ఇబిసి జాయింట్ యాక్షన్ కమిటీ

**హైదరాబాద్, అక్టోబరు 19,ప్రభాతవార్త:** అగ్రవర్ణ పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ఇబిసి కమిషన్, ఇబిసి డిపార్టుమెంటర్ ఏర్పాటు చేయాలని ఫార్వర్డ్ క్యాస్ట్ ఇబిసి జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి రాష్ట్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో 18 అగ్రవర్ణ కుల సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. అగ్రవర్ణ పేదల విద్యాభివృద్ధికి ఇబిసి స్టడీ సర్కిళ్లు, ప్రత్యేక ఇబిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఇతర కులాల వారు ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకించటం సరికాదన్నారు. అగ్రవర్ణ నేతలను ఇష్టానుసారంగా దూషించడం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ మానసిక వేదనను గురిచేస్తున్న వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇబిసి హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిస్తామని తెలిపారు.

# ట్యాంక్ బరువుతో కుప్పకూలిన రేకుల హోటల్

### ప్రమాదంలో ఇద్దరు మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

**చిట్యాల రూరల్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** జాతీయ రహదారి పక్కన కొత్తగా నిర్మించిన ఓ హోటల్ పైకప్పు కూలిపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన విషాద ఘటన చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మాడ్గుల



పల్లికి చెందిన తగుళ్ల వెంకన్న పెద్దకాపర్తి శివారు లోని పెద్దచెరువు సమీపంలో 'డాంకిట్ ఫిల్టర్ కాఫీ' పేరుతో హోటల్ నిర్మించాడు. హోటల్ నిర్మా ణంలో భాగంగా పైకప్పు రేకులపై 2వేల లీటర్ల సామర్థ్యం గల సింటెక్స్ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం హోటల్ ప్రారంభో త్సవం ఉండటంతో శనివారం రాత్రి వెంకన్న కుటుంబంతో కలిసి హోటల్‌లో బస చేశారు. అదేరాత్రి వాటర్ ట్యాంక్‌ను నీటితో నింపగా, తెల్లవారుజామున నీటి బరువును తట్టుకోలేక పైకప్పు రేకులు కూలిపోయాయి. లోపల నిద్రిస్తున్న వెంకన్న భార్య నాగ మణి, కుమా రుడు విరాట్‌కృష్ణ, తల్లి పార్వతమ్మ, కూతురు నందిని తీవ్రంగా గాయపడ్డారు. వారిని నార్కట్‌పల్లి కామి నేని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగమణి (32), విరాట్ కృష్ణ (7) మృతి చెందారు. పార్వతమ్మ, నందిని పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలిం చారు. ఈ ఘటనపై హోటల్ యజమాని వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు. పెద్దకాపర్తి శివారు లోని పెద్దచెరువు బఫర్ జోన్‌లో అనుమతులు లేకుండానే హోటల్ నిర్మించినట్టు సమాచారం

# పుట్టింటికి వెళ్తూ ప్రమాదంలో దుర్మరణం

### బైక్‌ను ఢీ కొట్టిన కారు.. గృహిణి, ఆమె తమ్ముడు, చిన్నారి మృతి, మరో చిన్నారికి ఆస్పత్రిలో చికిత్స

### కాగజ్‌నగర్ మండలంలో పండగపూట విషాదం

**ఆసిఫాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల పరిధిలోని వంజిరి గ్రామంకు చెందిన అక్కను ఆమె కుమారుడు (అల్లునికి) వాంకిడి మండలం బెండరకు చెందిన తమ్ముడు దీపావళి పండుగకు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై పుట్టింటికి సంతోషంగా వెళ్తున్న క్రమంలో ఒక కారు వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన ఆదివారం ఆసిఫాబాద్ మండలంలో పండగ పూట విషాద ఘటన చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి గ్రామానికి చెందిన జగన్ (27), దోంగ్రి అను సూయ (32) ప్రజ్ఞోల్ 4, మరో పాపతో కలిసి దీపావళి పండగను జరుపుకొనేందుకు వాంకిడి మండలం లోని బెండార గ్రామానికి బయలు దేరారు. బైక్ ఎక్కించుకొని బెండారకు వస్తున్న క్రమంలో మోతుగూడ సమీపంలో బైక్ ను కారు వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో జగన్‌తో పాటు అక్క అనుసూయ, మేనల్లుడు ప్రజ్ఞోల్ అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఉన్న మరో పాప చికిత్స కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరం దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు నెల కొన్నాయి.

కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రమాదం తెలుసు కున్న సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు సంఘటన స్థలం చేరుకొని కుటుంబసభ్యు లను పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులపై ఎసిబి దాడులు

### లెక్కల్లో చూపని నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల దగ్గర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని ఆర్టీఏ చెక్‌పోస్టుల వద్ద అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి తనిఖీలను నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా పలు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులపై శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించారు. సోదాల్లో పలుచోట్ల లెక్కల్లో చూపని భారీ మొత్తంలో నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లాలోని మద్గి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరం భీం జిల్లాల్లోని పలు ఆర్టీఏ చెక్‌పోస్టుల వద్ద ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అధికారుల దాడుల్లో భాగంగా కొమరం భీం జిల్లాలోని బోరాజ్ చెక్ పోస్టులో రూ. 1,26,000, వాంకిడి చెక్‌పోస్టులో రూ. 5,100 అక్రమ నగదును అధికారులు సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సాలబత్ పూర్ ఆర్టీవో చెక్‌పోస్టులోనూ సోదాలు జరిగా యి. బిక్కనూరు మండలం పొందుర్తి ఆర్టీఏ చెక్ పాయింట్ వద్ద ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ. 51,300 స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతా ల్లోనూ మరో రూ. 3,000 పట్టుబడ్డాయి. దీపా వళి పండుగ వేళ... తెలంగాణ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లే వాహనదారుల నుంచి కొందరు సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులతో ఏసీబీ ఈ చర్యలు చేపట్టినట్టు తెలిసింది.

# పార్టీ ద్రోహులను శిక్షించండి

### మల్లోజుల, ఆశన్నలు పార్టీకి ద్రోహం చేసారు

### మావోయిస్టు కేంద్ర అధికార ప్రతినిధి అభయ్

**చర్ల, అక్టోబరు 19,ప్రభాతవార్త:** మల్లోజుల, ఆశన్నలు విప్లవ ద్రోహులుగా, పార్టీ విచ్ఛిన్నకు లుగా, విప్లవ ప్రతిఘాత కులుగా మారి శత్రువుకు లొంగిపోయారని వారిని పార్టీ అనుచరులకు తగిన శిక్ష విధించాల్సిందిగా మావోయిస్టు కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పత్రికలకు లేఖ విడుదల చేసారు.మల్లోజుల ఆశన్న ముఠాను పార్టీ నుండి బహిష్కరిస్తున్నాం. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు వివేక్, డీకే ఎస్.జెడ్.సీ. ప్రత్యమ్నాయ సభ్యురాలు దీప ( రనిత ) 10 మంది డివిజనల్ కమిటీ కంపెనీ పార్టీకమిటీ సభ్యులు, పార్టీ సభ్యులు, పీ.ఎల్.జీ.ఏ. సభ్యులు మొత్తం 61 మంది అక్టోబర్ 14 నాడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో గడ్చిరోలీలో పోలీసులకు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసారు. పార్టీకి విప్లవ ప్రజలకు చెందిన 50 తుపాకుల్ని శత్రువుకు అప్పగించారు. ఈ లొంగుబాటు విప్లవ ద్రోహం, పార్టీ విచ్ఛిన్నకర చర్య అని అభివర్ణించారు.2011 చివరి నుండి గడ్డు స్థితిని ఎదుర్కొంటూ వచ్చిన దండకారణ్య విప్లవోద్యమం, దేశవ్యాప్త విప్లవోద్యమం 2018 నాటికి తాత్కాలిక వెనకంజకు గురయ్యాయి. అప్పటినుండి మల్లోజులలో రాజకీయ బలహీనతలు బయటపడుతూ వచ్చాయి. 2020 డిసెంబర్ లో జరిగిన కేంద్రకమిటీ సమావేశంలో సోను దండకారణ్య విప్లవ ఆచరణలోని కొన్ని లోపాలపై స్వీయాత్మక విశ్లేషణతో కూడిన నిర్ధారణలు చేస్తూ ఒక పత్రాన్ని ప్రవేశపెట్టాడు. దాన్ని కేంద్రకమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత ఎప్పటికప్పుడు జరుగుతూ వచ్చిన కేంద్రకమిటీ (సీసీ), పొలిట్ బ్యూరో (పీబీ) సమావేశాల్లో ఆయనలోని తప్పుడు రాజకీయ భావాలను విమర్శించి, సరిదిద్దడానికి సెంట్రల్ కమిటీ కృషి చేసింది అయినా 2011లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్లీనం మల్లోజుల వ్యక్తివాదాన్ని అహంభావాన్ని, తీవ్రమైన పెత్తందారీతనాన్ని (బ్యూరాక్రసీని) తీవ్రంగా విమర్శించి, వాటిని సరిదిద్దుకోవాలని కోరింది. ఆ తర్వాత జరుగుతూ వచ్చిన డీకే ఎస్.జెడ్.సీ. సమావేశాల్లో ఎస్. జెడ్.సీ. సభ్యులు ఆయన్ను విమర్శించారు.

2025 మే నెలలో జరిగిన కగార్ దాడిలో మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు (బసవరాజు) చనిపోయిన తర్వాత సోనులో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ బలహీనతలు గుణాత్మక మార్పును సంతరించుకుని శత్రువు ముందు మోకరిల్లేలా చేసాయి. 2024 జనవరి నుండి మొదలయిన విప్లవ ప్రతిఘాతక కగార్ యుద్ధంతో విప్లవకారులందరు, విప్లవ ప్రజలందరు ప్రతిరోజూ శత్రు దాడులను ఎదుర్కొంటూ పనిచేసే పరిస్థితి ఏర్పడింది. సోనులో పెరుగుతూ వచ్చిన స్వార్థం ఆ త్యాగానికి సిద్ధపడని స్థితికి ప్రాణభీతికి దారితీసింది. ఈ విషయాన్ని నిజాయితీతో అంగీకరించడానికి ఆయన సిద్ధపడలేదు. కానీ ఆయన తనలో దీర్ఘకాలంగా ఉన్న అహంభావాన్ని సరిదిద్దుకొని ఫలితంగా తన బలహీనతలకు, ప్రాణభీతికి ముసుగు కప్పి పార్టీ అనుసరిస్తున్న తప్పుడు రాజకీయ సైనిక పంథా (వ్యూహం) ఫలితంగా భారత విప్లవోద్యమం ఓటమి పాలయ్యే స్థితికి దారి తీసిందని, ఈ స్థితిలో ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి, తాత్కాలిక సాయుధ పోరాట విరమణ చేయడం మినహా మరో మార్గం లేదనే మితవాద అవకాశవాద, రివిజనిస్టు వైఖరితో కూడిన లొంగుబాటు పత్రికా ప్రకటనను విడుదల చేసాడు.

వస్తుగత స్థితిని, స్వీయాత్మక స్థితిని, శత్రు బలాబలాలను, ఉద్యమ బలాబలాలను వాస్తవికంగా విశ్లేషిస్తారు. అందులో భాగంగా అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులను విశ్లేషిస్తారు. కానీ ఆయన ఈ మధ్య రాసిన వ్యాసాల్లో, ప్రజలకు విజ్ఞప్తి, కేడర్లకు విజ్ఞప్తి పత్రాల్లో, సెప్టెంబరు 15న విడుదల చేసిన పత్రికా ప్రకటనలో దీనికి భిన్నమైన బూర్జువా స్వీయాత్మక విశ్లేషణ పద్ధతి ఉంది. నిజంగా సోనుకు తను రాసిన వాటిపై విశ్వాసం ఉంటే పార్టీలో ఉంటూ కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో చర్చించడానికి సిద్ధపడాలి.ప్రాణ త్యాగానికి సిద్ధపడి విప్లవానికి నాయకత్వం వహిస్తూ తన అభిప్రాయాలను వాదనలను పార్టీతో చర్చించి కృషిచేసి ఉంటే బాగుండేదని అలా కాకుండా లొంగిపోయాడని అన్నారు. అలా కాకుండా వివిధ స్థాయి కేడర్లకు తప్పుడు సంకేతాలు ఇస్తూ పార్టీ సభ్యులలో విభేదాలు సృష్టించి విచ్ఛిన్నం చేసే చర్యలకు పూనుకున్నాడని లేఖలో తెలిపారు.

ఇలాంటి ఒడిదొడుకులను ఎన్నోసార్లు చవి చూసామని ఎంత అనిచి వేసిన ద్రోహం చేసినా పార్టీ మరింత పుంజుకుంటుందని అన్నారు.విప్లవోద్యమాన్ని పురోగ మనం కోసం మరింత ఆత్మవిశ్వాసంతో ధైర్య సహాసాలతో ముందుకు సాగుతామని అంతిమ విజయం ప్రజలదేనని అభయ్ పేరిట పత్రికలకు పంపిన లేఖలో పేర్కొన్నారు.



# న్యూఢిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాల్సిందే!

### ఢిల్లీ మంత్రి కపిల్‌మిశ్రాకు విహెచ్‌పి లేఖలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** దేశరాజధాని న్యూఢిల్లీ నగరం పేరును 'ఇంద్రప్రస్త'గా మార్చాలని విశ్వహిందూపరిషత్ ఆదివారం డిమాండ్‌చేసింది. ఢిల్లీ సాంస్కృతిక మంత్రి కపిల్‌మిశ్రాకు లేఖకూడా రాసింది. అలాగే ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును ఇంద్రప్రస్థఅంతర్జాతీయ విమానా శ్రయంగాను, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌ను కూడా ఇంద్రప్రస్థ రైల్వేస్టేషన్, షాజహానాబాద్ డెవలప్ మెంట్‌బోర్డును ఇంద్రప్రస్త డెవలప్‌మెంట్ బోర్డుగా పేర్లు మార్చాలని విహెచ్‌పి ఢిల్లీ మంత్రికి రాసిన లేఖల్లో వివరించింది. ప్రాచీన చరిత్ర, సంస్కృతికి ప్రతిబింబంగా ఢిల్లీనగరం పేరునిలుస్తుందని అందుకే ఇంద్రప్రస్థగామార్చాలని డిమాండ్‌చేస్తున్నట్లు వివరించింది. ఇంద్రప్రస్థ పేరు ఈనాడు కొత్తగా వచ్చింది కాదని ఐదువేల ఏళ్ల క్రితమే ఈ పేరు వాడుకలో ఉందని ఢిల్లీ విహెచ్‌పి కార్యదర్శి సురేంద్ర కుమార్ గుప్తా అన్నారు. ఢిల్లీ వారసత్వ సాంప్రనదాయం అంతాకూడా కోటలు, దేవాలయాలు, హిందూ రాజుల చుట్టూనే ఉండాలని నగరం మొత్తం చరిత్ర హిందూసాంప్రదాయం ప్రతిబింబించేదిగా లేదని ఆయన పేర్కొన్నారు. పాండవుల కాలంలోని స్థలాలు, కోటలు ముస్లింలు దండయాత్రలు చేసి ఆక్రమించు కున్నారరని, అందువల్ల పాండవుల కాలంనాటి స్మృతిచిహ్నాలను ముస్లిం చిహ్నాల సమీపంలోనే ఏర్పాటు చేయాలని కోరారు. కింగ్ హేమచంద్ర విక్రమాదిత్య పేరిట ఒక మిలిటరీస్కూలును కొనసాగించాలని గుప్తాడిమాండ్‌చేసారు. చరిత్రకారులు, పరిశోధకులు ఇచ్చిన సలహాలు సూచనలు ఆధారంగానే పేర్లు మార్చాలని ప్రతిపాదిస్తున్నట్లు విహెచ్‌పి కార్యదర్శి వెల్లడించారు.

# పప్పుదినుసుల విత్తనం పంపిణీ

### రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త :** రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా జాతీయ ఆహార భద్రతా పథకంలో మైలైన పప్పుదినుసు వంగడాల విత్తనం పంపిణీకి చర్యలు చేపట్టాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో వరితో పాటు, పప్పుదినుసులు, నూనె గింజల సాగును కూడా పెంచే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇందులో భాగంగా ఈ యాసంగిలో రూ.2.68 కోట్ల సబ్సిడీతో 19,397 ఎకరాలకు సరిపడా 5825 క్వింటాళ్ల శనగ విత్తనాలు 14 జిల్లాలలో పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. ఇటీవల పంపిణీ చేసిన వేరుశనగతో పాటు, హైబ్రిడ్ పొద్దుతిరుగుడు (83.78 క్వింటాళ్లు) సీడ్, 74 క్వింటాళ్ల కుసుమ విత్తనాలకు 45.41 లక్షల మొత్తాన్ని వినియోగించి పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ 2025-26 లో రూ.48.54 కోట్లతో జాతీయ ఆహార భద్రత పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. అలాగే ఇప్పటికే వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. ఇక గత సీజన్ లో జిల్లాకు ఎంపిక చేసిన ఒక మండలంలో 1.39 లక్షల మట్టి నమూనాలు సేకరించి, వాటి విశ్లేషణ పూర్తి చేసి ఫలితాలు అందచేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఇంకో 1.70 లక్షల మట్టి నమూనా ఫలితాలు విశ్లేషణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. నేచురల్ ఫార్మింగ్‌కు అత్యంత ప్రాధాన్య మిస్తున్నట్లు చెప్పారు. దీని క్రింద క్లస్టర్ల గుర్తింపు మరియు శిక్షణ పూర్తితో పాటు, మరోవైపు వానాకాల పంటల కొనుగోళ్ల ప్రక్రియ, ఇంకోవైపు యాసం గి పథకాల అమలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్ర రాష్ట్ర వాటాలతో అమలు అయ్యే పథకాలన్నింటినీ ఒక్కొక్కటిగా పునరుద్ధరిస్తూ, గరిష్ట స్థాయిలో రైతుల ప్రయోజనం చేకూరేలా వ్యవసాయ మరియు ఉద్యాన శాఖలు చర్యలు చేపట్టాయని తెలియజేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతో రాష్ట్ర రైతాంగం గత పదేళ్లలో దాదాపు రూ.3 వేల కోట్ల మేర నష్టపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను పూర్తి స్థాయిలో వాడుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. దానికి తగ్గ రాష్ట్రవాటా నిధులు విడుదలచేసి రాష్ట్ర రైతులకు ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి పరమావధిగా పేర్కొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో గిరిజన సహకార సంస్థ

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో భారీ మొత్తాలు కేటాయిస్తున్నారు. కానీ, కేటాయించిన నిధుల్లో విడుదలవుతున్నది మాత్రం అతి తక్కువ శాతమే. 2024-25లోనూ 360 కోట్లు కేటాయించినా. ఒక్క పైసా విడుదల కాలేదు. ఆ నిధులను కూడా ఈ ఏడాది విడుదల చేసి ఖర్చు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ట్రైకార్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌లో ట్రైకార్‌కు రూ.2,300 కోట్లు కేటాయించింది.

# దారుణంగా పడిపోయిన నిమ్మ

### ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త :** నిమ్మ రైతులు కనీవినీ ఎరుగని రీతిలో నష్టాలను చవిచూస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో కిలో వంద రూపాయలకు పైగా పలికిన నిమ్మ ధర ప్రస్తుతం దారుణంగా పతనమై కిలో 15 నుంచి 20 రూపాయలకే పరిమితమైంది. ఈ ఊహించని ధరల పతనంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏడాదిన్నర పాటు మార్కెట్లో నిమ్మ ధరలు ఆశా జనకంగా ఉండటంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ప్రస్తుతం ఒక్కసారిగా ధరలు తగ్గడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఇదే సమయంలో కిలో 100 రూపాయల నుంచి 200 రూపాయల వరకూ పలికిన ధర ఇప్పుడు 20 రూపాయల కంటే తక్కువగా ఉండటం రైతులను ఆందోళనలకు గురి చేస్తోంది. రాష్ట్రంలో పండే 90 శాతం నిమ్మ ఒక్క ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే సాగవుతోంది. ఇక్కడి నుంచే దిల్లీ, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు నిమ్మ ఎగుమతి జరుగుతుంది. ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వేల ఎకరాల్లో నిమ్మ సాగు చేస్తూ లక్షల రూపాయల్లో ఖర్చు చేసిన రైతాంగం పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం ఒక బస్తా కాయలు రూ.50 నుంచి రూ.100 ఉండగా, పచ్చివి రూ.100 నుంచి రూ.200లకు మించి పలకడం లేదు. కూలీలు, ఆటో కిరాయిలు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో చాలా తోటల్లో కాయలు కోయకుండానే చెట్లకే వది లేస్తున్న దుస్థితి నెలకొంది. లక్షలు వెచ్చించి తోటలు కొన్నవారు, అధిక మొ త్తంలో కౌలుకు తీసుకున్నవారు అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పెట్టిన పెట్టుబడిలో సగం కూడా దక్కడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు, దళారులు కుమ్మక్కై కృత్రిమంగా ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు అకాలవర్షాలు కూడా పంటదిగుబడి, నాణ్యతపై ప్రభావం చూపా యని, ఇది కూడా ధరల పతనానికి కొంత కారణమని చెబుతున్నారు.

మీకు వీలైనంతవరకు ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఉండండి. అది కారు చౌక అయిన ఔషధం.

న-బైరన్

# కొండెక్కుతున్న చమురు దీపాలు!


రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును ఆపేస్తోంది. ఇది అమెరికా కాలజ్ఞానులమదిలోని మాట. కొండొకచే మతిలేని మాట అని కూడా అనుకోవచ్చు. భారత ప్రధాని నరేంద్రమోడీ ఈ విషయాన్ని తమ చెవిలో చెప్పినట్లు వారు సకల లోకానికి ఢంకా భజాయించి చెబుతున్నారు. ఒకపక్క భారత్‌పై అనేక రకాల సుంకాలు విధిస్తూ ఎలాగైనా లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్న అమెరికా పాలకులు భారత్ ప్రమేయం లేకుండా ఇలాంటి ఫీలర్‌లు వదలడం దేనికోసమో అర్థం చేసుకోలేని విషయం కాదు. ఆదినుంచి రష్యాతో భారత్ చమురు వ్యాపారం చేయడం అమెరికన్ పాలకులకు సుతరామూ ఇష్టంలేదు. అలా చేయడంవల్లనే ఉక్రెయిన్‌పై రష్యా తెగబడుతోందని ఏవేవో అలనికాని మాటలు చెప్పడం అలవాటు చేసుకొంది. ఇదే రష్యా అమెరికాకు మరికొన్నియూరప్ దేశాలకు చమురు దిగుమతి చేస్తోంది. అయినా ఏ కారణం చెప్పినా ఎందుచేతనో అమెరికా భారత్‌ను మాత్రమే రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకుండా ఆపాలని శతవిధాల ప్రయత్నిస్తోంది. కానీ భారత్ అమెరికా ఆంక్షలకు లొంగేటట్లులేదు. పైగాభారత్ ఆర్థికాభివృద్ధికి ఇప్పటికే అన్నివిధాల సహాయసహకారాలను అందిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాది మర్ పుతిన్ భరోసా ఇచ్చారు. పైగా చైనాతో చెలిమి కూడా దక్కింది. తమకు రష్యాచమురు చౌకగా దిగుమతి అవుతున్నప్రస్తుత పరిస్థితుల్లో రష్యానుంచి చమురు కొనుగోలు ఆపేపరిస్థితి తలెత్తదు. రష్యాతో భారత్ వ్యాపార వాణిజ్య సంబంధాలు పెంచుకుంటే భారత్‌కు తన అవసరమేమీ ఉండదనే ధోరణిలో రష్యా, భారత్‌ల మధ్య సాన్నిహిత్యాన్ని తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'మిత్ర బేధం' వ్యూహాన్ని పన్నారు. పైగా మోడీ తనతో ఎప్పుడు, ఎక్కడ, ఎలాంటి సంద ర్భంలో 'రష్యాతో చమురు కటీఫ్' అన్నారో చెప్పలేకపోతున్నారు. ఏదో అస్పష్టంగా కేవలం ఆయా దేశాల మధ్యవిబేధాలు కల్పించడానికే 'ఉత్తినే' అన్నమాటలుగా జనం కొట్టేస్తున్నారు. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం కొన సాగడానికి భారత్ ఎలాంటి సహాయమూ అందించడం లేదు. పైగా ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాకనే కాగితం ఖరీదుపెరిగింది. దాని ప్రభావం భారత దేశం మీడియా మీద కూడా ఉంది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నారన్న కారణంతో భారత్‌పై అమెరికా 25 శాతం ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ పెంచింది కూడా. అయినా భారత్ మౌనంగానేఉంది. నిజానికి రష్యా నుంచి తక్కువ ధరకే భారత్ చమురు దిగుమతి చేసుకుంటోంది. ఒపెక్ దేశాలు అమ్మే బ్రెంట్ క్రూడ్ కన్నా తక్కువ ధరలకేమనకు చమురు అందుతోంది. దాంతో ఈ చమురును భారతదేశ రిఫైనరీలు శుద్ధిచేసి మార్కెట్ రేట్లకు ఇతర దేశాలకు ఎగుమతి చేసి లబ్ధి పొందుతోందన్న విషయం అందరికీ తెలిసిందే. రష్యా క్రూడ్ రాయితీల కారణంగా భారత్ సాలీనా రూ.22వేల కోట్లమేర రాయితీలు పొందుతోంది. ఒకానొక దశలో ఉక్రెయిన్ రష్యా యుద్ధాన్ని ఆపడానికి భారత్, చైనాల 100శాతం సుంకాల ఆంక్షల ద్వారా రష్యాను బలహీనపరచాలని, ఆ దేశ ఆర్థిక సంపత్తిపై దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తోన్నమాట అక్షరాలా నిజం. నాటో దేశాలు సైతం రష్యా నుంచి చమురు ఉత్పత్తులు, పలు రకాల ఇంధనాలను దిగుమతి చేసుకోవడం క్షమించరాని నేరమంటూ ట్రంప్‌ఏనాడో అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్రంప్ వైఖరి, వాచాలతలను పూర్తిగా అధ్యయనం చేశాకనే అసలు విదేశీ పరాధీనతను తగ్గించుకోవాలని భారత ప్రధాని ఆ నినాదాన్ని చేపట్టారు. చమురు దిగుమతి, శుద్ధికేంద్రాల్లో శుద్ధి జరిగాక కొంతలాభంతో ఇతరులకు అమ్మ డం ద్వారా లబ్ధి పొందుతున్న భారత్ రష్యా చమురు కొనుగోలు కోసం మరోదారి పట్టుందనేది కల్ల. ఈ సందర్భంలో ట్రంప్ మోడీ పేరిట చెబుతున్న ఏవిషయమైనా, ఎలాంటి వ్యాఖ్యానమైనా ఆయన నోటంట చెబితే ఎలాంటి పరిస్థితుల్లోనూ నమ్మనక్కర్లేదు. అంతేగాక ఏ దేశంతో వ్యాపార సంబంధాలు పెట్టుకోవాలో ఎవరితో పెట్టుకోకూ డదో నిర్దేశించగల శక్తి ఏ ఇతర దేశానికీలేదు. అలాంటి సందర్భాలను విశ్లేషించుకోగలిగితే అంతర్జాతీయ స్థాయిలోవిధాన నిర్ణయం చేయగలస్థితి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికే ఉంటుంది. రష్యా నుంచి ప్రతిరోజు 17లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఆ మధ్య ఉక్రెయిన్ వార్‌లో చమురు శుద్ధికర్మాగారాలు దెబ్బతిన్నప్పుడు మాత్రమే చమురు సరఫరా తగ్గింది. భారత్ కూడా ప్రత్యామ్నాయాల కోసం ఎదురు చూసింది. అంతే తప్ప రష్యానుంచి చమురు దిగుమతి ఆపే ప్రసక్తేలేదని భారత్ ఏనాడో స్పష్టంచేసింది. అయినా ట్రంప్ భారత్, రష్యాల మధ్యవిబేధాలు సృష్టించేందుకే ఇలాంటి వ్యూహంతో సమస్యను తీవ్రతరం చేస్తున్నారు. కేవలం భారత్ ఇంధన అవసరాలకు మాత్రమే చమురు కొనుగోలు చేస్తున్నామని ఎన్నోసార్లు భారత్ చెప్పజూసినా అమెరికా వినే పరిస్థితి లేదు. ఇంతకుముందు చమురు దిగుమతులుతగ్గి సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు కూడా వెనిజులా, ఇరాన్‌ల నుంచి చమురు కొనుగోలు చేయాలని తలపెట్టినప్పుడు భారత్‌కు అమరికా ఎలాంటి చేయూతనంద్వివలేదు. పైగా రష్యా నుంచి చమురు దిగుమతులు ఆపేయాలని ఒత్తిడిచేయడం అమెరికా అవివేకాన్ని తెలుపుతోంది. రష్యాతో మనది చిరకాల మైత్రి అని తెలిసినా అమెరికా భారత్‌పై ఒత్తిడి చేయడం పరోక్షంగా ఇతరదేశాల మధ్య భారత్ ప్రతిష్టను ప్రధాని మోడీ గౌరవాన్ని మసకబార్చేందుకు చేసేప్రయత్నంగాకనపడుతోంది. ఒకపక్క అమెరికా భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే చర్చలు సాగుతుండగా మరోపక్క ట్రంప్ చౌకబారు ఎత్తుగడలు ఎవరికి లాభమో!

చెడును విస్మరించి మంచిని సంస్కరించి సంరక్షించుకోవడం యోగ్యత లక్షణం.



స్వామి వివేకానంద

మానవజాతిని మార్చాలని ప్రతివాడూ చూస్తాడు. కాని తనను తాను మార్చుకోవాలని మాత్రం ఎవరూ చూడరు.



లియో టాల్‌స్టాయ్

# విత్తన పరాధీనత నుంచి బయటపడలేమా?

**విత్తన ఒడంబడికలో ప్రతిపాదించిన సవరణ ప్రతిపాదనలు రైతుల హక్కులను, ఆయా దేశాల విత్తన సార్వభౌమత్వాన్నిహరించి, విత్తనాలపై పూర్తిగా బహుళ జాతి సంస్థల ఆధిపత్యం ఏర్పడేందుకేనని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. దేశాల సాంప్రదాయ విత్తనాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. బహుళజాతి సంస్థల విత్త నాలనే అధిక ధరలకు ప్రతి సంవత్సరం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. భారతదేశంలో పత్తి విత్తనాలను మోన్శాంటో అధిక ధరలకు అమ్ముతున్న అనుభవం ఉంది. విత్తన ఒడంబడికలో చేయనున్న సవరణ ప్రతిపాదనలు ఆమోదం పొందితే, వేలాది సంవత్సరాలుగా విత్తనాలపై సార్వభౌమాధికారం కలిగిన దేశాలు, రైతులు ఆ విత్తనాలపై హక్కును కోల్పోతారు. విత్తన పరాధీనత ఏర్పడుతుంది. రైతుల విత్తన హక్కులను హరించే అంతర్జాతీయ విత్తన ఒడంబడికను, దానికి తలపెట్టిన సవరణలను ఉపసంహరించాలని అన్ని దేశాల రైతాంగం తక్షణ కర్తవ్యం ఉద్యమించటమే.**

బొల్లిముంతసాంబశివరావు

అంతర్జాతీయ విత్తన ఒడంబడికకు 2025 నవంబర్ 24 నుంచి 29 వరకు పెరూ దేశంలోని లిమాలో జరగనున్న 11వ పాలకమండలి సమావేశంలో వర్కింగ్ గ్రూపు ప్రతిపాదించే సవరణ ముసాయిదాపై చర్చ జరగనుంది. ఈ సవరణలను ప్రపంచ రైతుకూటమి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఒక దేశం వ్యవసాయ వారసత్వాన్ని లేదా జన్యుపరమైన వనరులను ఇతరదేశాలకు ఇచ్చిపుచ్చుకోవటానికి ఎటువంటి నియమనిబంధనలు పాటించాలో నిర్ణయించేందుకు ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ )అంతర్జాతీయ ఒడంబడికను 2002లో కుదిర్చింది. దాని పేరే యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ ట్రీటీ ఆన్ ప్లాంట్ జనటిక్ రిసోర్సెస్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్. ఈ ఒడంబడికపై భారత్ సహా 154 దేశాలు సంతకాలు చేశాయి. 2004 నుంచి ఈ ఒడంబడిక అమల్లోకి వచ్చింది. దీన్ని సభ్యదేశాలన్నీ విధిగా పాటించాలి. దీని ప్రభావం వారసత్వ మేధా హక్కులపై గణనీయంగా ఉంటుంది. 64 రకాల విత్తనాలు, మొక్కలు, వంగడాలు దీని పరిధిలోకి వస్తాయి. ప్రపంచంలో ఈపంటలకు సంబంధించిన 70లక్షలకు పైగా విత్తనాల నమూనాలు అంతర్జాతీయ స్థాయిలో విత్తన నిధుల్లో అందుబాటులోకి వచ్చాయి. ఈ విత్తనాలను ఉపయోగించుకుని సరికొత్త వంగడాల తయారీపై 28 వేలకు పైగా విత్తన సంస్థలు పరిశోధనలు చేస్తున్నాయి. వీటిల్లో బేయర్, కోర్టెవా, సిజెంటా, బిఎఎస్ఎఫ్‌ఎమ్ కంపెనీలు విత్తన రంగంపై ఆధిపత్యం చలాయిస్తున్నాయి. విత్తనం ప్రకృతి మనుగడకు, ఆహార భద్రతకు, వ్యవసాయానికి, విత్తనంపై రైతుల సాంప్రదాయ పారంపర్య హక్కులకు మూలాధారం. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో ప్రత్యేక విత్తనాలు, వంగడాలు ఉన్నాయి. స్వతంత్రమైన దేశంలో అనాధిగా ఉన్న విత్తనాలు, మొక్కలు, వంగడాలు వాటి జన్యవనరులు ఆ దేశం సొత్తు. వేలాది సంవత్సరాలుగా వీటిని సాగు చేస్తూ, తమ పొలాల్లో సేద్యానికి, ఇతర రైతులతో పంచుకుంటూ జీవనం సాగిస్తున్న రైతాంగం సొత్తు విత్తనం. ఐక్యరాజ్యసమితిలో పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యమే కొనసాగుతున్నది. అమెరికా, యూరోపియన్ దేశాలు ఐక్యరాజ్యసమితిని శాసిస్తున్నాయి. ఫలితంగా అది తీసుకునే నిర్ణయాలు పెట్టుబడిదారీ దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటున్నాయి. దాని నేతృత్వంలో కుదిరిన విత్తన ఒడంబడిక కూడా అందుకు మినహాయింపు కాదు.




ఈ ఒప్పందం పెట్టుబడిదారీ దేశాల బహుళజాతి విత్తన సంస్థల ఆధిపత్యాన్ని నెలకొల్పే విధంగా ఉంది. వెనకబడిన దేశాల విత్తన జన్యువులను సేకరించి తమవద్ద ఉన్న టెక్నాలజీతో అభివృద్ధి చేసిన విత్తనంపై బహుళజాతి సంస్థలుపేటెంట్ హక్కులు పొంది, వాటి అనుమతి లేకుండా ఏ దేశ రైతులు ఉపయోగించినా నేరంగా పేర్కొన్నాయి. తమ విత్తన జన్యువుల ద్వారా తయారు చేసిన విత్తనాలను వెనుకబడిన దేశాలు ఉపయోగించుకునే హక్కును బహుళజాతి సంస్థల పేటెంట్ హక్కు హరిస్తుంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు ముందుకు తెచ్చిన ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాలు, విత్తనాలపై మేధోసంపత్తి అనే దాన్ని రక్షించడానికి అనేక నిబంధనలను కలిగి ఉన్నాయి. అటువంటి పెట్టుబడులను స్వాధీనం చేసుకుంటే లేదా జాతీయం చేస్తే లేదా వాటి నుండి ఆశించిన లాభాలు ప్రమాదంలో పడితే అప్పుడు ఆదేశాలకు చెందిన విత్తన సంస్థలు పెట్టుబడి ఉన్న దేశాలపై కోర్టులో దావా వేయవచ్చు. దీన్ని గమనిస్తే అంతర్జాతీయ విత్తన ఒడంబడిక బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసమే అన్న వాస్తవం వెల్లడి అయ్యింది. ఇంత ప్రమాదకరమైన బహుళజాతి సంస్థల విత్తన వ్యాపారాలకు భారత దేశ పాలకులతో పాటు అనేక దేశాల పాలకులు అనుమతించడం వారి రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఒడంబడిక జరిగి 20 సంవత్సరాలు గడిచిన తర్వాత ఇప్పుడు సవరణల ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఈ సవరణ ప్రతిపాదనలు రైతాంగ హక్కులకు భంగం కలిగించేవిగా ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా రైతు సంఘాలు, రైతాంగం వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 64 విత్తనాలతో పాటు ఇతర మొక్కల జన్యువులను కూడా చేర్చాలన్న ప్రతిపాదన సవరణల ముసాయిదాలో ఉందని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. విత్తన ఒడంబడికలో ప్రతిపాదించిన సవరణ ప్రతిపాదనలు రైతుల హక్కులను, ఆయా దేశాల విత్తన సార్వభౌమత్వాన్నిహరించి, విత్తనాలపై పూర్తిగా బహుళజాతి సంస్థల ఆధిపత్యం ఏర్పడేందుకేనని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. దేశాల సాంప్రదాయ విత్తనాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. బహుళజాతి సంస్థల విత్తనాలనే అధిక ధరలకు ప్రతి సంవత్సరం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. భారతదేశంలో పత్తి విత్తనాలను మోన్శాంటో అధిక ధరలకు అమ్ముతున్న అనుభవం ఉంది. విత్తన ఒడంబడికలో చేయనున్న సవరణ ప్రతిపాదనలు ఆమోదం పొందితే, వేలాది సంవత్సరాలుగా విత్తనాలపై సార్వభౌమాధికారం కలిగిన దేశాలు, రైతులు ఆ విత్తనాలపై హక్కును కోల్పోతారు. విత్తన పరాధీనత ఏర్పడుతుంది. రైతుల విత్తన హక్కులను హరించే అంతర్జాతీయ విత్తన ఒడంబడికను, దానికి తలపెట్టిన సవరణలను ఉపసంహరించాలని అన్ని దేశాల రైతాంగం తక్షణ కర్తవ్యం ఉద్యమించటమే. •

# పేద విద్యార్థులకు వరంగా 'విద్యాశక్తి'

వి.వి. రమణ

భారత సమాజంలో అన్ని వర్గాల వారికి ఏ విధమైన తారతమ్యాలు లేకుండా విద్యావకాశాలను అందించాలన్నారు మన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి అయినాఅబుల్ కలాం ఆజాద్. ఆ విధంగానే అందరికి సమాన విద్యా అవకాశాలు కల్పించేందుకు, పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అభ్యసించేందుకు 'విద్యా శక్తి' అనే రూపంలో మార్గాన్ని వేసింది మన రాష్ట్ర విద్యాశాఖ. విద్యాశాఖ చేపడుతున్న మార్పులలో భాగంగా రెండు ముఖ్య విషయాలను గమనించవచ్చు. అందులో ఒకటి 'విద్యా శక్తి' రూపంలో సమాన విద్య. ఇక్కడ గమనించగల సమాన విద్య అనగా పట్టణాలకు దగ్గర ఉన్నవారు లేదా ధనం ఉన్నవారు నీట్, జేఈఈ, ఎంసెట్ లాంటి కోచింగ్స్‌కు వెళ్లి తమ జీవిత లక్ష్యమైన ఉన్నత విద్యకు మార్గాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. మరి అలాంటి వారితో పాటు పేద విద్యార్థులు, గ్రామీణ ప్రాంత విద్యార్థులను వారితో సమానం చేయు ఉద్దేశంతో అలానే వారి ఉన్నత విద్యకు మార్గం అందించేందుకు అవే నీట్, జేఈఈ, ఎంసెట్ లాంటి కోచింగ్స్‌ను ప్రభుత్వ పాఠశాల కళాశాలలు అయినా ఏపీమోడల్ స్కూల్స్, ప్లస్ టు స్కూల్స్ లాంటి వాటిలో చదువుతున్న విద్యార్థులకు విద్యాశక్తి రూపంలో ఉన్నత విద్యను చేరువ చేయడం చేస్తుంది విద్యాశాఖ. రెండవ విషయాన్ని పరిశీలిస్తే ఇదే విద్యాశక్తిని ఆసరా చేసుకుని ఉన్నత విద్యను అందుకోవడం తద్వారా పేద విద్యార్థులు నవీన తరగతులైన టెక్నికల్ ఎడ్యుకేషన్ అందిపుచ్చుకొని వారి కలలను సాకారం చేసుకొనుటకు అవకాశం ఉన్నదనిపిస్తుంది ఇది చూసేవారికి. అయితే ఇలా విద్యాశక్తి ద్వారా ఉన్నత విద్య కొరకు ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో నీట్, జేఈఈ, ఎంసెట్‌లకు కోచింగ్ తరగతులు ప్రారంభించినట్లు పబ్లిసిటీ లేకపోవుట వలన కొంతమంది విద్యార్థులకు ఇది మంచి అవకాశం అనే అవగాహన లేకపోవడం లాంటి పరిస్థితులు ఉండకుండా జాగ్రత్త పడాలని విద్యావేత్తలు అభిప్రాయాలు వ్యక్తపరచవలసిన పరిస్థితి ఎదురవుతున్నాయి. గత సంవత్సరంలో విద్యాశక్తి ద్వారా సుమారుగా 1800 మంది విద్యార్థులకు మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ల ద్వారా ఆన్లైన్ కోచింగ్ అందించగా అది ఆశాజనకమైన ఫలితాలను అందించటం జరిగింది. దీనిని అనుసరించి ఈ విద్యా సంవత్సరం మొదటి నుండే ఏపీ మోడల్ స్కూల్స్ ప్లస్ టు స్కూల్స్ లాంటి వాటిలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఎంసెట్, నీట్, జెఇఇలాంటి కోచింగ్స్‌ను అందించేందుకు ఇంటర్ మొదటి సంవత్సరం నుండే కోచింగ్ క్లాస్‌లను ఆన్లైన్, ఆఫ్లైన్ ద్వారా ప్రారంభించడం అనే నిర్ణయం విద్యాశాఖ తెచ్చిన సంస్కరణలో ఇదొక గొప్ప మైలురాయి అనే విషయాన్ని ఘంటాపథంగా చెప్ప వచ్చునే అభిప్రాయం కలుగుతుంది నేటి సమాజానికి. మన భవిష్యత్తు తరాలైన నేటి విద్యార్థులు దీనిని ఉపయోగించుకునేందుకు, ఈపరిస్థితులు అనుకూలంగా ఉండేందుకు వీటిపై పర్యవేక్షణను సైతం విద్యాశాఖ వారు టాప్ ప్రయారిటీ ఇవ్వడం చూస్తే ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండ వచ్చునే అభిప్రాయం కలగక మానదు ఇది చూసేవారికి. విద్యా సౌకర్యాల కల్పనలో ప్రాంతీయ అసమానతలను సవరించాలి. గ్రామీణ, ఇతర వెనుకబడిన ప్రాంతాలలోమంచి విద్యా అవకాశాలు కల్పించాలని జాతీయ విద్యా విధానం నొక్కి చెప్పింది. తదణుగుణంగా విద్యాశక్తి ద్వారా పట్టణ ప్రాంత విద్యార్థులకు ఏ విధంగా అయితే ఉన్నత విద్యా అవకాశాలకు కోచింగ్ అందుబాటులో ఉన్నదో అదే మాదిరిగా గ్రామీణ విద్యార్థులకు నీట్, జెఇఇ, ఎంసెట్ లాంటి కోచింగ్స్ అందుబాటులోకి తెచ్చింది మన రాష్ట్ర విద్యా కార్యక్రమమైన విద్యాశక్తి. అందుకనే ఇది జాతీయ విద్యా విధానం ఆశయాన్ని సైతం నెరవేరుస్తున్నట్లుగా ఉన్నదని అభిప్రాయం కలుగుతుంది నేటి సామాజికవేత్తలకు. మానసిక వికాసం, స్వేచ్ఛాయుత ఆలోచనలను పెంపొందించేందుకు యువకులను ఉన్నత విద్యను అభ్యసించవలసినదిగా 'మహా నాయకుడైన బిఆర్ అంబేద్కర్' నొక్కి ఒక్కాణించారు. అదే విధంగా రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖ పేదవిద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిన విద్యాశక్తి ద్వారా వివిధ రకాల కొచ్చింగ్స్‌ను అందించడం ద్వారా అది ఉన్నత విద్య చదివేందుకు యువతకు బాటలు వేసినట్లుగా ఉన్నదని భావించడానికి అవకాశం ఉన్నదని చెప్పేందుకు ఎటువంటి అతిశయోక్తి లేదనే అభిప్రాయం కలుగుతుంది. మరో కోణంలో కూడా మనం విద్యాశక్తిని పరిశీలించినట్లయితే ఈ కార్యక్రమంలో భాగంగా ఎక్కడైతే స్లో లర్నర్స్ ఉంటున్నారో వారి కోసం ప్రత్యేక దృష్టి సారించేందుకు విద్యాశాఖ తగు ప్రణాళికలను రచించింది. దీనిని అనుసరించి కొంత సమయం ఉపాధ్యాయులు స్లో లెర్నర్స్‌పై స్పెషల్ ఫోకస్ చేయవలసి ఉంటుంది. అలాంటి విద్యార్థులలో ఉన్న ఆత్మన్యూనతా భావనను ఉపాధ్యాయులు తగ్గించి వారిని తగువిధంగా ప్రోత్సహించేందుకు సమాయత్తం అవుతున్నారు. దీనిద్వారా వెనకబాటులో ఉన్న విద్యార్థులు సైతం రాబోవు రోజులలో ముందు వరుసలలో ఉండేందుకు అవకాశం కలదని విశ్వసించవచ్చు. పేద విద్యార్థులకు వరంగా భావిస్తున్న ఈ విద్యాశక్తి కార్యక్రమాలను విద్యాశాఖ సూక్ష్మంగా గమనించేందుకు తగు ప్రణాళికలను సైతం సిద్ధం చేసిందనే భావించాలి. సమాజానికి ఉపయోగపడే ఎన్ని కార్యక్రమాలైనా పర్యవేక్షణలేకపోతే దాని స్థితిగతులు అర్థం కాని విధంగా ఉంటుంది. నేడు మన విద్యావ్యవస్థలో వచ్చిన కొన్నిమార్పుల దృష్ట్యా అవి ఎంత వరకు ఆశించిన ఫలితాలను అందుకుంటున్నాయో అనే విషయాన్ని గమనించుకునే ఉద్దేశంతో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, మండలస్థాయిలలో అకడమిక్ ఫార్మ్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ ఫారమ్స్ క్రిందిస్థాయి పాఠశాలల వరకు వెళ్లి అక్కడ ఉన్న సమస్యలను సావధానంగా పరిష్కరిస్తూ తగినవిధంగా ఫలితాలను రాబట్టేందుకు తగిన సూచనలను చేయటానికి పూనుకుంటుంది. అంతేకాకుండా మారిన విద్యా విధానాలు, అమలు తీరుతెన్నులను పరిశీలించి వాటి బలోపేతానికి కృషి చేసేందుకు గ్రేడింగ్ విధానాలు పెంచేందుకు తగు ప్రణాళికలతో ముందుకువెళ్లేందుకు ఈఅకాడమిక్‌ఫార్మ్స్ సంసిద్ధంగా ఉన్నాయనే అభిప్రాయం కలుగుతుంది. •



# ప్రజావాక్కు



## అన్నీ అబద్ధాలే

ఇది మూడు దశాబ్దాలుగా ఇంకా కొలిక్కి రాని అంతులేని కథ, వ్యథ. అన్ని పార్టీల ప్రభుత్వాలు ఈ పెన్షనర్లను సమాజంలోని వ్యక్తులుగాఏనాడుపరిగణించలేదు. 2014 లో బి.జె.పి. పార్టీ కనీస పెన్షను మూడువేలు చేస్తామని వాగ్దానం చేసి పదవిలోకి వచ్చింది. గుప్పెడు కమిటీలు, డజన్ల పార్లమెంటు సభ్యులు, కనీస పెన్షన్ను పెంచమని అనేకసార్లు కేంద్రప్రభుత్వానికి విన్నపం చేస్తూనే ఉన్నారు. అక్టోబరు 13వ తేదీన ఢిల్లీలో జరిగిన సెంట్రల్ బోర్డు ట్రస్టు సమావేశంలో కచ్చితంగా కనీస పెన్షను నిర్ణయం జరుగుతుందని ఆశించడం జరిగింది. నేషనల్ ఏజిటేషన్ కమిటీ వారు కేంద్రకార్మికమంత్రి మన్సుఖ్ మాండవియాని ఎప్పుడుకలిసి అడిగినా ఆయనదగ్గర ఒకే సమాధానం సిద్ధంగా ఉంటుంది. అదేమంటే మీ సమస్య మా దగ్గర యాక్టీవ్ కన్సిడరేషన్‌లో ఉందని. అన్నీ అబద్ధాలే.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## యూరియా ఉత్పత్తి పునరుద్ధరణ

**రామగుండం** ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్‌లో యూరియా ఉత్పత్తి తిరిగి ప్రారంభమవడం వ్యవసాయ, పారిశ్రామికరంగాలకు శుభవార్తగా చెప్పుకోవచ్చు. ఉత్పత్తి నిలిచినకాలంలో రైతులు, ఎరువుల పంపిణీదారులు తీవ్ర ఆందోళనకుగురయ్యారు. యూరియా సరఫరాలోపం కారణంగా పంటల సాగుపనులకు అంతరాయం కలిగే ప్రమాదంతలెత్తింది. ఇప్పుడుఉత్పత్తి పునరుద్ధరణతో యూరియా అందుబాటులోకి రావడం రైతులకు నిజమైన ఊరట కలిగించింది. పునరుద్ధరణ దేశీయఎరువులఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా ఒక ప్రధాన అడుగుగా నిలిచింది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## బదలీ అయినవారికి పోస్టింగ్ ఇవ్వాలి

**ఆంధ్రప్రదేశ్** మోడల్‌స్కూల్స్ లోపనిచేస్తున్న ప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీలబదలీలను నిర్వహించిన వారికి వెంటనే పోస్టింట్ ఇవ్వాలి. పోస్టింగ్ ఇవ్వకుండా ఎక్కడివారిన అక్కడే ఉంచినట్లయితే బదలీలు వృధా అవుతాయి. కొంత మందికి పోస్టింగ్ ఇచ్చి మరికొంత మందికి ఇవ్వకపోవడం బాధాకరం. మోడల్ స్కూల్స్ సిబ్బందికి ఈ అవకాశాన్ని కల్పించాలి. ఇప్పటికైనా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి. వెంటనే పోస్టింగ్ కల్పించాలి.

-టి. సురేష్, ఆంధ్రప్రదేశ్

## అనుమతి లేని ప్లాంట్లను సీజ్ చేయాలి

ప్రస్తుత కాలంలో స్వచ్ఛమైన తాగునీరు ఆరోగ్యానికి మౌలిక అవసరం. అయితే ఇటీవల రెండుతెలుగురాష్ట్రాల్లో అనుమతులు లేకుండా నడుస్తున్న నకిలీ మినరల్ వాటర్ ప్లాంట్లు పెరిగిపోవడం ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారింది. కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకుండానే ఈ ప్లాంట్లు సాధారణ లేదా మురికినీటిని క్లోరిన్, రసాయనాలుకలిపి ప్యాకేజింగ్ చేస్తున్నారు. ఈనీటిలో బ్యాక్టీరియా, వైరస్‌లు, భారీ లోహాలు ఉండే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో ప్రజలు టైఫాయిడ్, కలరా, పచ్చకామెర్లు వంటివ్యాధులతోబాధపడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు అత్యంత ప్రభావితమవుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలనే దురాశ, ప్రభుత్వ తనిఖీలలో లోపాలు, ప్రజల్లో అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల ఈ వ్యాపారం వేగంగా విస్తరించింది. నకిలీ నీరు తక్కువ ధరకు లభించడం వల్ల ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు దీనికి బలవుతున్నారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలుతీసుకోవాలి. అనుమతిలేని ప్లాంట్లనుతక్షణమే సీజ్ చేయడం, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## దేశ సమైక్యత అవసరం

**లద్దాక్** తన స్వయం నిర్ణయం తీసుకునే విధంగాఉండాలి. తన రాజకీయ నిర్ణయం తీసుకునే విధంగా ఉండాలి. తన అభివృద్ధి ప్రణాళికలు తానే రూపొందించుకోవాలి. అప్పుడు మాత్రమే అభివృద్ధి సాధ్యం అవుతుంది. సమానత్వ అభివృద్ధి సాధ్యం అవుతుంది. వాళ్లుకూడా అదేకోరుకుంటున్నారు. కేంద్రీకృత ప్రణాళిక అమలు కాకూడదు, వికేంద్రీకృత ప్రణాళికలు వారు కోరుకుంటున్నారు. అయితే ఒకటి దేశ సమైక్యత సమగ్రతకు భంగం కలుగని రీతిలో వారు అభివృద్ధి కావాలె అప్పుడే శాంతియుత ప్రజాస్వామిక లద్దాక్ సాధ్యం అవుతుంది.

- భారత అవినాష్, జనగామ

## మద్యాన్ని నిషేధించాలి

**ఇటీవల** ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జన వాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడు వివిధ జంక్షన్‌లోకి వచ్చే జనం ఆ మార్గం గుండా వస్తారు. మద్యం సేవకులుమోతాదుఎక్కువై ఇతరులతో ఘర్షణలకు దిగుతున్నారు. కొందరు రహదారి ప్రక్కన అసహ్యంగా పడిపోయి అక్కడే పడుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా దుకాణదార్లు ఏమి చేయలేకపోతున్నారు.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

**మన వి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# టపాసుల పట్ల అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

టపాసులకు ఆద్యులు చైనీయులు. క్రీ.పూ. 200 సం. లోనే వెదురు (బాంబూ)టపాకాయలు వాడినట్లు ఆధారాలున్నాయి. దాన్ని చైనా భాషలో బాజు అంటారు. పేలుతున్న వెదురు అని అర్థం. తుపాకి మందు కనిపెట్టేంత వరకు వెదురు టపాసులనే చైనా వారు వాడేవారు. క్రీ.శ. 600ల ప్రాంతంలో చైనా వారు తుపాకి మందుని కనిపెట్టారు. గన్‌పౌడర్ లేక బ్లాక్ పౌడర్ రసాయన ప్రేలుడు పదార్థం. ఇది గంధకం, చార్కోల్, పొటాషియం నైట్రేట్‌ల మిశ్రమం. దీన్ని సాల్ట్ పౌడర్ అంటారు. ఇది మండినప్పుడు 427 నుంచి 464 డిగ్రీల ఉష్ణం వెలువడుతుంది. క్రీ.శ. 900వ సం.లో చైనా నుండి టపాసులు ఇంగ్లాండు అరబ్బు దేశాలు, భారత దేశానికి చేరుకున్నాయి. మనదేశంలో టపాకాయల పరిశ్రమ తమిళనాడులోని శివకాశిలో విస్తరించి వుంది. దేశంలోని టపాకాయల ఉత్పత్తిలో 70శాతం శివకాశిలోని 1000కి పైగా పరిశ్రమలలో తయారవుతున్నది. పరిశ్రమలలో పనిచేసే వారు ముఖ్యంగా పసిపిల్లలు. వారిలో 4 నుంచి 16సం.లోపు వారు 30మంది వున్నారు. అందులో 90శాతం మంది ఆడపిల్లలు, పేద పిల్లలు, వెనుకబడిన తరగతివారు. చేతులకు ఎలాంటి రక్షణ కవచాలు (గ్లౌజులు) లేకుండా ప్రమాదకర రసాయన పదార్థాలలో టపాసులు తయారు చేస్తున్నారు పిల్లలు. రసాయనాల వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు, చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. ప్రభుత్వ చట్టాలు ఎన్నివున్నా పిల్లలు చేసే ఈ చాకిరీని అరికట్టలేకపోతున్నారు. 1991లో శివకాశిలో ఓ ఫ్యాక్టరీలో జరిగిన ప్రేలుడు వల్ల 39 మంది చనిపోయారు. 65 మంది గాయపడ్డారు. 2009, జూలైలో జరిగిన ప్రమాదంలో 40 మంది చనిపోయారు. ఆగస్టు 2011లో ఫ్యాక్టరీ ప్రమాదంలో 7మంది చనిపోగా ఐదుగురు గాయపడ్డారు. సెప్టెంబర్ 2012 ప్రమాదంలో 40 మంది చనిపోగా 38 మంది గాయపడ్డారు. ఇవి అధికారిక లెక్కలు కాగా, నిజానికి ఎక్కువగానే ప్రమాదాలు జరిగివుంటాయి. టపాకాయలు కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం, రసాయన కాలుష్యం చాలా ఎక్కువగా వుంది. టపాసులు కాల్చినప్పుడు శబ్దం 140 డెసిబెల్స్ దాటుతోంది. ఆరోగ్య పరంగా శబ్దాలు 125 డెసిబెల్స్ దాటకూడదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టపాకాయల శబ్ద తీవ్రత 125 డెసిబెల్స్ దాటకూడదు. కానీ టపాకాయల తయారీ కంపెనీలు నియమాన్ని పాటించడం లేదు. ఈ శబ్దాల వల్ల తాత్కాలిక చెవుడు, శాశ్వత చెవుడు ఏర్పడుతున్నది. అధిక శబ్దం వల్ల వినికిడి సమస్యలు, రక్తపోటు, గుండెపోటు, నిద్రలేమి లాంటి సమస్యలు వస్తున్నాయి. ఎన్నో రకాల ప్రమాదాలు పొంచి వున్నాయి. టపాకాయలు కాల్చడంలో అగ్ని ప్రమాదాలు కోకొల్లలు. చేతిలో



చిచ్చుబుడ్డి పేలడం, ఒళ్లుకాలడం, బట్టలు కాలి పోవడం జరుగుతూనే వుంటాయి. చాలా మంది ఆ వెలుగు చూడలేక కళ్ళు పోగొట్టుకున్న సందర్భాలు అనేకం. దీపావళి సందర్భంగా టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు. టపాకాయలు కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదాలు సంభవిస్తాయి. బాణ సంచాలను ఇంటిలో కాల్చకూడదు. ఇంటికి దూరంగా బహిరంగ ప్రదేశాలలో కాల్చడం వల్ల ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. టపాకాయలు కొన్నిసార్లు అవి పేలకుండా ఆగిపోతాయి. వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం లాంటివి చేయకూడదు. ముందుగా వాటిపై నీటిని పోయడం వల్ల వాటి నుంచి ఎలాంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదు. టపాకాయలు కాల్చేటప్పుడు ముఖ్యంగా ఆల్కహాల్ శానిటైజర్‌లను వాడి టపాకాయలను వెలిగించకూడదు. శానిటైజర్‌లకు తొందరగా మండే స్వభావం ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దీపావళి రోజు శానిటైజర్‌లను వాడక పోవడం మంచిది. టపాకాయలపై ఇచ్చిన సలహాలు సూచనలను ఖచ్చితంగా పాటించాలి. మంటలు అంటుకునే ప్రదేశాలు... కరెంటు తీగలు, ఎండుగడ్డి, పూరిగుడిసెలు ఉన్న ప్రదేశాలలో బాణా సంచాలు కాల్చకూడదు. టపాకాయలను కాల్చివాటిని అలాగే రోడ్డు మీద పడేయడం వల్ల ఆ దారి వెంట వెళ్లే వారికి వాటి నుంచి ప్రమాదం కలగవచ్చు. ఒక బకెట్లో ఇసుక పెట్టుకొని అందులో కాల్చిన కాకరపువ్వులను, టపాకాయలను వేయడం మంచిది. బాణా సంచాలను కాల్చేటప్పుడు ముందస్తు జాగ్రత్తగా ఒక బకెట్ నిండా నీటిని పక్కన ఉంచుకోవాలి. చిన్నపిల్లలకు పెద్దవారే దగ్గర ఉండి జాగ్రత్తగా టపాకాయలను కాల్పించాలి. వీలైనంత వరకు అందరూ కూడా కాటన్ దుస్తులను ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బాణసంచా కాల్చిన తర్వాత పిల్లలు టపాకాయలను కాల్చిన చేతులతోనే ముక్కు, చెవులు, కళ్లను రుద్దుకుంటారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. గొంతులో నీళ్ల పోసుకుని గార్గిలింగ్ చేయాలి. గాయం అయితే దాని మీద పదిహేను నిమిషాల పాటు చన్నీరు, వేడి నీరుపోయరాదు. తర్వాత ధారగా పోయాలి. లేదా నీటి కుళాయి కింద పెట్టాలి. గాయమైన అరగంట లోపల ఈ చికిత్స జరగాలి. ఇలా చేయడం వల్ల వేడి తగ్గిపోతుంది. కంటికి చువ్వలాంటిది తగిలి గాయం అయినప్పుడు వెంటనే చేత్తో కానీ కంటిని రుద్దుతారు. ఇది చాలా ప్రమాదం. గాయం తీవ్రత పెరగడానికి, గాయం విస్తరించడానికి కారణం అవుతుంది. కంటికి వస్త్రంతో గట్టిగా కట్టుకట్టకూడదు. ఇలా చేస్తే కంట్లో గుచ్చుకున్న నలుసు మరింత లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. కాబట్టి గాయమైన కంటిని కప్పు లేదా షీల్డుతో కప్పి డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళాలి. రసాయనాలు కంట్లో పడితే కంటిని పరిశుభ్రమైన నీటితో కడగాలి. కంటిని రుద్దకుండా దోసిలితో నీటిని తీసుకుని కంటికి తగిలేటట్లు చేస్తూ శుభ్రం చేయాలి. టపాసుల వినియోగాన్ని తగ్గించాలి. అధిక శబ్దాలు వెలువరించే టపాసులు కాల్చకూడదు. టపాసులు పర్యావరణానికి ప్రమాద కారకాలు. టపాసుల కోసం డబ్బు వృధా చేయవద్దు. వెలుగులు నింపే దీపాలతో దీపావళి చేసుకుందాం. పర్యావరణ పరిరక్షణ దీపావళినిజరుపుకుందాం. •

# 25 మందితో ఎంఐఎం జాబితా



## ఇద్దరు హిందువులకు అవకాశం

## సివాన్ నుంచి క్రికెటర్ కైఫ్ పోటీ



## బీహార్‌లో ఇంకా 'సర్దుబాట్ల' లోనే కూటములు

**పాట్నా, అక్టోబరు 19:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసి ఆదివారంనాడు 25మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ముస్లిమేతరులు ఉన్నారు. టీమిండియా మాజీ క్రికెటర్‌కు మజ్లిస్ టికెటిచ్చింది. ఎంఐఎంకు ఉన్న ఏకైక ఎమ్మెల్యే అఖ్తరుల్ ఇమాన్ పేరు కూడా జాబితాలో ఉంది. ఎఐఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ కథనం ప్రకారం, ముస్లిం జనాభా అధికంగా ఉన్న సీమాంచల్ రీజియన్‌పై ప్రధానంగా ఫోకస్ పెట్టింది. భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ 'సివాన్' నుంచి పోటీ చేస్తున్నారు. గయ దక్షిణ-మధ్య జిల్లాలోని రిజర్వ్ సీటు సికంద్రా నుండి మనోజ్‌కుమార్ దాస్‌ను ఎంఐఎం నిలబెట్టింది. ఇక్కడ ఎన్‌డిఎ తరఫున, సిట్టింగ్ ఎమ్మెల్యే హెచ్ఎఎం అధినేత జితిన్ రామ్ మాంఝీ తనయుడు ప్రఫుల్ కుమార్ మాంఝీ బరిలో ఉన్నాడు. నేపాల్ సరిహద్దులోని తూర్పు చంపారన్ నియోజకవర్గం నుంచి రాణా రంజీత్‌సింగ్‌కు ఎంఐఎం బరిలోకి దించింది. మాజీ మంత్రి, మధుబన్ సిట్టింగ్ ఎమ్మెల్యే బిజెపినేత రానా రణ్‌ధీర్‌సింగ్ సోదరుడు కావడం విశేషం. గత ఎన్నికల్లో 19 స్థానాల్లో పోటీచేసి 5 సీట్లు గెలిచింది. అయితే, తదనంతర రాజకీయపరిణామాలతో నలుగురు ఎమ్మె ల్యేలు ఆర్‌జెడిలో చేరిపోయిన విషయం తెలిసిందే.

**జెఎంఎం ఒంటరిగానే బరిలోకి**

మహాఘట్ బంధన్‌లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కిరాలేదు. కూటమిలోని భాగస్వామ్య పార్టీ జెఎంఎం ఈసారి ఒంటరిగానే బరిలోకి దిగుతున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సుప్రియో భట్టాచార్య తెలిపారు. ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. జార్ఖండ్ సరిహద్దులోని ప్రాంతాలపైనే జెఎంఎం ప్రధానంగా దృష్టి సారించింది. చకాయ్, ధామ్దహా, కటోరియా(ఎస్‌టి), పిర్‌పెయింటి, మణిహారి(ఎస్‌టి), జముయి స్థానాల్లో జెఎంఎం పోటీ చేయాలని నిర్ణయించినట్లు సుప్రియో భట్టాచార్య వివరించారు.

**24 నుంచి ప్రధాని మోడీ ప్రచారం**

బీహార్ ఎన్నికల్లో ఎన్‌డియే అభ్యర్థుల తరఫున ఈ నెల 24 నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రచారంచేయనున్నారు. సమస్టిపూర్ నుంచి మోడీ ఎన్నికల ప్రచారం శ్రీకారం చుట్టనున్నారని బిజెపి బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ తెలిపారు. ఆతర్వాత బెగుసరాయ్‌లో మరో ఎన్నికల ర్యాలీలో మోడీ పాల్గొంటారని, ఈ నెలాఖరులోపు నాలుగు కంటే ఎక్కువ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి పాల్గొంటారని దిలీప్ జైశ్వాల్ వివరించారు. దాదాపు 25 ప్రచార సభల్లో మోడీ పాల్గొనేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. నితీశ్‌కుమారే ఎన్‌డియేముఖ్యమంత్రిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నామని కేంద్రమంత్రిగిరిరాజ్‌సింగ్ తెలిపారు.



## సిఎం రేఖాగుప్తాపై దాడికేసులో 400 పేజీల ఛార్జిషీట్

**న్యూఢిల్లీ,అక్టోబరు 19:** ఢిల్లీముఖ్యమంత్రి రేఖాగుప్తాపై దాడికి పాల్పడిన సంఘటనలో ఢీల్లీపోలీసులు సకారియా రాజేష్‌భాయ్ ఖీమ్జిభాయ్ అనే నిందితుడిపై కోర్టులో ఛార్జిషీటు దాఖలుచేసారు. సుమారు 400 పేజీలకుపైగా ఈ ఛార్జిషీటు దాఖలయింది. రాజేష్‌తోపాటు ఆతడి మిత్రుడు సయ్యద్ తహ్సీన్‌అజాపైనా వివిధ అభియోగాలకింద ఈ ఛార్జిషీటు దాఖలు చేసారు. వీధికుక్కలను సంరక్షణ కేంద్రాలకు తరలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను సమర్థించారన్న కారణంతో ఢిల్లీ సీఎం రేఖాగుప్తాపై నిందితుడు ఆగ్రహంతో ఉన్నాడని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. 40మందికిపైగాసాక్షుల వాంగ్మూలాలను అందులో పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఈ ఛార్జిషీటును పరిగణనలోనికి తీసుకున్న కోర్టువిచారణను ఈనెల30కి వాయిదా వేసింది.

# కాల్పుల విరమణకు పాక్, అఫ్ఘాన్ అంగీకారం

## ఫలించిన దోహా శాంతి చర్చలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** అఫ్ఘానిస్థాన్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలకు తెరపడింది. ఇరు మధ్య జరిగిన శాంతి చర్చలు ఫలించాయి. ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వంలో దోహా వేదికగా జరిగిన చర్చల్లో తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈమేరకు ఖతార్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటన విడుదల చేసింది. రెండు దఫాలుగా జరిగిన ఈ చర్చల్లో శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని పేర్కొంది. ఈ చర్చల్లో ఇరుదేశాలకు చెందిన రక్షణ మంత్రులు పాల్గొన్నారు. కాగా, ఇరు దేశాల మధ్య కుదిరిన 48 గంటల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ అఫ్ఘనిస్థాన్‌పై పాక్ శుక్రవారం అర్ధరాత్రి వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడిలో ముగ్గురు స్థానిక క్రికెటర్లు సహా 10 మంది ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని పాక్ భద్రతాధికారులు కూడా ధ్రువీకరించారు. అయితే, తాము చేసిన ఈ దాడుల్లో డజన్ల మంది సాయుధ దళాల సిబ్బంది మరణించారని, పౌరులెవరూ ప్రాణాలు కోల్పోలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన



అఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు త్వరలో పాకిస్థాన్, శ్రీలంకతో జరగనున్న ముక్కోణపు సిరీస్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని పక్తికా ప్రావిన్సులోని జిల్లాలపై పాక్ వైమానిక దాడులకు దిగినట్టు అధికారులు తెలిపారు. పాక్ దాడుల్లో మరణించిన ముగ్గురు క్రికెటర్లను కబీర్, సిబ్‌ఘహతుల్లా, హరూన్‌గా గుర్తించారు. వీరు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ కోసం ప్రొవిన్షియల్ రాజధాని అయిన షరానాకు వెళ్లి తిరిగి ఉర్గున్ జిల్లాలోని తమ ఇంటికి చేరుకోగా పాక్ దాడుల్లో మరణించారు. ఈ దాడుల్లో మరో ఐదుగురు మరణించారని, ఏడుగురు గాయపడ్డారని అఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. తాజా ఒప్పందం ద్వారా డజన్ల కొద్దీ మరణాలకు, వందలాది మంది గాయపడటానికి కారణమైన సరిహద్దు ఘర్షణలకు తాత్కాలికంగా తెరపడినట్లయింది. ఖతార్ రాజధాని దోహాలో టర్కీ సహకారంతో జరిగిన ఈ చర్చల్లో ఇరు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆఫ్ఘనిస్థాన్ తరఫున రక్షణ మంత్రి ముల్లా మహమ్మద్ యాఖూబ్, పాకిస్థాన్ తరఫున రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ ఆసిఫ్ ఈ చర్చలకు నాయకత్వం వహించారు. ఈ ఒప్పందం సక్రమంగా అమలయ్యేలా చూసేందుకు రాబోయే రోజుల్లో మరిన్ని సమావేశాలు నిర్వహించనున్నట్లు ఖతార్ తెలిపింది. 2021లో ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారం చేపట్టిన తర్వాత ఇరు దేశాల మధ్య ఇంతటి తీవ్రస్థాయిలో ఘర్షణలు జరగడం ఇదే మొదటిసారి. ఆఫ్ఘనిస్థాన్ భూభాగం నుంచి తమ దేశంపై ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయని, వాటిని తక్షణమే అరికట్టాలని పాకిస్థాన్ డిమాండ్ చేయడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను తాలిబన్ ప్రభుత్వం ఖండించింది. పాకిస్తానే తమ దేశంలో అస్థిరత సృష్టించేందుకు ఐఎస్ సంబంధిత గ్రూపులకు మద్దతిస్తోందని ఎదురుదాడి చేసింది. సుమారు 2,600 కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో శాంతిని నెలకొల్పేందుకు దోహాలో కుదిరిన ఈ ఒప్పందం కీలకమైన ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## తండ్రికి కొవిడ్19 సోకితే పుట్టబోయే పిల్లల మెదడు ఎదుగుదలలో లోపాలు

**మెల్‌బోర్న్, అక్టోబరు 19:** కరోనా మహమ్మారి మానవాళిపై చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. అయితే, ఈ వైరస్ ప్రభావం కేవలం సోకిన వ్యక్తికే పరిమితం కాదని, వారి తర్వాతి తరంపైనా పడొచ్చన్న ఒక కొత్త అధ్యయనం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గర్భధారణకు ముందు తండ్రికి కొవిడ్19 సోకితే, పుట్టబోయే పిల్లల మెదడు ఎదుగుదల, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఈ పరిశోధనలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ అధ్యయన వివరాలను ప్రఖ్యాత సైన్స్ జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్ ప్రచురించింది. ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ యూనివర్సిటీకి చెందిన ఫ్లోరే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్స్ పరిశోధకులు ఈ సంచలన అధ్యయనాన్ని నిర్వహించారు. వారి పరిశోధన ప్రకారం, కోవిడ్19కు కారణమయ్యే సార్స్‌కోవ్2 వైరస్, తండ్రి శుక్రకణాల్లో అణుస్థాయిలో మార్పులు తీసుకువస్తోందని తేలింది. ఈ మార్పుల కారణంగా, వారికి పుట్టే పిల్లల్లో ఆందోళన సంబంధిత ప్రవర్తనలు ఎక్కువగా కనిపించాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ అధ్యయనంలో భాగంగా, పరిశోధకులు మొదట మగ ఎలుకలకు కరోనా వైరస్ సోకేలా చేశారు. అవి పూర్తిగా కోలుకున్న తర్వాత, ఆరోగ్యంగా ఉన్న ఆడ ఎలుకలతో జత కట్టించారు. ఆశ్చర్యకరంగా, కరోనా బారినపడిన తండ్రి ఎలుకలకు పుట్టిన పిల్లలన్నింటిలోనూ అధిక స్థాయిలో ఆందోళన లక్షణాలు కనిపించాయి. ముఖ్యంగా, ఆడ పిల్ల ఎలుకల మెదడులోని హిప్పోక్యాంపస్ భాగంలో జన్యువుల పనితీరులో మార్పులు గుర్తించారు. జ్ఞాపకశక్తి, భావోద్వేగాలు, ఆందోళన వంటివాటిని నియంత్రించడంలో ఈ భాగం చాలా కీలకం. తండ్రి శుక్రకణాల్లోని కొన్ని ఆర్ఎన్ఏ అణువులను కరోనా వైరస్ మార్చేయడమే దీనికి కారణమని పరిశోధకులు తేల్చారు. ఈ ఆర్ఎన్ఏ అణువులు మెదడు అభివృద్ధికి సంబంధించిన జన్యువులను నియంత్రిస్తాయి. వీటిలో మార్పులు రావడం వల్ల పిల్లల నాడీ వ్యవస్థ ఎదుగుదలపై ప్రభావం పడుతోందని అధ్యయన సహ రచయిత్రి డాక్టర్ కరోలినా గుబర్ట్ తెలిపారు. ప్రస్తుతానికి ఈ అధ్యయనం ఎలుకలపైనే జరిగినప్పటికీ, దీని ఫలితాలను తేలికగా తీసుకోలేమని పరిశోధక బృందానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ ఆంథోనీ హన్నన్ హెచ్చరించారు.

# లావ్రే మ్యూజియంలో నెపోలియన్ కాలంనాటి ఆభరణాలు చోరీ



**ప్యారిస్, అక్టోబరు 19:** ప్రపంచప్రఖ్యాత ప్యారిస్‌లోని లోవ్రే మ్యూజియంలో నెపోలియన్ కాలం నాటి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. కేవలం ఏడునిమిషాల్లోనే గ్యాస్ కట్టర్ల సాయంతో దొంగలు మ్యూజియంలోకి చొరబడి విలువైన వస్తువులు దొంగిలించుకునిపోయారు. ఆదివారం తెల్లవారుజామున ఈ దోపిడీ జరిగిందని ఫ్రాన్స్ మంత్రి రాచిడా దాతి వెల్లడించారు. మ్యూజియం సిబ్బంది ఎవరికీ గాయాలు కాలేదన్నారు. దర్యాప్తు కొనసాగుతున్నందున మ్యూజియం మూసివేసామన్నారు. ఒకవైపు మ్యూజియంలో నిర్మాణపనులు జరుగుతున్నాయని, దుండగులు అక్కడి నుంచేమ్యూజియంలోపలికి వచ్చారన్నారు. అనంతరం సరుకురవాణా ఎలివేటర్‌లో అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారని, నెపోలియన్ కాలంనాటి వస్తువులు ఆభరణాలున్న గ్యాలరీ అద్దాలు పగలగొట్టి తొమ్మిది విలువైన వస్తువులు దోచుకునిపోయారని తెలిపారు. గతంలో కూడా అనేకమంది దుండగులు ఆర్ట్‌మ్యూజియంలో చోరీకి ప్రయత్నించారు. 1911లో మ్యూజియంలో లియోనార్డో డావిన్సీ మోనాలిసా చిత్రాన్ని మాజీ కార్మికుడు విన్సెంజో పెరుగ్గియా దొంగిలించాడు. రెండేళ్లపాటు విచారణ జరిపిన అధికారులు ఆతడినుంచి రికవరీచేసారు. 1983 లో మ్యూజియంనుంచి రెండు ప్రాచీన కవచాలు దొంగలించారు. నాలుగుదశాబ్దాల తర్వాత అధికారులు వాటిని గుర్తించారు. మెసపుటో నియా, ఈజిప్టుకు చెందిన అనేక వస్తువులు, వివిధ రాజ్యాలకు సంబంధించినచిత్రాలు, శిల్పాలు వంటివి ఈ మ్యూజియంలో ఉన్నాయి. మోనాలిసా, వీనస్ డిఇలో వింగ్డ్ విక్టరీ ఆఫ్ సమోత్రేస్, వైర్సెల్లెస్ దయానా వంటిప్రముఖ కుడ్యాలు ఇందులో ఉన్నాయి. సుమారు 30వేల మందికిపైగా ఈ మ్యూజియంను ప్రతినిత్యం సందర్శిస్తారు. 33వేలకుపైగా కళాకృతులు, కుడ్యచిత్రాలు, విలువైన ఆభరణాలు ఈ పురావస్తుశాలలో భద్రపరుస్తారు. దొంగిలించుకు పోయిన ఆభరణాలు వెలకట్టలేనివని దుండగులు హైడ్రాలిక్ నిచ్చెన సాయంతో అపోలో గ్యాలరీ లోకి వచ్చారని మంత్రి తెలిపారు. అపోలో గ్యాలరీ అంటేనే ఫ్రెంచ్ రాజుల ఆభరణాలు ఉంటాయి. లోపలికి డిస్క్ కట్టర్ ఉపయోగించి ప్రవేశించారు. మొత్తం ఆపరేషన్ కేవలం ఏడే ఏడు నిమిషాల్లో ముగించుకుని వెళ్లిపోయారు. అయితే దొంగిలించిన వాటిలో ఒక ఆభరణం బయట పడేసి ఉండటంతో దాన్నిబట్టి నెపోలియన్ కాలం నాటి ఆభరణాలను దొంగిలించినట్లు తెలుస్తోంది.

# డొనెట్స్క్ మాకిస్తే యుద్ధం ఆపేస్తాం: ట్రంప్‌తో భేటీకి ముందు పుతిన్ డిమాండ్

**వాషింగ్టన్, అక్టోబరు 19:** ఉక్రెయిన్‌లోని కీలక ప్రాంతమైన దొనెట్స్క్‌ను 11ఏళ్లుగా స్వాధీనం చేసుకోవాలని చూస్తున్న రష్యా తాజాగా దీనిని తమకు అప్పగించి తీరాల్సిందేనని పట్టుబడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ మధ్య గత వారం జరిగిన సుదీర్ఘ ఫోన్‌కాల్ సంభాషణలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు వైట్‌హౌజ్ అధికారులు చెపుతున్నారు. ఇటీవల ఫోన్ కాల్‌లో పుతిన్ ఓ ప్రతిపాదనను ట్రంప్ ముందు ఉంచినట్లు తెలుస్తోంది. తమ సేనల ఆధీనంలో ఉన్న జపొరిజియా, ఖేర్సాన్ ఉక్రెయిన్‌కు అప్పజెప్పేందుకు పుతిన్ సానుకూలతను వ్యక్తం చేశారు. దీనికి ప్రతిగా దొనెట్స్క్ ప్రాంతాన్ని సంపూర్ణంగా తమకు అప్పగించాలని కోరినట్లు తేలింది. ఈప్రాంతం పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతం, అపారమైన ఖనిజవనరుల నిల్వలున్నాయి. అలాగే బొగ్గుగనులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంపై రష్యా ఎప్పటినుంచో ఫోకస్ పెంచింది. అయితే ఈ డిమాండ్‌పై ట్రంప్‌మౌనం వహించారని సమాచారం. అలాస్కాలో జరిగిన ట్రంప్‌పుతిన్ భేటీతో పోలిస్తే తాజాగా జరిగిన ఫోన్‌కాల్‌లో రష్యా కొంత మెత్తబడినట్లు తెలుస్తోంది. పుతిన్‌తో ఫోన్ కాల్






మాట్లాడిన అదే రోజు ఉక్రెయిన్ అధినేత జెలెన్స్కీతో కూడా ట్రంప్ భేటీ అయ్యారు. నాడు అమెరికా అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో మాత్రం పుతిన్ డిమాండ్లను ప్రస్తావించలేదు. పుతిన్ డిమాండ్లపై ఉక్రెయిన్, ఐరోపా సానుకూలంగా లేనట్లు తెలుస్తోందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఎటువంటి ప్రయోజనం లేకుండానే శరీరంలోని ఓ భాగాన్ని ఇచ్చేసినట్లు ఉందని నిపుణులు అభివర్ణించారు. అయితే ఇప్పటికే ఉక్రెయిన్‌లోని ఐదోవంతు భూభాగాన్ని రష్యా ఆక్రమించారు. ఇదిలా ఉండగా మరోవైపు ఉక్రెయిన్‌కు సరికొత్త ఆయుధాలు ఇచ్చే విషయంలోనూ అమెరికా ఆచితూచీ వ్యవహరిస్తోంది. తోమహాక్ క్రూజ్ క్షిపణులే లక్ష్యంగా అమెరికాకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి నిరాశ ఎదురైంది. డొనాల్డ్ ట్రంప్‌తో శుక్రవారం వాషింగ్టన్‌లో జరిపిన చర్చల్లో తోమహాక్ క్షిపణుల సరఫరాపై అమెరికా తరఫున ఎలాంటి హామీ లభించలేదు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు వెంటనే యుద్ధం ఆపాలన్న ప్రకటనతోనే ట్రంప్ సరిపుచ్చారు. దాదాపు 2500కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం గల తోమహాక్‌లను తమకు అమెరికా సరఫరా చేస్తే రష్యా సైనిక లక్ష్యాలపై దాడి చేసి ఆ దేశాన్ని శాంతి ఒప్పందంపై సంతకం చేసేలా ఒత్తిడి తెస్తామని ఉక్రెయిన్ కొద్దికాలంగా చెబుతోంది. ఇటీవల జెలెన్స్కీతో ట్రంప్ మాట్లాడుతూ పుతిన్‌కు చివరి హెచ్చరిక ఇస్తానని పేర్కొన్నారు. పుతిన్ నిజంగా శాంతి చర్చలపై సీరియస్‌గా లేనట్లయితే, అమెరికా టొమాహాక్ దీర్ఘశ్రేణి క్షిపణులను ఉక్రెయిన్‌కు ఇస్తుందని జెలెన్స్కీకి హామీ ఇచ్చారు. ఇటీవల ట్రంప్ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో జర్నలిస్టులతో మాట్లాడిన సందర్భంలో ఈ విషయాన్ని వెల్లడించారు. టొమాహాక్‌ల క్షిపణులు వారి వైపు దూసుకెళ్లాలని రష్యా కోరుకుంటుందని తాను అయితే అనుకోవడం లేదని చెప్పారు. ఒకవేళ ఇదే ఇది యుద్ధంలో కొత్త దశ అవుతుందని తాను జెలెన్స్కీకి చెప్పినట్లు పేర్కొన్నారు.

# బెయిల్ బాండ్లు సమర్పించలేని ఖైదీలకు సుప్రీం కొత్త ఉత్తర్వులు

## జిల్లా న్యాయసేవాధికార సంస్థద్వారా ప్రభుత్వమే వారికి జమచేయాలన్న సూచన

**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** దేశంలో జైళ్లలో మగ్గిపోతున్న విచారణలో ఉన్న పేద ఖైదీలకు సుప్రీం కోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన నిందితులు బెయిల్ మంజూరు అయినప్పటికీ డబ్బులు లేక బెయిల్ బాండ్లు సమర్పించలేకపోవడంతో జైలులోనే ఉండిపోతున్న నేపథ్యంలో సుప్రీం ధర్మాసనం కొత్త నిర్ణయం ప్రకటించింది. ఏదైనా నేరం చేసి ఒక పేద వ్యక్తి అరెస్ట్ అయి, విచారణ ఖైదీగా జైలులో ఉండి బెయిల్ కోసం ష్యూరిటీ మొత్తం సమర్పించలేని పరిస్థితిలో ఉంటే సంబంధిత ప్రభుత్వం జిల్లా న్యాయ సేవల సంస్థ ద్వారా విడుదలకు అవసరమైన మొత్తాన్ని అందించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ మేరకు ఒక ప్రత్యేకమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (ఎస్‌వోపీ)రూపొందించింది. అమికస్ క్యూరీ సూచనలను చేర్చిన తర్వాత సుప్రీంకోర్టు కొత్త ఎస్‌వోపీ రూపొందించింది. వేలాది మంది విచారణలో ఉన్న ఖైదీలు బెయిల్ మంజూరు అయినప్పటికీ బెయిల్ బాండ్లను సమర్పించక పోవడం (ష్యూరిటీతో కూడిన, షూరిటీ లేకపోయిన) వల్లే జైలులో మగ్గుతున్నారని తెలుసుకున్న సుప్రీం ధర్మాసనం ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుంది. అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సూచనలను చేర్చిన తర్వాత న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎస్‌సీ శర్మల ధర్మాసనం కొత్త ఈ కొత్త ఎస్‌వోపీని సిద్ధంచేసింది. జిల్లా న్యాయ సేవల సంస్థ (డీఎల్ ఎస్ఏ) రూ.లక్ష వరకు పూచీకత్తు మొత్తాన్ని సమర్పించవచ్చని అయితే ట్రయల్ కోర్టు సమర్పించాల్సిన ష్యూరిటీ రూ. 1 లక్ష కంటే ఎక్కువగా నిర్ణయించినట్లయితే, ఆ మొత్తాన్ని తగ్గించడానికి దరఖాస్తును దాఖలు చేయాలని ధర్మాసనంపేర్కొంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఎవరైనా విచారణలో ఉన్న ఖైదీకి బెయిల్ మంజూరు అయినప్పటికీ ఏడు రోజుల్లోపు జైలు నుండి విడుదల కాకపోతే, జైలు అధికారులు డీఎల్ఎస్ఏ కార్యదర్శికి తెలియజేయాల్సి ఉంటుంది. దీంతో డీఎల్ఎస్ఏ కార్యదర్శి వెంటనే ఆ ఖైదీ సేవింగ్స్ అకౌంట్‌లో నిధులు ఉన్నాయో లేదో ధ్రువీకరించడానికి ఒక వ్యక్తిని నియమిస్తారు. అయితే నిందితుడి వద్ద డబ్బు లేనట్టుగా తేలితే జిల్లా స్థాయి సాధికార కమిటీ నివేదిక అందిన తేదీ నుంచి ఐదు రోజుల వ్యవధిలోపు డీఎల్ఎస్ఏ సిఫార్సుపై పూచీకత్తు కోసం నిధులను విడుదల చేయమని నిర్దేశిస్తుంది. విచారణలో ఉన్న ఖైదీకి పేద ఖైదీలకు మద్దతు పథకం కింద ఆర్థిక సహాయం ప్రయోజనాన్ని అందించాలని సాధికార కమిటీ సిఫార్సు చేసిన కేసులకు, ఒక ఖైదీకి రూ. 50,000 వరకు అవసరమైన మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా ఏదైనా ఇతర సూచించిన పద్ధతి ద్వారా డ్రాచేసి సంబంధితకోర్టుకు అందుబాటులో ఉంచాలని ఆదేశించవచ్చని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.



## రష్యా కీలక గ్యాస్ ప్లాంట్‌పై

# ఉక్రెయిన్ దాడి!

**మాస్కో, అక్టోబరు 19:** రష్యాలోని ఓరెన్‌బర్గ్ ప్రాంతంలోని అతిపెద్ద గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ డ్రోన్లు విరుచుకుపడ్డాయి. కీవ్‌కు తూర్పువైపు 1,700 కిలోమీటర్ల దూరం చొచ్చుకొచ్చి మరీ ఈ దాడి చేయడం గమనార్హం. ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి దాడుల శక్తిని గణనీయంగా పెంచుకొందనడానికి ఈ దాడి ఉదాహరణగా నిలిచింది. ఈ దాడి కారణంగా ప్లాంట్లలోని ఓ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత వీటిని అదుపులోకి తెచ్చినట్లు ఆ ప్రాంత గవర్నర్ వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని వెల్లడించారు. దాడి చోటుచేసుకున్న ప్రదేశం జనావాసాలకు అతి దగ్గరగా ఉందని చెప్పారు. రష్యాలోని సుదూర ప్రాంతాల్లో కూడా ఉక్రెయిన్ దళాలు డ్రోన్ల దాడులు చేస్తున్నాయి. గత నెల దాదాపు 2,000కిలోమీటర్ల మేరకు లోపలకు చొచ్చుకొచ్చి దాడికి తెగబడ్డ ఘటనలున్నాయి. రష్యా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు ఇది సవాలుగా మారింది. సైబీరియా, ఉరల్ పర్వతాల్లో చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొంటున్నాయి. తాజా సమర రీజియన్‌లో కూడా డ్రోన్‌దాడి జరిగినట్లు తెలుస్తోంది. అయితే స్థానికులు మాత్రం ఇది చమురు రిఫైనరీని లక్ష్యంగా చేసుకొన్నట్లు చెబుతున్నారు. కానీ, ఈ దాడిపై గవర్నర్ మాత్రం ఎటువంటి సమాచారం వెల్లడించలేదు.

# కోట్లాది రూపాయలు చెల్లించి యువతిని పెళ్లాడిన తాత!

**జకార్తా, అక్టోబరు 19:** సాధారణంగా పెళ్లికి వయసులో సంబంధం లేదంటుంటారు. అలాంటి వివాహాలను కూడా మనం చాలా చూశాం. ఇదే క్రమంలో టార్మాన్ అనే 74 యేళ్ల వ్యక్తి తన కంటే 50 యేళ్లు చిన్నదైన యువతిని పెళ్లాడాడు. అయితే, ఈ పెళ్లి కోసం ఆ యువతికి ఆ వ్యక్తి ఏకంగా రూ.2కోట్ల కన్యా శుల్కం (ఎదురు కట్నం) చెల్లించాడు. ఇండొనేసియాలో జరిగిన ఈ వివాహం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అసలేం జరిగిందంటే.. టార్మాన్ (74), అరికా (24)ల వివాహం



తూర్పు జావా ప్రావిన్స్‌లోని పాసిటన్ రీజెన్సీలో ఈ నెల 1న జరిగింది. ఈ వివాహం చేసుకునేందుకు గాను టార్మాన్ ఆ యువతికి దాదాపు రూ. 2 కోట్లు చెల్లించాడు. అయితే ఫొటోగ్రాఫర్లకు మాత్రం డబ్బులు ఇవ్వకుండా తప్పించుకున్నారట. పెళ్లి అయిన తర్వాత తమకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకుండా నవదంపతులు అదృశ్యమయ్యారని ఆ సంస్థ ఆరోపించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. ఆ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. వధువుకు తొలుత రూ.60 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ, వివాహ వేడుక సమయంలో ఏకంగా రూ. 1.8 కోట్లు చెల్లించారట. ఇక పెళ్లికి వచ్చిన అతిథులకు కూడా కొంత డబ్బును రిటర్న్ గిఫ్టులుగా ఇచ్చారు. ఈ వేడుకలు ముగిసిన కొద్దిసేపటికే నవ దంపతులు అదృశ్యమయ్యారు. వారిని కాంటాక్ట్ అయ్యేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లభించలేదు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించగా టార్మాన్ వివాహం చర్చనీయాంశమైంది. ఇక, ఈ వివాహం వద్దంటూ ఆ యువతిని తాము ముందే హెచ్చరించామని వధువు తరఫు బంధువులు ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. అయిన ప్పటికీ ఆమె తమ మాటలను పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో తమ వివాహంపై వస్తున్న కథనాలపై టార్మాన్ స్పందించారు. వధువుకు డబ్బు చెల్లించిన విషయం నిజమే నని ధ్రువీకరించారు. అయితే, విడిపోయారంటూ వచ్చిన వార్తలను ఖండించారు. మేము కలిసే ఉన్నామని స్పష్టం చేశారు. ఇదే క్రమం లో వారు హనీమూన్‌కు వెళ్లారంటూ వధువు తరఫు కుటుంబం వెల్లడించింది. ఇక, ఆ సంస్థ చేసిన ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# సంక్షిప్తంగా..

## భారత్ సరిహద్దుల వరకూ పరిగెత్తిస్తాం: పాక్‌కు హెచ్చరిక



**దోహా, అక్టోబరు 19:** పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలకు ఇక తెరపడింది. అయితే కాల్పుల విరమణ ఒప్పందం కుదరడానికి ముందు పాకిస్థాన్ అఫ్ఘానిస్థాన్‌ల దేశాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆ సందర్భంలో అఫ్ఘానిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మహమ్మద్ నబీ ఒమారి పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. ప్రత్యర్థి ఎలాంటి ఆక్రమణకు పాల్పడినా తమ దళాలు వారిని భారత సరిహద్దు వరకు పరిగెత్తిస్తామని ఒమారి వ్యాఖ్యానించారు. పాక్టికా ప్రావిన్స్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడి పౌరుల ప్రాణాలు తీయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ దేశంలోని సైనిక నాయకత్వాన్ని విమర్శించారు. ఆ దేశ సైనిక పాలన ఇతరుల ఇష్టాలపై ఆధారపడి ఉంటుందని ఒమారి విమర్శించారు. ఇటీవల ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సానుభూతి పరుడిలా మాట్లాడిన వీడియోల గురించి ఆయన ప్రస్తావించారు. కొన్ని రోజులుగా అఫ్ఘాన్‌పాక్ సరిహద్దుల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు


**దుబాయి, అక్టోబరు 19:** దుబాయ్ నుంచి మంగుళూరు బయలుదేరిన ఇండిగో విమానంకు ముందుగా బాంబు బెదిరింపు వచ్చింది. ఆ తర్వాత ల్యాండింగ్ సమయంలో ప్రతికూల వాతావరణం ఎదురైంది. దాంతో అధికారులు ఆ విమానాన్ని దారిమళ్లించారు. ఆదివారం తెల్లవారుజామున దుబాయ్ నుంచి మంగళూరుకు వెళ్లాల్సిన ఇండిగో విమానం బాత్రూంలో బాంబు బెదిరింపు సందేశాలు ఉండటాన్ని ప్రయాణికులు గుర్తించారు. వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విమానాశ్రయ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేయించారు. ఎలాంటి





పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అది ఆకతాయిల బెదిరింపుగా అధికారులు ధ్రువీకరించారు. ఆ తర్వాత విమాన ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:25 గంటలకు బయలుదేరాల్సిన విమానం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది.

## ఒకే వేదికపై ప్రేమించిన ఇద్దరినీ పెళ్లాడిన యువకుడు..



**చిత్రదుర్గ, అక్టోబరు 19:** కర్ణాటకలోని చిత్రదుర్గలో ఓ అరుదైన, వింత వివాహం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఒకే యువకుడు తాను ప్రేమించిన ఇద్దరు యువతులను ఒకేసారి, ఒకే వేదికపై పెళ్లి చేసుకుని స్థానికంగా చర్చనీయాంశంగా మారాడు. కుటుంబసభ్యుల పూర్తి అంగీకారంతో ఈ వివాహం జరగడం మరో విశేషం. చిత్రదుర్గ పట్టణంలోని జేజేహట్టి కాలనీకి చెందిన వసీం షేక్ (28) అనే యువకుడు ఇద్దరు యువతులతో ప్రేమాయణం నడిపాడు. సుమారు 13 ఏళ్ల క్రితం గోవాలో పనిచేస్తున్నప్పుడు షిఫా అనే యువతితో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. ఆ తర్వాత ఏడేళ్ల క్రితం చిత్రదుర్గకు చెందిన జన్నత్ అనే యువతితో కూడా వసీంకు పరిచయమై, ఆమెతోనూ ప్రేమలో పడ్డాడు. ఇద్దరినీ ఇష్టపడిన వసీం, ఎవరినీ వదులుకోలేకపోయాడు. ఈ క్రమంలో ఇద్దరినీ వివాహం చేసుకోవాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు. తన మనసులోని మాటను ఇరువైపులా కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత మూడు కుటుంబాల పెద్దలు కూర్చుని చర్చించుకుని ఈ పెళ్లికి అంగీకారం తెలిపారు.

## బయలుదేరే ముందు సర్వీసు రద్దుచేసిన ఎయిరిండియా

**మిలాన్, అక్టోబరు 19:** స్వదేశానికి వెళ్లి తమ వారితో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని అంతా అనుకుకుంటున్న కొన్ని గంటలకే భారత్ వెళ్లే విమాన సర్వీస్ రద్దు చేసినట్లు ఎయిర్ ఇండియా సంస్థ ప్రకటించింది. ఈనెల 17వ తేదీన ఇటలీలోని మిలాన్ నగరం నుంచి 256 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బందితో ఏఐ 138 విమాన సర్వీసు న్యూఢిల్లీకి బయలుదేరాల్సి ఉంది. చివరి నిమిషంలో ఈ విమాన సర్వీసును రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీనిపై ఎయిర్ ఇండియా స్పందించింది. విమానంలో సాంకేతిక సమస్య ఏర్పడిందని తెలిపింది. ప్రయాణికులు, విమాన సంస్థ సిబ్బందికి భద్రత కల్పించడానికే తాము తొలి ప్రాధాన్యత ఇస్తామని అందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

# వైన్స్ టెండర్ల గడువు పొడిగించిన ప్రభుత్వం

## బంద్ కారణంగా సకాలంలో అందని దరఖాస్తులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 19:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శనివారంతో వైన్స్ టెండర్ల దరఖాస్తుకు గడువు ముగిసింది. అయితే శనివారం బీసీ బంద్ కారణంగా బ్యాంకులు బంద్ ఉండటంతో.. ఆశావాహులు నిర్ణీత సమయంలో దరఖాస్తులు సమర్పించలేకపోయారు. దీంతో వైన్స్ టెండర్లు వేయాలని ఆసక్తి ఉన్నవారు. తమ విజ్ఞప్తిని పరిగణలోకి టెండర్లకు మరోసారి అవకాశం కల్పించాలని అన్ని జిల్లాలోని కలెక్టర్లను, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులను కోరారు. దీంతో వారు రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు నివేదిక అందించారు. దీంతో ఆశావాహుల విజ్ఞప్తి మేరకు వైన్స్ టెండర్ల దరఖాస్తుకు మరో అవకాశం కల్పించారు. మద్యం షాపుల లైసెన్సుల కోసం దరఖాస్తులను ఈ నెల 23వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ శాఖ కమిషనర్ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల అధికారులకు ఈ ఆదేశాలను ఇచ్చారు. దీంతో గత నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 23న కలెక్టర్ల సమక్షంలో జరగాల్సిన డ్రా కార్యక్రమాన్ని వాయిదా వేశారు. అలాగే 23 వరకు వచ్చే ధరఖాస్తులతో కలిపి ఈ నెల 27వ తేదీన డ్రాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ నిర్ణయంతో ఇప్పటి వరకు వచ్చిన ధరఖాస్తులతో పాటు మరింత మంది ఆశావాహులు ధరఖాస్తులు చేసుకునే అవకాశం కనిపిస్తుంది. అలాగే ప్రభుత్వానికి సైతం పెద్ద మొత్తంలో ఆదాయం కూడా పెరగనుంది.

**దరఖాస్తులు అంతంతే..**

ఈ సారి వైన్స్ దుకాణాలకు దరఖాస్తులు గతంతో పోలిస్తే సగానికి కంటే కాస్తో కూస్తో ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో సరూర్ నగర్ ఎక్సైజ్ సూ పరింటెండెంట్ పరిధిలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఆమనల్లు, షాద్ నగర్, సరూర్ నగర్, హయత్ నగర్ ఎక్సైజ్ డివిజన్ల పరిధిలోని 134 వైన్స్ దుకాణాలకు మొత్తం 10,994 దరఖాస్తులు వచ్చాయి. అలాగే శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో చేవెళ్ల, శంషాబాద్, శేరిలింగంపల్లి ఎక్సైజ్ డి విజన్ల పరిధిలో వంద దుకాణాలకు గాను మొత్తం 10,621 దరఖాస్తులు వచ్చాయి.

గతంలో టెండరు రూపేణా చెల్లించిన రూ.2లక్షల రుసుముతో రంగారెడ్డి జిల్లాలోనే ప్రభుత్వ ఖజానాకు రూ.432.30 కోట్ల ఆదాయం సమకూరింది. కానీ ఈసారి పరిస్థితి గతం కంటే భిన్నంగా ఉంది. రంగారెడ్డి జిల్లా లోని 224 దుకాణాలకు, వికారాబాద్ జిల్లాలోని 59 దుకాణాలకు టెండర్లు పిలిచారు. గత సెప్టెంబరు 26 నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలవగా.. అక్టోబర్ 18 వరకు స్వీకరించారు. మొదటి నుంచి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రా లేదు. అయితే ప్రతిసారి గడువు చివరి రోజుల్లో దరఖాస్తులు పెద్ద ఎత్తున దాఖలైన సందర్భాలు ఉండడంతో.. ఈసారి కూడా అలాగే వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు సైతం ఆశించారు. కానీ.. అందరి అంచనాలు తలకిందులయ్యాయి. శనివారం రాత్రి 8 గంటల వరకు రంగారెడ్డి జిల్లాలో 249 దుకాణాలకు కలిపి 13,341 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక వికారాబాద్ జిల్లాలోని 59 వైన్స్ దుకాణాల కు 17 వరకు 1,044 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఆఖరి రోజున 558 దరఖాస్తులు రాగా.. మొత్తంగా వికారాబాద్ జిల్లాలోని అన్ని షాపులకు కలిపి 1,602 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గతంతో పోలిస్తే.. ఈ సారి అర్జీల సంఖ్య 1,035 దరఖాస్తులు తగ్గాయి.

# కళాకారులు ప్రతిభా దీపాలు వెలిగించాలి

## రాష్ట్ర సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు

### తెలంగాణ సామాజిక చైతన్య కార్యక్రమం 'ప్రభాత భేరి' ఆవిష్కరణ

### సమాజ రుగ్మతలు పారద్రోలే రచనలకు ఆహ్వానం



తెలంగాణ సామాజిక చైతన్య ప్రభాతభేరి కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రొ. కోదండరాం, నరసింహారెడ్డి, అలేఖ్య, వెన్నెల, శివకుమార్ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 19, ప్రభాతవార్త :** కవులు, కళాకారులు తమలోని ప్రతిభా దీపాన్ని సరి కొత్తగా వెలిగించి సంస్కరణ వెలుగులు విరా జిల్లేలా వ్యాపింపజేయాలని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. రవీంద్రభారతిలో తెలంగాణ సామాజిక చైతన్య కార్యక్రమం ప్రభాతభేరికి మంత్రి అంకురార్పణ చేస్తూ సమాజ రుగ్మతలు పారద్రోలేలా సాహిత్య కళారూపాల రచనలను కవులు, కళాకారుల నుండి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణారావు తెలంగాణ సాంస్కృతిక సలహా మండలి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల, తెలంగాణ సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు జి.వి.వెన్నెల, ప్రముఖ దర్శకుడు బి.నర్సింగరావు, ప్రసిద్ధ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ తొలి అధ్యక్షుడు బాద్మి శివకుమార్, ప్రసిద్ధ కవులు, సాహితీవేత్తలతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి ప్రసంగించారు. శతాబ్దాల కాలం నుండి తెలంగాణ కళలకు కాణాచి అని, ఏడువందల ఏళ్లక్రితం నుండే వెల్లివిరుస్తున్న సాహిత్య కళావైభవాన్ని విశదీకరించారు. కళలు మనస్సును, సామూహికంగా మనుషుల్ని కదిలిస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రధాన పాత్ర సూత్రధారులుగా యావత్ సమాజాన్ని ఆట పాట మాటల ద్వారా సంఘటితంచేసి ఆశక్తితో రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. ఈ క్రమంలో అందర్నీ భాగస్వాములనుచేసి కార్యోన్ముఖులను చేయాలనే సంకల్పమే ప్రభాతభేరి లక్ష్యమన్నారు. అయితే కవులు కళాకారులెంత కష్టపడినా, ప్రభుత్వాలు లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నా ఏదెంత జరగాలో అది జరగనిస్థితి కళ్లకుకొటొచ్చినట్లు కనబడుతుంది. రాష్ట్రసాధనలో అమరవీరులైన వారి ఆశ, ఆశయాలను నెరవేర్చడంలో గానుగెద్దుల్లా తిరిగితే ప్రయోజనంలేదు... అనైతిక ధోరణులు, అవాంఛనీయ దుస్సంఘటనలు, రుగ్మతలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి... ఇకనైనా మార్పు రావాల్సిందే. ఏ నిర్ణయమైనా ఒకటికి పదిసార్లు ఆలోచించాలి కానీ నేడు గుడ్డెద్దు చేనులోపడ్డట్టు వ్యవహారాలు నడుస్తున్నాయి. ప్రాధాన్యతలు మరిచిపోయి మన సంస్కృతి, ఆలోచనలు మంటకలిసిపోయి వ్యసనాలు, దురలవాట్లు, వావివరసలు పోయి అత్యాచారాలు, అనవసర ఖర్చులతో ఆర్థికభారం ఎక్కువై అప్పులపాలై బజారున పడిపోతున్నాం. వీటన్నింటినీ రూపుమాపడం ప్రభుత్వ బాధ్యతేకాదు అన్ని సంఘాలతోపాటు ప్రతీ తల్లిదండ్రులపైనా ఉందని స్పష్టం చేశారు. ఇందుకోసం కవులు, కళాకారులు తమ కలాలకు పదునుపెట్టి, కాళ్లకు గజ్జెలుకట్టి సంస్కరణలో కోసం పాటనో, లఘునాటికలు, కవితలు, రచనలు, ఏకపాత్రాభినయాలు, వీధినాటికలు, బుర్ర, హరికథలు, గేయరూపకాలు ఇలా ఏదోఒక కళారూపం, సృజనాత్మక రచనలతో రావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రభుత్వం వాటిని స్వీకరించి ప్రచారం మీద్వారానే చేయిస్తామని విన్నవించారు. ఈ విషయంలో అందరం అంకిత భావంతో ముందుకు పోదామని పిలుపునిచ్చారు. అందుకోసం మీ సృజన రూపాల రచనలను తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, సైఫాబాద్, హైదరాబాద్ చిరునామాకు అందజేయాల్సిందిగా మంత్రి కోరారు. కోదండరాం మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలు, దురలవాట్లు, సంక్షోభం, దుష్పరిణామాలు రూపు మాపాల్సిన అవసర ముందని, దీనికి సాహిత్య కళారూపాలను వాడుకోవాలన్నారు. అలేఖ్య పుంజాల పిల్లలకు చిన్నతనం నుండే కళారూపాల ద్వారా మార్పు తీసుకునేందుకు పాఠశాలల్లోనే నేర్పించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలన్నారు. జి.వి.వెన్నెల మనం పిల్లల గుండెల్లో కలుపుమొక్కలా లేక తులసి మొక్కలు నాటుదామో ఆలోచించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి చేతులమీదుగా సాంస్కృతిక సారథి ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఆవిష్కరింపజేశారు. అనంతరం హాజరైన కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, ప్రముఖులు ప్రసంగించి సూచనలిచ్చారు.

## రాష్ట్రంలో ఇక అద్దంలా హ్యామ్ రోడ్లు

### నిర్మాణానికి 32 ప్యాకేజీలు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇక అద్దంలా హ్యామ్‌రోడ్లు నిర్మించడానికి 32 ప్యాకెజీలుగా విభజించారు. ఆర్ అండ్ బి శాఖ పరిదిలో 5,566 కి.మీ నిడివితో రోడ్లను రూ. 10,547 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు త్వరలో టెండర్ ప్రక్రియ కూడా చేయబోతున్నారు. ఇందులో విస్తరించబడే రోడ్లు మొత్తం1,791 కి.మీ నిడివితో కలిగిన ఒక వరుస రోడ్డును రూ. 6,152 కోట్లు వ్యయం చేసి రెండు వరుసలుగా విస్తరిస్తారు.డబుల్ లేన్ 866 కి.మి. రూ.2,377 కోట్లు, 10మీటర్ల రోడ్డులను 779 కి.మీ వరకు 2,637 కోట్లు ఖర్చుచేయబోతున్నారు. 124 కి.మీ 735 కోట్లతో విస్తరిస్తున్నారు. రూ. 4,395 కోట్లు వ్యయం చేసి 3,775 కి.మీ నిడివి కలిగిన రోడ్లు బలోపేతం చేయబోతున్నట్లు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు. బలోపేతం అయ్యే సింగిల్ లేన్ 768 కి.మీ వీటికి 674 కోట్లు ఖర్చు అవుతోంది. డబుల్ లేన్ 2,618 కి.మీ నిడివి కలిగిన వాటికి 3031 కోట్లు ఖర్చుచేస్తారు. డబుల్ లేన్(10 మీటర్ల రోడ్డు) 148 కి.మీ ఉండగా వాటి కోసం 225 కోట్లు ఖర్చుచేయబోతున్నారు. నాలుగు వరుసలో 221 కి.మీ హ్యామ్ కింద బలోపేతంకు 444 కోట్లు వ్యయం చేయబోతున్నారు..ఆర్ అండ్ బి సర్కిళ్ల వారిగా మొత్తం 32 ప్యాకేజీల్లో పనులు చేపట్టనున్నట్లు,అందులో మొదటి ఫేజ్‌లో 10 ప్యాకేజీలు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టనునట్లు ఆర్అండ్ బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. .వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన ధీమా కూడా వ్యక్తంచేస్తున్నారు. వచ్చే 30నెలల్లో ప్యాకేజీల వారిగా అన్ని రోడ్లు పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటిస్తుండటంతో రాష్ట్రంలో హ్యామ్‌రోడ్ల నిర్మాణంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోన్నది.

## పర్యావరణ హితంగా దీపావళి జరుపుకొందాం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** పర్యావరణ హితంగా మతాబులు కాల్చా లని కాలుష్యం పెంచకుండా దీపావళిని ఆనందంతో జరుపుకోవాలని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. చెడు అను చీకటిపై మంచి విజయం సాధించి వెలుగు ప్రసాదించిన రోజుగా దీపావళి పండుగను జరుపుకొంటామని తెలిపారు. ఈ పండుగ ప్రతి ఇంటిలో ఆనందం నింపుతూ కుటుంబాల్లో సౌభాగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షి ంచారు. ప్రజలందరూ స్నేహం, సౌహార్దం, సోదరభావంతో కలిసి దీపావళిని జరుపుకోవాలని కోరారు. పండుగలు సమాజంలో ఐక్యత, సామరస్యానికి ప్రతీకలని, అందరి జీవితాల్లో సంతోష దీపాలు వెలిగించాలని ఆయన అభిలషించారు. ఈ పండుగ సమయంలో పటాకులు పేల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణాన్ని కాపాడే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సమాజంలో ప్రేమ, శాంతి, సౌహార్ద వాతావరణం నెలకొని రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షి ంచిన మహేష్ కుమార్ గౌడ్ గారు అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమ అరెస్టులతో బిసి ఉద్యమాన్ని ఆపలేరు

### 8 మంది బిసి నేతలను తక్షణమే విడుదల చేయాలి : ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్, అక్టోబరు 19,ప్రభాతవార్త:** అక్రమ అరెస్టులతో బిసి ఉద్యమాన్ని ఆపలేరని బిసి జెఎసి చైర్మన్ ఎంపి.ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం విద్యానగర్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు తెలపడం రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన ప్రాథమిక హక్కు అని నిరసనలు తెలియజేసేటప్పుడు ఉద్దేశపూర్వంగా బిసి ఉద్యోమకారులను రెచ్చగొట్టేలా పెట్రోల్‌బంక్ యజమాని వ్యవహరించాడని అక్కడన జరిగిన స్వల్పఘటనపై బిసి ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టడం సరైన చర్య కాదని ఆర్.కృష్ణయ్య అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యపద్ధతిలో శాంతియుతంగా నాయకులు, ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా రాష్ట్ర బంద్ నిర్వహించారని, పోలీసులు కూడా బంద్ నిర్వహణలో జిల్లాల్లో చట్టబద్దంగా వ్యవహరించారన్నారు. కానీ హైదరాబాద్‌లోని కాచిగూడ పోలీస్ అధికారులు అర్థరాత్రి పూట 8మంది బిసినేతలను అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం బేషరతుగా బిసి ఉద్యమ కారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని అందుకు సిఎం వెంటనే పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు.

**అరెస్టైన నేతలు..**

అరెస్టైన వారిలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ జేఏసీ కోర్డినేటర్ గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర నేతలు రాందేవ్, నిఖిల్, రాజ్ కుమార్, సాయిబాబా, రాంకోటి, రవితేజ, రామ్మూర్తి ఉండగా వీరిపై వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరికి గాంధీ హాస్పిటల్‌లో వైద్య పరీక్షల అనంతరం జడ్జి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## కుల దురహంకార హత్యపై కఠినచర్యలు తీసుకోవాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న కుల దురహంకార హత్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కుమురంభీంఆసిఫాబాద్ జిల్లా, దహెగాం మండలం, గెర్రె గ్రామంలో జరిగిన కుల దురహంకార హత్యను సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. ఎస్టీ (కోయ) కులానికి చెందిన తలండి శ్రావణ రాణి, అదే గ్రామానికి చెందిన వెనుకబడిన కులానికి చెందిన శివార్ల శేఖర్ ఇద్దరూ ప్రేమించి తల్లిదండ్రులను ఎదిరించి సంవత్సరం క్రితం కులాంతర వివాహం చేసుకున్నారని తెలిపారు. శేఖర్ తండ్రి సత్తయ్య ఈ వివాహాన్ని జీర్ణించుకోలేక, రాణిని గొడ్డలితో నరికి అత్యంత దారుణంగా హత్య చేశాడని, రాణి నిండు గర్భిణిగా పున్నప్పటికీ ఈ ఘాతుకానికి పాలడటం సభ్య సమాజాన్ని కలచి వేసిందన్నారు. రాష్ట్ర వ్యాపితంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా వీటిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతుందని జాన్‌వెస్లీ మండిపడ్డారు.

## పసిపిల్లలను టపాసులకు దూరంగా ఉంచాలి

### కంటి ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి:

### వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా.. ప్రతి ఇంట్లో జ్ఞానం, సంతోషం, శ్రేయస్సు అనే వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని మంత్రి లక్ష్మీ దేవిని ప్రార్థించారు. ఈ పండుగ రాష్ట్ర ప్రజలందరికీ నూతన ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని అందించాలని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ప్రజలు బాణసంచా విషయంలో జాగ్రత్తలు తీసుకుని, సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలని సూచించారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, బాంబులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పసి పిల్లలను టపాసులకు దూరంగా ఉంచాలని, దీపావళి నేపథ్యంలో అన్ని హాస్పిటళ్లలో డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రధానంగా సరోజిని దేవి కంటి హాస్పిటల్, ఇతర హాస్పిటళ్లలోని కంటి చికిత్స విభాగాల్లో డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. దురదృష్టవశాత్తూ ఎవరైనా కంటి గాయాలు, కాలిన గాయాలతో వస్తే, వారికి చికిత్స అందించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

## ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించేలా చూడాలి

### రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఒకే రకమైనటువంటి నాణ్యమైన విద్యను అందించే విధంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పని చేయాల్సినటువంటి అవసరం ఉందని తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. నగరాలలో కానీ గ్రామీణ ప్రాంతాల్లోగాని చదివే విద్యార్థులకు ఒకే ప్రమాణాలు కలిగినటువంటి విద్య అందించడమే తెలంగాణ విద్య కమిషన్ లక్ష్యమని దాని కొరకు ప్రధానోపాధ్యాయుల సంఘం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర కమిటీ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ .. తెలంగాణలో చదివే ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కార్పొరేట్ స్థాయి విద్యను పొందడానికి పరస్పర సహకారం, తార్కిక ఆలోచనలు మనకు ప్రధాన సూత్రాలుగా ఉండాలని, అప్పుడే నాణ్యమైన విద్య సాధ్యపడుతుందన్నారు. మండలానికి మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లను ఏర్పాటు చేయాలని విద్యా బడ్జెట్ 12 శాతానికి తగ్గకుండా ఉన్నప్పుడు ఇవన్నీ సాధ్యమవుతాయన్నారు. ప్రతి మండలంలో ఉన్నటువంటి మూడు నాలుగు గ్రామాల పాఠశాలలకు సౌకర్యాలను కల్పిస్తూ, విద్యార్థులకు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించడానికి కృషి జరుగుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం విప్లవాత్మకమైనటువంటి మార్పులు మనం చూడబోతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షులు రాజ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ గిరిధర్, కోశాధికారి తుకారాం, గౌరవాధ్యక్షులు సర్దార్ నాయక్‌తోపాటు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొన్నారు.సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని, ఒకే ఆవాసంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను, ఉచ్చతర, ఉన్నత పాఠశాలను విలీనం చేసి మౌలిక వసతులను అభివృద్ధి చేసి ఉపాధ్యాయుల సంఖ్యను పెంపొందించి నాణ్యమైన విద్య అందుటకు చర్యలు తీసుకోవాలని తీర్మానించనైనది. పర్యవేక్షక పోస్టులైన ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి, ఉపవిద్యాధికారి, డిప్యూటీ ఐఓఎస్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని తీర్మానించనైనది. అన్ని డైట్లలో ఖాళీగా ఉన్న సీనియర్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, మండల విద్యాధికారి పోస్టులను అప్గ్రేడ్ చేసి గ్రేడ్-2 గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి అవకాశాన్ని కల్పించాలన్నారు.

## చీకట్లను పారద్రోలి జీవితంలోకి వెలుగులకు ఆహ్వానం

### డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క దీపావళి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు19:** దీపాల కాంతు లతో, సంస్కృతీ సంప్రదాయాలతో చేసుకునే పండుగ దీపావళి. అమా వాస్య చీకట్లను పారదోలి పున్నమి వెలుగులను జీవితంలోకి ఆహ్వానించే పండుగ దీపావళి. తెలుగు ప్రజలందరికీ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని నిర్వహించు కుంటామన్నారు. దీపావళి స్ఫూర్తితో నయా నరకాసురులను ప్రజాస్వా మ్య పద్ధతిలో ఓడించి.. ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలే తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రజా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నిరుద్యో గులు వారి కుటుంబాల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపేలా కొలు వుల జాతర చేస్తోందన్నారు. ఇప్పటికే గ్రూప్ వన్, గ్రూప్ 2, టీచర్ల ఉద్యోగాలను ప్రజా ప్రభుత్వం భర్తీ చేసింది. రాష్ట్రంలోని ప్రతి కుటుం బంలో ప్రజాప్రభుత్వం సంక్షేమ పథకాల వెలుగులను అందిస్తోం దన్నారు. ఈ దీపావళి వేడుకల సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలను ప్రతిఒక్కరు తీసుకోవాలి. ఈ దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని ఆకాంక్షించారు.

**ప్రజలకు కెసిఆర్ దీపావళి శుభాకాంక్షలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు19:** ప్రజల జీవితాల్లో ప్రగతి వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

అజ్ఞానపు తమస్సును తొలగించుకునీ, ప్రతీ మనిషి తనలో జ్ఞానపు ఉషస్సులను వెలిగించుకోవాలనే స్ఫూర్తిని దీపావళి పర్వదినం అందిస్తుందని కేసీఆర్ అన్నారు.

పదేండ్ల బిఆర్ఎస్ పాలన రాష్ట్రంలో ప్రగతి వెలుగులు పంచిందని, తెలంగాణ ప్రజల జీవితాలలో కమ్ముకున్న చీకట్లు తొలగి ఆనందపు వెలుగులు నిండాలని ఆకాం క్షించారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రతి గడపలో ఆనందం వెల్లివిరియాలని ప్రార్థించారు.

## ప్రతి ఇంట్లో ఆనందం, శాంతి, ఐక్యత దీపాల వెలుగులు వెల్లివిరియాలి

### మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అంధకారాన్ని పారద్రోలే మహా పర్వదినమైన దీపావళి సందర్భంగా బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు చెప్పారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, శాంతి, ఐక్యత, అభివృద్ధి దీపాల వెలుగుల వలె విరజిల్లాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో సమృద్ధిగా ఉండా లని ఆ అమ్మవారిని ప్రార్థిస్తున్నానని, ఈ దీపావళి పండుగ వెలుగులు మన రాష్ట్రానికి మరింత వెలుగులు తెచ్చేలా, అభివృద్ధి పథంలో ముందుకు నడిపేలా మారాలని ఆశిస్తున్నానన్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్ల సాధికారత సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

దీపాల పండుగ చీకటిపై వెలుగు విజయంగా నిలుస్తుందని, ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, నూతనోత్సాహం, అభ్యుదయ కాంతులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, సమానత్వం, సామాజిక న్యాయం పట్ల కట్టుబడి ఉన్న ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. దీపావళి వెలుగులు ప్రతి గృహాన్ని ప్రకాశవంతం చేయడమే కాకుండా, ప్రతి మనసులో ఐక్యత, స్నేహభావం, సౌభ్రాతృత్వం నింపాలన్నారు.

## చెడుపై మంచి సాధించిన విజయం దీపావళి: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 19,ప్రభాతవార్త:** 'ఒక్కో దీపాన్ని వెలిగిస్తూ చీకటిని తరిమేసినట్టుగానే, మనుషుల్లో అజ్ఞానమనే చీకటిని తొలగిస్తూ జ్ఞాన వెలుగులు నింపే దీపాల పండుగ దీపావళి" అని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ దీపావళి ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలనీ,ఆ లక్ష్మీదేవి కృపాకటాక్షాలతో ప్రతి ఇల్లు సకల శుభాలు, పాడి పంటలు, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో వెల్లివిరియాలనీ ఆకాంక్షించారు. పిల్లలు, పెద్దలు పటాకులు కాల్చేటప్పుడు ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలు పాటిస్తూ ఈ దీపావళి పండుగ అత్యంత ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు.రాక్షస సంహారంతో చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి అని ఆయన అన్నారు.



ఆర్ట్స్ కాలేజీ వద్ద మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బొల్లెపల్లి స్వామిగౌడ్, గణేష్‌చారి, శ్యాంకురుమ తదితరులు

# బిసి బంద్ ఒక ట్రైలర్ మాత్రమే..

## దీపావళి తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం

### బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్ల సాధన కోసం బిసిజెఏసి ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర బంద్ విజయవంతం అయిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీలు ఇచ్చిన మొట్టమొదటి దిగ్విజయంగా కొనసాగి చరిత్ర సృష్టించిందని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈమేరకు ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజ్ వద్ద బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు బొల్లెపల్లి స్వామిగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివిధ బీసీ సంఘాల నేతలతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న జరిగిన రాష్ట్ర బంద్ ఒక ట్రైలర్ మాత్రమేనని, బీసీ రిజర్వేషన్ల కు రాజ్యాంగబద్ధత కల్పించే వరకు తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. దీపావళి పండుగ తర్వాత బీసీ జేఏసీ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. బీసీ బంద్ కు అడగగానే మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, టీజేఎస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, సేవాలాల్ సేన, ఆదివాసి సంఘం, ఆమ్ ఆద్మీ , అరుణోదయ, మావోయిస్టు పార్టీ, శివసేన, ఓయూ విద్యార్థి జేఏసీ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ, బీసీ ఉద్యోగ సంఘాలు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ, తెలంగాణ జాగృతి, బీసీ న్యాయవాదులు జేఏసీ, మన ఆలోచన సాధన సమితి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, ఏపీ బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల సంఘాల జేఏసీ, తదితర పార్టీలకు, సామాజిక ఉద్యమ శక్తులకు, ప్రజా సంఘాలకు, మీడియా అధిపతులకు అలాగే ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు, వర్తక వాణిజ్య వ్యాపారులకు, పోలీసులకు శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీసీ బంద్ లో ప్రత్యక్షంగా పాల్గొని క్రియాశీలకంగా పనిచేసిన 33 జిల్లాల బీసీ ఉద్యమ శ్రేణులకు, బీసీ కుల సంఘాల నేతలకు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో సామాజిక న్యాయం కోసం, హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం, కుందారం గణేష్ చారి, కేపీ మురళీకృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కానకాల శ్యాం కురుమ, బి మని మంజరి సాగర్, దిటి మల్ల , ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ,గూడూరు భాస్కర్ మేరు, నరసింహా చారి, తదితరులు పాల్గొన్నారు



## 25 నుండి తెలంగాణ జాగృతి 'జనం బాట'

### స్వామివారి ఆశీస్సులుండాలని వేడుకున్నా

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**తిరుమల, అక్టోబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణలో బిఆర్ఎస్‌లో తలెత్తిన రాజకీయ పరిణామాలతో రానున్న నాలుగునెలలపాటు ప్రజలతో మమేకమయ్యేందుకు తెలంగాణ జాగృతి 'జనంబాట' యాత్ర చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ యాత్రకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లు ఉండాలని వేడుకున్నానన్నారు. తాను చేపడుతున్న యాత్రని స్వామివారికి విన్నవించేందుకు తిరుమలకు వచ్చానన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని, బాగుండాలని భగవంతుడ్ని మనస్పూర్తిగా కోరుకున్నట్లు చెప్పారు. హాతీరాంబావాజీ బార్సీ ఉత్సవాల్లో పాల్గొని దర్శనం చేసుకున్నానని ఆమె తెలిపారు. ఆదివారం ఉదయం కవిత దంపతులు తిరుమలకు చేరుకున్నారు. విఐపి బ్రేక్‌లో ఆలయంలోపల ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పత్తి కొనుగోళ్లు మరింత జాప్యం

### పూర్తికాని జిన్నింగ్ మిల్లుల నోటిఫై


**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు మరింత జాప్యం అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే విక్రయం కోసం రైతులు ఖరీఫ్ పత్తిని మార్కెట్‌ల్లోకి తీసుకొస్తున్నారు. అయితే జిన్నింగ్ మిల్లుల సమస్యతో కాటన్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలను ప్రారంభించ లేదు. దీపావళి నుండి పత్తి కొనుగోలు చేస్తామని కాటన్ కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు.

అయితే సిసిఐ ఇంత వరకూ రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జరగలేదు. ముఖ్యంగా జిన్నింగ్ మిల్లుల నోటిఫై ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. దీంతో పత్తి కొనుగోళ్ల మరింత జాప్యం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని 30 జిల్లాల్లోని 343 మిల్లులకు పత్తి జిన్నింగ్ చేసే సామర్థ్యం ఉండగా, ఇంత వరకూ 22 జిల్లాలలకు సంబంధించిన కలెక్టర్లు 220 మిల్లులను నోటిఫై చేశారు. ఇంకా మరో 8 జిల్లాల్లో నోఫిఫై కావాల్సి ఉంది.

## భారతీయులపై అమెరికా రాజకీయ నేత విద్వేషం

### అందరినీ వెనక్కి పంపించేయాలని పోస్టు

**ఫ్లోరిడా, అక్టోబరు 19:** భారతీయులు ఎవరూ అమెరికా గురించి ఆలోచించరని ఆరోపిస్తూ వారందరినీ వెనక్కి పంపించేయాలని అమెరికా రాజకీయ నేత చాండ్లర్ లాంగేవిన్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.



ప్రస్తుతం ఈపోస్టు భారత సంతతి అమెరికన్లతో పాటు అమెరికన్లలోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికాలో విద్వేషానికి చోటులేదని, చాండ్లర్ వ్యాఖ్యలు విద్వేషపూరితమైనవేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లోరిడాకు చెందిన చాండ్లర్ లాంగేవిన్ స్థానిక పామ్ బే సిటీ కౌన్సిల్‌కు చెందిన కన్జర్వేటివ్ నాయకుడు. ఈ వివాదాస్పద పోస్టు నేపథ్యంలో చాండ్లర్ పై పామ్ బే సిటీ కౌన్సిల్ చర్యలు తీసుకుంది. గత నెలలో ఓ భారతీయ ట్రక్ డ్రైవర్ చేసిన ప్రమాదంలో అమెరికన్ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ వార్తను సోషల్ మీడియాలో పంచుకుంటూ అమెరికాలోని భారతీయులందరినీ వెంటనే బహిష్కరించాలని చాండ్లర్ పోస్ట్ చేశారు. భారతీయులు అమెరికాను అస్సలు పట్టించుకోరని, వారు మనల్ని ఆర్థికంగా దోచుకుంటున్నారని చాండ్లర్ తన పోస్టులో పేర్కొన్నారు. అమెరికా కేవలం అమెరికన్ల కోసమేనని మరో పోస్టులో వ్యాఖ్యానించారు. తన పుట్టిన రోజు సందర్భంగా చాండ్లర్ సోషల్ మీడియాలో పెట్టిన మరో పోస్టులో 'నా పుట్టినరోజు సందర్భంగా అమెరికాలోని ప్రతీ భారతీయుడినీ బహిష్కరించాలని కోరుకుంటున్నా' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను ట్యాగ్ చేశారు. చాండ్లర్ తన పోస్టుల్లో భారతీయులపై విద్వేషం వెల్లగక్కడంపై సిటీ కౌన్సిల్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. భారత సంతతి ప్రజలతో పాటు స్థానికులు కూడా పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో చాండ్లర్ ను కమిటీ నుంచి తప్పిస్తూ సిటీ కౌన్సిల్ చర్యలు తీసుకుంది. ఇకపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని ఆదేశించింది

## మంత్రి కుమార్తె ఏకంగా సిఎంపైనే ఆరోపణలు చేస్తే

## వివరణ ఎందుకు ఇవ్వలేదు?

### గన్ కల్చర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ ఎందుకు విచారణకు ఆదేశించరు? : సబితా ఇంద్రారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 19:** సిట్టింగ్ మంత్రి కూతురు ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేస్తే ఎందుకు వివరణ ఇవ్వలేదని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నిం చారు. ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డికి ఉందన్నారు. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడే ఈ సెటిల్‌మెంట్‌లో కూర్చున్నాడంటే కచ్చితంగా రేవంత్ రెడ్డికి ఇందులో హస్తం ఉంటుందని చెప్పారు. ఆదివారం బీఆర్ఎస్ మహిళా నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏ సిమెంట్ కంపెనీ డైరెక్టర్‌ను బెదిరించారో అతని స్టేట్‌మెంట్ పోలీసులు తీసుకున్నారా, ఒక వేళ తీసుకుంటే అది ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. నిందితుడు మంత్రి కొండా సురేఖ ఇంట్లో ఎందుకు ఉన్నాడని, అతని ఎందుకు ఆశ్రయం ఇవ్వడం సరైనదేనా అని ప్రశ్నించారు. నిందితుడిని మంత్రి తన కారులో తీసుకెళ్తే పోలీసులు చర్యలు తీసుకోరా అన్నారు. ఈ అంశంలో అసలేం జరిగింది, ఎక్కడ సెటిల్‌మెంట్ జరిగిందన్నారు. టేబుల్‌పై గన్ పెట్టి బెదిరించారని, ముఖ్యమంత్రే స్వయంగా తుపాకీ ఇచ్చారని చెబుతున్నారని, ఈ గన్ కల్చర్ ఎక్కడి నుంచి వచ్చిందని, ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ పోటీల్లో మహిళకు అన్యాయం జరిగితే దానిపై క్లారిటీ లేదు. సీఎం సొంత నియోజకవర్గంలో మహిళా జర్నలిస్టులపై కేసులు పెట్టారు. నిండు సభలో మహిళా ఎమ్మెల్యేలను సీఎం అవమానించారు.

తాజాగా మాగంటి సునీతపై మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం. కేబినెట్ మంత్రి ఇంటిపైకి పోలీసులు వెళ్లారు. రాష్ట్రంలో మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి ఇది నిదర్శనం. నాడు కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయి. నేడు రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నది. రాష్ట్రంలో గన్ కల్చర్ తెచ్చారు. మంత్రి ఇంటి పైకి అర్ధ రాత్రి పోలీసులు వెళితే దానిపై ఎఫ్ఐఆర్ ఉందా, పోలీసులు దీనిపై ఎందుకు మౌనం వహిస్తున్నారు. డీజీపీ దీనిపై సమాధానం చెప్పాలి. నిందితుడిని మంత్రి కారులో తీసుకుపోతే ఎందుకు కేసు పెట్టలేదు?. సీఎం స్వయంగా గన్ ఇచ్చారని మంత్రి కూతురు ఆరోపిస్తే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు? సిమెంట్ కంపెనీ యజమాని దగ్గర ఫిర్యాదు తీసుకున్నారా? ఈ అంశంలో ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి.

డీజీపీ అధికారంలోకి వచ్చాక ఏ బుక్ లేదు.. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం అన్నారు. స్వయంగా సీఎంపైనే ఆరోపణలు వస్తున్నాయి. మంత్రులపై ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి. కేబినెట్ సమావేశంలో ఏ మంత్రి వాటా ఎంత అనే దానిపై చర్చిస్తున్నారు. దీనిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి. కాంగ్రెస్ ఇన్‌చార్జితో మాట్లాడుకున్నామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇది పార్టీ వ్యవహారం కాదు. ప్రజలకు సంబంధించింది. మేడారం జాతర పనులు ఒక శాఖ నుంచి మరో శాఖకి ఎందుకు మార్చారు? సిమెంట్ కంపెనీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. మంచిరేవుల భూముల వ్యవహారంలో సీఎం సోదరులపై ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో ఇంత జరుగుతుంటే బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదు. కేంద్ర మంత్రులు ఇద్దరు ఉండి ఎందుకు విచారణ జరపరు?. బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉండి గన్ కల్చర్‌పై ఎందుకు విచారణకు ఆదేశించరు అని సబిత ప్రశ్నించారు.

## 31 వరకు 'ఏక్ భారత్-ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం 'ఏక్ భారత్ – ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాన్ని అక్టోబర్ 6న లాంఛనంగా ప్రారంభిం చబడిందని, ఈ కార్యక్రమం అక్టోబర్ 31 వరకు కొనసాగుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షన సర్దార్ 150 రాష్ట్రస్థాయి కార్యశాల ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు వింటే తెలంగాణ ప్రజల హృదయాలు గర్వంతో నిండుతాయని, ఎందుకంటే ఆయన కృషి వల్లే ఈరోజు తెలంగాణ భారతదేశంలో భాగమైందన్నారు. చరిత్రను వక్రీకరించి రాజకీయ లాభం కోసం కొన్ని పార్టీలు సత్యాన్ని దాచిపెట్టినా, భారతీయ జనతా పార్టీ మాత్రం నిజమైన చరిత్రను ప్రజలకు స్పష్టంగా తెలియ జేస్తుందన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం అయిన రోజును తెలంగాణ ప్రభుత్వాలు అధికారికంగా జరపకపోయినా, నరేంద్ర మోడీ ప్రభుత్వం, బిజెపి ఆధ్వర్యంలో 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా జరుపు తుందన్నారు.



దేశ ఏకీకరణలో సర్దార్ పటేల్ పాత్ర అమోఘం అన్నారు. 560 సంస్థానాలను ఒక్క జెండా కింద కలిపి భారతదేశాన్ని ఏకం చేశారు. ఐరన్ మాన్ ఆఫ్ ఇండియా' అనే బిరుదులు సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి సరిపోయేవి అన్నారు. జూనాగఢ్, హైదరాబాద్, కాశ్మీర్ వంటి ప్రాంతాలను కూడా భారతదేశంలో విలీనం చేసిన నాయకుడు ఆయనే అన్నారు. ఇతర రాజకీయ పార్టీలు ఆయనను మర్చిపోయినా, దేశభక్తి గల భారతీయ జనతా పార్టీ మాత్రం ఆయనను ఎప్పటికీ స్మరిస్తుందన్నారు. ఆయన కాంగ్రెస్ నాయకుడైనా, ఆయన దేశ సేవ మనకు స్ఫూర్తి అన్నారు. ఇప్పుడు ఈ దేశం మీద విదేశీ శక్తులు కుట్రలు పన్నుతున్నాయి. జార్జ్ సోరోస్ వంటి వ్యక్తులు కాంగ్రెస్ పార్టీకి నిధులు సమకూర్చి దేశాన్ని విడదీయాలన్న ప్రయత్నం చేస్తున్నారని, ఒకవైపు సర్దార్ పటేల్ దేశాన్ని ఏకం చేస్తే, అదే పార్టీలోని కొంతమంది ఈరోజు దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అయితే మన అభినవ సర్దార్ పటేల్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం (నక్సలిజం) దేశంలో దాదాపు నిర్మూలనైందని అన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో నక్సలిజం నిర్మూలించడం కష్టం" అనే పరిస్థితి ఉండగా, నేటి హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నక్సలిజాన్ని పూర్తి నిర్మూలిస్తామన్న మాట నిలబెట్టుకున్నారు. అమిత్ షా ఈ తరం సర్దార్ పటేల్ అని చెప్పడంలో అతిశయోక్తి లేదని అన్నారు. దేశ ఏకత్వం కోసం సర్దార్ పటేల్ చేసిన త్యాగం భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని అన్నారు. "ఏక్ భారత్ – ఆత్మనిర్భర్ భారత్"... కేవలం ప్రభుత్వమే కాదు, ప్రతి పౌరుడు పాల్గొనాల్సిన జాతీయ ఉద్యమమని, ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానంలో ఉన్న భారత్, ఇప్పుడు నాలుగో స్థానంలో ఉందన్నారు. త్వరలోనే మూడో స్థానంలోకి చేరుతుందన్నారు. అందుకే సర్దార్ పటేల్ స్వదేశీ భావజాలాన్ని మనం కొనసాగించాలని, వొకల్ ఫర్ లోకల్, లోకల్ టు గ్లోబల్ అనే ఆత్మవిశ్వాసంతో, భారతదేశం ఒక్కటే దేశం, కులం, మతం, భాష, ప్రాంతం అనే పేర్లతో దేశాన్ని విభజించాలనుకునే ఎవరి కుట్రలూ విజయం సాధించవని అన్నారు. దేశ ఏకత్వాన్ని కాపాడేది కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమే అన్నారు. మనం భారత పౌరులం కాబట్టి, భారతదేశ అభ్యున్నతి కోసం, దేశ ఏకత కోసం ఈ కార్యక్రమంలో పాల్గొనడం మనందరి బాధ్యత అని అన్నారు.

## డ్రగ్స్‌తో వెళుతున్న కరీబియన్ నౌకను పేల్చివేసిన అమెరికా సైన్యం

**వాషింగ్టన్, అక్టోబరు 19:** కరేబియన్ సముద్రంలో కలకలం రేగింది. అమెరికా తీరం వైపు భారీగా మాదకద్రవ్యాలతో వస్తున్న ఓ సెమీసబ్‌మెర్సిబుల్ నౌకను అమెరికా సైన్యం బాంబులతో పేల్చివేసింది. అంతర్జాతీయ డ్రగ్స్ రవాణాకు కీలక మార్గంగా ఉన్న ఈ ప్రాంతంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో ఇద్దరు స్మగ్లర్లు అక్కడికక్కడే మరణించారు. ఈ దాడి ద్వారా సుమారు 25,000 మంది అమెరికన్ల ప్రాణాలను కాపాడినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ ఘటనపై తన అధికారిక సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ స్పందించారు. "అమెరికాలోకి ప్రాణాంతకమైన ఫెంటానిల్, ఇతర మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్న భారీ సబ్‌మెరైన్‌ను మన సైన్యం విజయవంతంగా ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ నాకు ఎంతో గర్వకారణం. ఒకవేళ ఈ నౌక మన తీరానికి చేరి ఉంటే దాదాపు 25,000 మంది అమాయక అమెరికన్లు ప్రాణాలు కోల్పోయేవారు. ఈ దాడిలో ఇద్దరు టెర్రరిస్టులు హతమయ్యారు" అని ఆయన



పేర్కొన్నారు. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలను అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ ఎక్స్‌లో విడుదల చేసింది. ఆ వీడియోలో, సముద్ర జలాల్లో వేగంగా ప్రయాణిస్తున్న సెమీ సబ్‌మెర్సిబుల్‌పై అమెరికా హెలికాప్టర్ల నుంచి బాంబులు వర్షంలా కురవడం, అనంతరం అది పేలిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. గురువారం జరిగిన ఈ ఆపరేషన్ తర్వాత, నౌక శకలాల నుంచి ప్రాణాలతో బయటపడిన ఇద్దరిని యూఎస్ దళాలు రక్షించి, తమ యుద్ధనౌకకు తరలించాయి. పట్టుబడిన వారిలో ఒకరు ఈక్వెడార్, మరొకరు కొలంబియా దేశస్థులని అధికారులు ధ్రువీకరించారు. వారిని విచారణ నిమిత్తం స్వదేశాలకు పంపిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి కరేబియన్ ప్రాంతంలో అమెరికా ఇలాంటి ఆపరేషన్లు చేపట్టడం ఇది ఆరోసారి కావడం గమనార్హం. ఈ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 29 మంది డ్రగ్ స్మగ్లర్లు మరణించారు. మెక్సికన్ డ్రగ్స్ కార్టెల్స్‌పై తమది కేవలం నిఘా మాత్రమే కాదని, ఇదొక "సాయుధ పోరాటం" అని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. 9/11 ఉగ్రదాడుల అనంతరం టెర్రరిజంపై యుద్ధం కోసం రూపొందించిన చట్టపరమైన అధికారాలనే ఇప్పుడు ఈ డ్రగ్స్ కార్టెల్స్‌పై ప్రయోగిస్తుండటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. "సముద్ర, భూ మార్గాల ద్వారా మా దేశంలోకి విషాన్ని పంపాలని చూసే మాదకద్రవ్యాల టెర్రరిస్టులను అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు" అని ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు.

## లాడ్జిలో శవమై తేలిన తమిళనాడు విద్యార్థి

**బెంగళూరు, అక్టోబరు 19:** బెంగళూరునగరంలోని మడివాళలో ఉన్న ఓ ప్రముఖ లాడ్జిలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. ఎనిమిది రోజులుగా తన ప్రియురాలితో కలిసి ఉంటున్న తక్షిత్ (20) అనే విద్యార్థి శనివారం శవమై కనిపించాడు. అతడితో పాటు గదిలో ఉన్న యువతి కనిపించకుండా పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మడివాళ పోలీసుల కథనం ప్రకారం దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరుకు చెందిన తక్షిత్, విరాజపేటకు చెందిన అతని ప్రియురాలు (20) ఎనిమిది రోజుల క్రితం లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. వీరిద్దరూ తమిళనాడులోని పణంబూరులో ఒకే కళాశాలలో బీబీఎం చదువుతున్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలని, స్నేహితుల ఇంట్లో ఉండి చదువుకుంటామని ఇళ్లలో అబద్ధం చెప్పి బెంగళూరుకు వచ్చారు. లాడ్జిలో దిగిన నాటి నుంచి ఆహారం, కాఫీ వంటివి తమ గదికే తెప్పించుకునేవారు. గత గురువారం రాత్రి ఫుడ్ పాయిజనింగ్ అయిందని చెప్పి ఇద్దరూ మెడికల్ షాపు నుంచి మందులు తెచ్చుకుని వాడినట్లు తెలిసింది. ఆ తర్వాత శుక్రవారం ఉదయం నుంచి వారి గది తలుపులు తెరుచుకోలేదు. శనివారం గది నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి బలవంతంగా తలుపులు తెరిచి చూడగా, మంచంపై తక్షిత్ మృతదేహం కనిపించింది. పోలీసులు లాడ్జిలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా కీలక విషయం బయటపడింది. తక్షిత్ చనిపోవడానికి కొన్ని గంటల ముందే తన ప్రియురాలిని ఊరికి పంపించినట్లు రికార్డయింది. ఆమెను పంపించి తిరిగి గదికి వచ్చిన తర్వాతే అతడు మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం అదృశ్యమైన యువతి కోసం గాలిస్తున్నారు. ఆమె ఆచూకీ లభిస్తేనే ఈ మృతి వెనుక ఉన్న మిస్టరీ వీడుతుందని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## నకిలీ మద్యం, సారాలో మునిగిన చంద్రబాబు సర్కారు

### లైడిటెక్టర్ టెస్టుకు నేను సిద్ధం

### ఎపి మాజీమంత్రి జోగి రమేష్

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** నకిలీ మద్యం, నకిలీ సారాలో చంద్రబాబు సర్కార్ మునిగిపోయిందని వైఎస్సార్సీపి నేత, మాజీమంత్రి జోగి రమేష్ విమ ర్శించారు. ఫేక్ ప్రభుత్వం.. ఫేక్ బాబు, ఫేక్ లోకేష్..



కట్టు కథలు, పచ్చి అబద్ధాలు ఇవే టిడిపి ప్రభుత్వం చేస్తున్నదని ధ్వజ మెత్తారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్ మీట్‌లో మాట్లాడిన జోగి రమేష్.. చంద్రబాబు నేతృత్వంలోని ఎపి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బాబు చేసిన కల్తీని వైఎస్సార్సీపిపై రుద్దే య త్నం చేస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారం కోసం చేసే ఐవిఆర్ఎస్ కాల్స్‌ను నకిలీమద్యం కోసం టిడిపి వాడుతుందన్నారు. నకిలీ మద్యం ఎక్కడ తయారయింది.. ఎక్కడకు సరఫరా అయిందో ఎందుకు ఎంక్వరీ చేయడం లేదని ప్రశ్నించారు. డైవర్షన్ కోసం చంద్రబాబు ప్రభుత్వం మాపై విమ ర్శలు చేస్తున్నదని, అద్దెపల్లి జనార్దన్‌కు రెడ్‌కార్పెట్ వేసింది టీడీపీ ప్రభుత్వ మేనన్నారు. అద్దెపల్లి జనార్దన్, టిడిపి కుమ్మక్కయ్యాయని ఏ విచారణకైనా సిద్ధ మని చెప్పినా ప్రభుత్వం నుంచి స్పందనలేదన్నారు. జైలుకు పంపించి రాక్షసా నందం పొందడం బాబుకు అలవాటు, దమ్ముంటే నాకు లైడిటెక్టర్ టెస్ట్ చేయం డని.. ప్రభుత్వం ఎక్కడికి రమ్మన్నా.. వస్తానని సవాలు విసిరారు. ఎపిలో మంచినీటి కుళాయిల కన్నా.. బెల్ట్ షాపులే ఎక్కువగా ఉన్నాయని, నారా వారి సారా పాలనను డోర్ డెలివరీ చేస్తున్నారని మండిపడ్డారు.

### లాసెట్ పిజిఎల్‌సెట్-2025

## సీటు కేటాయింపు ప్రక్రియ ప్రారంభం

**తిరుపతి,అక్టోబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లాసెట్,పిజిఎల్‌సెట్ 2025 సీటు కేటాయింపు ప్రక్రియ ప్రారంభమైందని అడ్మి షన్స్ కన్వీనర్ తెలిపారు. ప్రవేశాలకోసం రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్ ఆప్షన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు తెలిపిన తేదీల ప్రకారం ప్రక్రియను పూర్తిచేసి తరగతులకు హాజరు కావాలని ఏపి లాసెట్ కన్వీనర్ చెప్పారు. వెబ్ ఆప్షన్లు ఈనెల 21,22తేదీలు,మార్పుచేసుకునే వెసులుబాటు 23న, సీటు కేటాయింపు 25న ,కళాశాలలో ప్రవేశాలకు 27నుండి 29వతేదీ వరకు అవకాశం కల్పించారు. 27వతేదీ తరగతులు ప్రారంభమవు తాయన్నారు. పూర్తివివరాలకు అధికారిక వెబ్ సైట్ "హెచ్‌టిటిపిఎస్:సిఇటిఎస్. ఏపిఎస్ వాచ్‌ఇ.ఏపి. జివొవి.ఇన్‌ను సందర్శించాలని కోరారు.

## 'శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి'

**తిరుమల,అక్టోబరు 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతోరెండు తెలుగురాష్ట్రాల ప్రజలందరికీ శుభాలు కలగాలని పలువురు తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం తెలంగాణ ఎంపి ఈటల రాజేందర్, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామచందర్‌నాయక్, ఎంపి బలరాం నాయక్, మాజీ ఎంపి సీతారాంనాయక్ అనుచరులతో కలిసి ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. దేవదేవుడ్ని దర్శించుకుంటే మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటుందన్నారు. టిటిడి అధికా రులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అటవీ అనుమతులతో రహదారుల విస్తరణకు మోక్షం

### అటవీ పునరుజ్జీవనం కోసం భూముల బదలాయింపు

### వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధికి పరిహారం వసూలు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** అటవీశాఖ పరిధిలో చేపట్టనున్న రహదారుల పునరుద్ధరణ, విస్తరణ పనులుచేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడవుల పునర్జీవనం జీవవైవిధ్యం పరిరక్షణకు కోట్ల రూపాయల పరిహారం చెల్లించడంతోపాటు వందల ఎకరాల భూమిని బదిలీ చేయడంతో ఆటవీ శాఖ అనుమతులు మంజూరు చేయడంతో ఇన్నాళ్ళు అటవీ ప్రాంత్రాల్లో అనుమతులు లేకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయిన రహదారుల నిర్మాణాలలో కదలిక వచ్చే అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో ఆర్అండ్‌బి శాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు అటవీశాఖ అనుమతి కోసం రెండేళ్ల నుంచి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల రోడ్లపై చిరుతలు, పులుల సంచారం పెరగడం, అవి తరుచు ప్రమాదాలకు గురై చనిపోతుండటంతో అటవీశాఖ అనుమతులు ఇవ్వడంకు వివిధ కారణాలు చూపుతూ మోకాలడ్డుపెట్టడంతో రోడ్ల విస్తరణకు ప్రతిబంధకాలు ఏర్పాడ్డాయి. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే44 జాతీయ రహదారిపై గత ఆరేళ్ళలో ఐదు చిరుతలు ఒక ఎలుగుబంటి చనిపోయాయి. వాహనాల వేగంతో ఉత్తర తెలంగాణలోని అటవీ ప్రాంతాలలో రోడ్లపై వన్యప్రాణులు చనిపోవడం రివాజుగా మారింది. అటవీశాఖ జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాలలో చేపట్టే రహదారుల పునరుద్ధరణకు అనుమతులు ఇచ్చింది. నిజామాబాద్ జగదల్పూర్ వెళ్లే ఎస్. హెచ్63 రహదారిలో ఏడు చోట్లలో బ్లాక్ స్పాట్లను పునరుద్ధరిచేందుకు హెచ్.హెచ్.ఏ.ఐ నిధులు మంజూరు చేసింది. కాని పనులు చేపట్టాల్సిన ప్రాంతం అంతా మంచిర్యాల జిల్లా చెన్నూరు డివిజన్ అటవీ ప్రాంతం పరిధిలో ఉంది. నాలుగు వరసలరోడ్డు నిర్మాణంతో ఏడు బ్లాక్ స్పాట్లను సరిదిద్దడానికి 3.75 ఎకరాల అటవీ భూమి కోల్పోవాల్సి వస్తుంది. బ్లాక్‌స్పాట్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టే రహదారి నిర్మాణం పనులు చేపడుతున్న ఏజన్సీకి కొన్ని షరత్తులు పెట్టి అటవీ శాఖ అనుమతులు జారీ చేసింది. మంచిర్యాల డివిజన్ అటవీ పరిధిలో 7 నుంచి 10 ఏళ్ల పాటు రహదారికి ఇరువైపులా చెట్లు పెంచాలని సూచించింది. ఈ చెట్ల నిర్వహణ బాధ్యత కూడా పనులు చేపట్టిన ఏజన్సీ తీసుకోవాల్సి ఉంటుంది. రహదారికి ఇరువైపులా కనీసం 2నుంచి 3 వరుసలు పొడవైన నీడను, కలపను ఇచ్చే చెట్లను పెంచాలని సూచించింది. రహదారి వెంట ఉండే సహజ వాగులు, నదులు, ఏరు, కుంటల ధ్వంసచేయకుండా కల్వర్టులు బ్రిడ్జిలు వీలును బట్టి నిర్మాణాలు చేపట్టాలి. సహజ నీటి ప్రవాహాలకు అడ్డంకులు సృష్టించే నిర్మాణాలు ఉండకూడదని సూచించింది. అడవి జంతువుల సంచారానికి కూడా ఆటంకం కలిగించకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒక వరుస నుంచి రెండు వరసలుగా విస్తరించే రోడ్డులో భూపాలపల్లి డివిజన్లో ఏడు కిలోమీటర్ల నిడివి కలిగిన అటవీ ప్రాంతం ఉంది . ఈ రహదారి నిర్మాణంలో 10.5 ఎకరాలకుపై అటవీ భూమి కోల్పోతుంది. ఖమ్మంపల్లి భూపాలపల్లి మధ్యలో ఉన్న ఆర్ అండ్ బీ సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుకు విస్తరించనున్న నేపథ్యంలో ఈ అటవీ భూమి సేకరణ చేయాల్సిన అవసరం ఉంది. ఈ భూమికి రూ.3.98 కోట్ల పరిహారంతో పాటు ఈ భూమికి బదులుగా మరో చోట ప్రభుత్వ భూమిని తీసుకుంటూ, వివిధ పరిమితులు పెట్టి అటవీశాఖ అనుమతులు మంజూరు చేసింది. ఖాళీ స్థలం ఉన్న చోట అటవీపునీర్జవనం చర్యలను రాష్ట్రప్రభుత్వం చేపట్టడమే కాకుండా జీవవైవిధ్యం కాపాడటానికి బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది ఎం ఆర్ ఎల్ -13చామస్పల్లి నుంచి చెన్నూర్ డివిజన్లోని కుశ్నపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 7.5 ఎకరాల అటవీప్రాంతం దెబ్బతినే అవకాశం ఉంది. ఈ భూమికి బదులుగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ అటవీ డివిజన్, కెరామెరి మండలంలోని ఇందాని గ్రామం పరిధిలో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు బదిలీ చేశారు. దీంతో పాటు రూ.42.15 లక్షల పరిహారం కోరింది. బదిలీ చేసిన 100 ఎకరాల భూమిలో రూ.12.31 లక్షల వ్యయంతో చెట్లు పెంచాలి. హద్దులు ఏర్పాటు చేయాలి. అగ్నిమాపక నిర్వహన చర్యలు చేపట్టాలని, కేటాయించిన భూమి చుట్టూ పెన్సింగ్‌ను రోడ్ల నిర్మాణ సంస్థ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది . మరో రూ.39.84 లక్షలతో వన్యప్రాణుల ఆవాసాలను మెరుగుపరచడం, జంతు రక్షణ కేంద్రాలను స్థాపించడం, తదితర కార్యక్రమాలకు ఈ నిధులు వినియోగించాలని అటవీశాఖ మార్గ నిర్దేశనం చేసింది. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్లలో 86 వేల హెక్టార్లలో అడవి విస్తరించి ఉంది. ఇందులో నిజామాబాద్ ఉత్తరం, దక్షిణం, ఇందల్‌వాయి, ఆర్మూర్, కమ్మర్‌పల్లి, సిరికొండ, వర్ని రేంజ్‌లున్నాయి. 44వ జాతీయ రహదారిపై చిరుతల సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో వన్యప్రాణులు అడవిని విడిచి, జాతీయ రహదారిపైకి రాకుండా ఉండేందుకు అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందల్‌వాయి రేంజ్ పరిధిలో దట్టమైన అడవి ప్రాంతం ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా ఆరు అడుగుల ఎత్తుతో కంచె ఏర్పాటు చేస్తున్నారు. వన్య ప్రాణులకు హాని జరుగకుండా కంచె ఏర్పాటు చేస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ‘కె-ర్యాంప్’తో మళ్లీ బ్లాక్ బస్టర్ ఇచ్చారు

## సక్సెస్ మీట్‌లో హీరో కిరణ్ అబ్బవరం



**దీపావళి సక్సెస్** సెంటిమెంట్‌ను రిపీట్ చేస్తూ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ‘కె ర్యాంప్’ తో బ్లాక్ బస్టర్ కొట్టాడు. ఈ రోజు థియేటర్స్‌లోకి వచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు ఎంటర్ టైన్ మెంట్ అందిస్తూ ఘన విజయాన్ని దక్కించుకుంది. ‘కె ర్యాంప్’ మూవీ విజయవంతమైన నేపథ్యంలో చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ దీపావళికి నాకు మళ్లీ బ్లాక్ బస్టర్ ఇచ్చారు. ఊర్లు, టౌన్స్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందా అని మార్నింగ్ నుంచి వెయిట్ చేస్తూ ఉన్నాం. మేము ఊహించినదానికంటే ఎక్కువ రెస్పాన్స్ వచ్చింది. ప్రెస్ షో చూసిన మీడియా మిత్రులు కాల్ చేసి మేము బాగా నవ్వుకున్నాం అని చెబుతున్నారు. మార్నింగ్ షో చూసిన మీడియా నుంచి ఇన్ని కాల్స్ రావడం ఇదే ఫస్ట్ టైమ్. ఫ్యామిలీ ఆడియెన్స్ సినిమాకు వెళ్తున్నారు. షో బై షో కలెక్షన్స్ పెరుగుతున్నాయి. స్క్రీన్స్ యాడ్ అవుతున్నాయి. ఇప్పుడున్న కాంపిటేషన్‌లో ఇంతమంచి కలెక్షన్స్ రావడం మామూలు విషయం కాదు. పండక్కి మంచి ఎంటర్ టైన్ మెంట్ ఇవ్వాలి, చిన్న మెసేజ్ ఇవ్వాలి, ఒక వైబ్ మూవీలో ఉండాలని చేసిన ప్రయత్నమిది. సినిమా రిలీజ్ ముందు రోజు ప్రెస్ మీట్ పెట్టి కూడా ఇదే విషయాన్ని క్లియర్‌గా చెప్పాం. ‘కె ర్యాంప్’తో మంచి సక్సెస్ ఇచ్చిన అందరికీ థ్యాంక్స్. అన్నారు.

నిర్మాత రాజేశ్ దండ మాట్లాడుతూ మా ‘కె ర్యాంప్’ సినిమాను కేవలం నవ్వించడం కోసమే తీశామని మేము చెబుతూ వస్తున్నాం. ఇలాంటి సినిమాలో లాజిక్స్ వెతకకూడదు. మీడియా వాళ్లు మా సినిమాకు రేటింగ్స్ తక్కువగా ఇచ్చారు. అయితే నేనేం బాధపడటం లేదు. అది వాళ్ల వ్యక్తిగత అభిప్రాయం. కానీ కొందరు కావాలనే మా మూవీపై పక్షపాతం చూపిస్తున్నారు. ట్విట్టర్ రివ్యూస్‌లో ఫుల్ రివ్యూకు మధ్యలో గంటలు గంటలు గ్యాప్ ఇస్తారు. రేటింగ్ సాయంత్రం వరకు ఇస్తారు. కానీ మా సినిమాకు మాత్రం ఏం అన్నా పడతారు, చిన్న ప్రొడ్యూసర్ కదా అనుకున్నట్లు ఉన్నారు. కానీ ఈ దీపావళికి రిలీజైన మూవీస్‌లో ఏ సినిమా కలెక్షన్స్ ఎలా ఉన్నాయో చూసి నిజాలు తెలుసుకోవాలి. హైదరాబాద్‌లో చాలా థియేటర్స్‌లో షోస్ ఫుల్ అవుతున్నాయి. అలాగే వైజాగ్, ఈస్ట్‌లో మంచి కలెక్షన్స్ ఉన్నాయి. షో, షోకు కలెక్షన్స్ పెరుగుతున్నాయి. ఆ కలెక్షన్స్ అన్నీ నేనే చెప్పుకుంటే డప్పు కొట్టినట్లు ఉంటుంది. మా ‘కె ర్యాంప్’ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా టీమ్ అం హ్యాపీగా ఉన్నాం. అన్నారు.

డైరెక్టర్ జైన్స్ నాని మాట్లాడుతూ హీరో హీరోయిన్స్ క్యారెక్టర్స్‌ను హైలైట్‌గా పెట్టుకుని మేము ఫెస్టివల్‌కు ఎంజాయ్ చేసే మంచి ఫన్, ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్న మూవీ చేశాం. ఇందాక మా ప్రొడ్యూసర్ అన్నట్లు రివ్యూస్ లో వచ్చిన విశ్లేషణ చూసి నేనూ బాధపడ్డాను. ఒక కొత్త దర్శకుడిగా నిరాశచెందా. శ్రీరాములు థియేటర్‌లో సినిమా చూస్తుంటే ప్రేక్షకులు ఫస్టాఫ్‌ను బాగా ఎంజాయ్ చేశారు. సెకండాఫ్‌లో సెంటిమెంట్‌కు కనెక్ట్ అవుతున్నారు. ఫోన్స్ పక్కనపెట్టి సినిమా చూస్తున్నారు. ప్రేక్షకుల దగ్గర నుంచి మా సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌కు రివ్యూస్‌కు సంబంధం లేదు. మీడియా మిత్రులు కూడా చాలా మంది సినిమా చూస్తూ నవ్వుకున్నామని చెప్పారు. కిరణ్ గారు సినిమాను భుజాల మీద వేసుకుని మోశారు కాబట్టి ఈ రోజు ఇలాంటి మంచి రిజల్ట్ వచ్చింది. మీ అందరి సపోర్ట్ ఇలాగే ఉంటుందని కోరుకుంటున్నా. అన్నారు.

హీరోయిన్ యుక్తి తరేజా మాట్లాడుతూ మా మూవీపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు థ్యాంక్స్. నేను థియేటర్ కు వెళ్లి సినిమా చూశాను. మూవీ చూస్తున్న ఆడియెన్స్‌ను చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. సోషల్ మీడియా ద్వారా నాకు కంగ్రాట్స్ చెబుతూ మెసేజ్‌లు పంపుతున్నారు. ఇంతమంచి సక్సెస్ ఇచ్చి సపోర్ట్ చేస్తున్న అందరికీ థ్యాంక్స్. అన్నారు.

నటుడు వీకే నరేష్ మాట్లాడుతూ కె ర్యాంప్ మూవీకి మీరంతా సూపర్ హిట్ చేసినందుకు థ్యాంక్స్. ఇది కిరణ్ అబ్బవరం ర్యాంప్. నా క్యారెక్టర్ కు హిలేరియస్ రెస్పాన్స్ వస్తోంది. పక్కా ఫ్యామిలీ ఎంటర్ టైనర్ చిత్రమిది. మనం సొసైటీలో చూస్తున్న కొందరిని రిఫ్లెక్ట్ చేసేలా క్యారెక్టర్స్, డైలాగ్స్ ఉన్నాయి. ఇవన్నీ నవ్వించడం కోసం చేసిన ప్రయత్నమే. సామజవరగమన సినిమాను ఇదే ప్రొడక్షన్ లో చేశాను. ఇప్పుడు కె ర్యాంప్ మూవీలో నా క్యారెక్టర్ కు మంచి పేరు రావడం హ్యాపీగా ఉంది. దర్శకుడు జైన్స్ నాని కథ చెప్పినప్పుడే ఈ సినిమా హిట్ అని అన్నాను. అతను నెక్స్ట్ లెవెల్ డైరెక్టర్ అవుతాడని చెప్పాను. అన్నారు.



# ‘ఆర్యన్’ థ్రిల్లింగ్ ట్రైలర్ రిలీజ్

**విష్ణు విశాల్** మోస్ట్ ఎవైటెడ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ‘ఆర్యన్’, ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీజర్, ఫస్ట్ సింగిల్‌కి మంచి స్పందన వచ్చిన తర్వాత, ఇప్పుడు మేకర్స్ నెయిల్‌బైటింగ్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఒకప్పుడు కొడైకెనాల్ సీరియల్ కిల్లింగ్ కేస్‌ని సాల్వ్ చేసిన ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్, ఇప్పుడు టెర్రిఫిక్ సైకోపాత్‌ని పట్టుకునే మిషన్‌లోకి వస్తాడు. కిల్లర్ ప్రతి హత్యకు గంట ముందు పోలీసులను ఛాలెంజ్ చేస్తూ మర్డర్ చేసే వారి పేరు చెబుతుంటాడు. దీంతో నగరమంతా భయంతో వణుకుతుంది. ఈ క్రమంలో, ఆఫీసర్ తన అనుభవం, తెలివి, ఇన్‌స్టింక్ట్‌లతో హంతకుడి ఆటను ఛేదించే ప్రయత్నం చేస్తాడు. కిల్లర్‌ని ఎలా పట్టుకుంటాడు? అనేదే కథలో మెయిన్ ఎక్సయిటింగ్ ఎలిమెంట్. దర్శకుడు ప్రవీణ్ కె ఒక యూనిక్ కథను ఎంచుకుని, ఆఫీసర్-కిల్లర్ మధ్య జరిగే క్యాట్ అండ్ మోస్ గేమ్‌లా థ్రిల్లింగ్ స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను కట్టిపడేశాడు. విష్ణు విశాల్ తన పాత్రలో చాలా కమాండింగ్‌గా కనిపించాడు. ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా ఇంటెన్స్ యాక్టింగ్‌తో ఆకట్టుకున్నాడు. సెల్వరాఘవన్ చివర్లో ఎంట్రీ ఇస్తూ సస్పెన్స్ క్రియేట్ చేశాడు. అతని ప్రెజెన్స్ ఇంపాక్ట్ కలిగిస్తుంది. శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి హీరోయిన్స్‌గా కనిపించారు హరీష్ కన్నన్ కెమెరా వర్క్ సినిమాకి థ్రిల్లింగ్ టోన్ ఇచ్చింది, గిబ్రాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సీన్‌లలో టెన్షన్‌ని పీక్స్‌కి తీసుకెళ్లింది. ప్రొడక్షన్ వాల్యూస్ కూడా హై క్లాస్‌లో ఉన్నాయి. సాయి రోణక్, తరక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. ఎడిటర్ సాన్ లోకేశ్. ఆర్యన్ అక్టోబర్ 31న విడుదల కానుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఈ చిత్రాన్ని సుధాకర్ రెడ్డి (శ్రేష్ట మూవీస్) గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు.

# రేపు ‘ది బ్లాక్ గోల్డ్’ ఫస్ట్ లుక్ రిలీజ్



**టాలీవుడ్ లక్కీ చార్మ్** సంయుక్త ఫస్ట్ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ యోగేష్ కెఎంసి దర్శకత్వంలో చేస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన నిర్మాత రాజేష్ దండా నిర్మిస్తున్నారు. హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్‌తో కలిసి చేస్తున్న ఆరవ సినిమా ఇది. సంయుక్త స్వయంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు, ఇది కంటెంట్‌పై ఆమెకున్న నమ్మకాన్ని చూపిస్తుంది. సింధు మాగంటి సహ నిర్మాత. ఈరోజు, మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి ‘ది బ్లాక్ గోల్డ్’ అనే ఇంట్రస్టింగ్ టైటిల్ ఫిక్స్ చేశారు. టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ రేపు విడుదల కానుంది. దర్శకుడు యోగేష్ కెఎంసి థ్రిల్లర్ జానర్‌కి కొత్త కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ, ప్రేక్షకులకు థ్రిల్ చేయబోతున్నారు. సంయుక్త డైనమిక్ పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రంలో ఆమె అద్భుతమైన స్టంట్స్ చేస్తున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఎ వసంత్ కెమెరా మ్యాన్ కాగా, సామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నారు. సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్, చోటా కె ప్రసాద్ ఎడిటర్. రామ్ కృష్ణ యాక్షన్ డైరెక్టర్. యోగేష్ కెఎంసితో పాటు, కథ సంభాషణలను ప్రసాద్ నాయుడు రాశారు. దర్శకుడు స్వయంగా స్క్రీన్‌ప్లే రాశారు. మధు విప్పర్తి స్క్రిప్ట్ కోఆర్డినేటర్. ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది.

# లెజెండరీ సినిమాటోగ్రాఫర్ ఎంవి రఘు గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్

**లెజెండరీ సినిమాటోగ్రాఫర్,** డైరెక్టర్ ఎంవీ రఘు ఇండియన్ సినిమా పరిశ్రమలో 50 ఏళ్ల జర్నీ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సినీ ప్రస్థాన గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఈవెంట్ హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎంవీ రఘు చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. 1974లో కెరీర్ మొదలుపెట్టిన ఎంవీ రఘు, కళ్ల రఘుగా గుర్తింపు పొందారు. ఆయన సినిమాటోగ్రాఫర్‌గా స్వాతిముత్యం, సిరివెన్నెల, సితార, అన్వేషణ వంటి చిత్రాలు ఆల్ టైమ్ క్లాసిక్స్‌గా పేరు తెచ్చుకున్నాయి. ఎంవీ రఘు రూపొందించిన కళ్లు సినిమా ఆయనకు ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా ఫిలింఫేర్ అవార్డ్‌తో పాటు నాలుగు నంది అవార్డ్స్ తీసుకొచ్చింది. ఎంవీ రఘు గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ సినీ పరిశ్రమలో ఎంవీ రఘు గోల్డెన్ జూబ్లీ జరుపుకోవడం సంతోషకరం. ఆయన ఎందరో గొప్ప దర్శకులతో, టెక్నీషియన్స్‌తో కలిసి పనిచేశారు. రఘు టెక్నీషియన్‌గా ఇప్పటికీ అదే స్పిరిట్‌తో పనిచేస్తుండటం ఆనందంగా ఉంది. ఈ రోజు ఈ ఈవెంట్‌కు కేవలం రఘు మీద అభిమానంతోనే వచ్చాను. అన్నారు.

నటుడు సుమన్ మాట్లాడుతూ నేను సితార సినిమాలో హీరోగా సెలెక్ట్ కావడానికి ఒక కారణం రఘుగారు. సితార సినిమాకు పని చేసిన ముగ్గురు గ్రేట్ టెక్నీషియన్స్ వంశీ, ఇళయరాజా, ఎంవీ రఘు. ఆయన ఫిలిం ఇండస్ట్రీకి చేసిన కాంట్రిబ్యూషన్ అద్భుతం. ఎంవీ రఘు గారితో అమెరికా అల్లుడు అనే మూవీ చేశాను. ఆ సినిమా చిత్రీకరణ టైమ్‌లో నాకు సినిమాటోగ్రఫీ కూడా నేర్పించారు. ఇతర పనుల్లో బిజీగా ఉన్నా మేమంతా రఘు గారి మీద అభిమానంతో ఆయనను అభినందించాలని ఇక్కడికి వచ్చాం. అన్నారు.




నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ ఎంవీ రఘు విజయ బాపినీడు, విశ్వనాథ్‌గారువంటి ఎంతోమంది గొప్ప దర్శకులతో పనిచేశాడు. ఆయన తొలినాళ్లలో ఎంత వినయంగా ఉన్నారో, ఇప్పటికీ అలాగే ఉన్నారు. సినిమాటోగ్రఫీలో తనకున్న అనుభవాన్ని ఫిలిం ఇనిస్టిట్యూట్‌ద్వారా ఇప్పటి తరానికి నేర్పుతుండటం అభినందనీయం. చిత్ర పరిశ్రమకు ఎన్నో అవార్డ్స్ సాధించిన టెక్నీషియన్ రఘుకు ఈ సందర్భంగా నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. అన్నారు.

సినిమాటోగ్రాఫర్ ఛోటా కె నాయుడు మాట్లాడుతూ సినిమాటోగ్రఫీలో నా గురువులు వీఎస్ఆర్ స్వామి, గోపాల్ రెడ్డి, ఎంవీ రఘు గారు. అన్వేషణ సినిమా థియేటర్‌లో చూసి బయటకు వచ్చిన ప్రేక్షకులు కెమెరా పనితనం గురించి మాట్లాడుతుండటం చూసి ఆశ్చర్యపోయాను. నేను సినిమాటోగ్రాఫర్ అయితే నా గురించి ఇలా ప్రేక్షకులు మాట్లాడుకుంటారా అనుకున్నాను. ఎంవీ రఘుగారు 50 ఏళ్ల జర్నీ పూర్తి చేసుకోవడం సంతోషకరం. ఆయన దగ్గర శిష్యరికం పొందుతున్న వారంతా అదృష్టవంతులు. అన్నారు.

నటుడు ఉత్తేజ్ మాట్లాడుతూ ఎంవీ రఘు గారు గ్రేట్ టెక్నీషియన్. ఆయన సిరివెన్నెల, ఆలాపన వంటి ఎన్నో గొప్ప చిత్రాలను తన కెమెరా కన్నుతో చూపించారు. తెరపై ఎంత గొప్ప నటుడిని చూపించాలన్నా అది సినిమాటోగ్రాఫర్ వల్లే సాధ్యం. ఎంవీ రఘు గారు ఇప్పటికీ ఎంతోమంది పిల్లలకు సినిమాటోగ్రఫీలో శిక్షణ ఇస్తున్నారు. గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటున్న సందర్భంగా ఎంవీ రఘు గారికి నా విశెస్ అందిస్తున్నా. అన్నారు.

నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ ఇవాళ ఇండస్ట్రీలో పేరు తెచ్చుకున్న ఎంతోమంది నటీనటులకు గురువు ఎంవీ రఘు గారు. నా గురువు ఆయనే. కళ్లు సినిమాతో నాకు గుర్తింపు ఇచ్చారు. ఆ తర్వాత వందల సినిమాల్లో నటించగలిగాను. రఘు గారు ఇలాగే మరెంతో కాలం పనిచేస్తూ ఎంతోమంది శిష్యులకు శిక్షణ ఇవ్వాలని కోరుకుంటున్నా. అన్నారు.

లెజెండరీ సినిమాటోగ్రాఫర్ ఎంవీ రఘు మాట్లాడుతూ నా 50 ఏళ్ల కెరీర్‌లో ఎంతోమంది గొప్పగొప్ప నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి పనిచేసే అదృష్టం దక్కింది. లవకుశ సినిమాటోగ్రాఫర్ పీఎల్ రాయ్, మాయాబజార్ రూపొందించిన మార్కస్ బార్ ట్లే గార్లతో వర్క్ చేశాను. నాగురువు వీఎస్ఆర్ స్వామి గారితో ఆ తర్వాత గోపాల్‌రెడ్డి గారితో పనిచేశాను. ఎన్టీఆర్, ఏఎన్నార్ సహా ఎంతోమంది దిగ్గజాలతో పనిచేసే అదృష్టం దక్కింది. వీళ్లతో పాటు ఈ వేదిక మీద ఉన్న వాళ్లంతా నా ప్రయాణానికి కారణం. నేను పని రాక్షసుడిని. ఏదైనా సరిగ్గా రాకుంటే రాజీ పడను. విశ్వనాథ్ గారితో రెండు చిత్రాలు స్వాతిముత్యం, సిరివెన్నెలకు పనిచేశాను. రెండేళ్ల కిందట ఆస్కార్ కమిటీలో మెంబర్‌ను. మా ఇనిస్టిట్యూట్ ఉదయ్ కిరణ్‌గారి వల్లే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. ఎంతోమంది ఈతరం పిల్లలకు సినిమాటోగ్రఫీలో శిక్షణ ఇస్తుండటం సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ వంశీ వస్తే బాగుండేది. సినిమాటోగ్రాఫర్‌గా నేను ఏదైనా సాధించాను అంటే అందులో వంశీ పాత్ర కీలకం అన్నారు.

# డిసెంబరు 25న ‘పతంగ్’ విడుదల

**ఇప్పటి వరకు ఎన్నో** స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి వుంటారు. కాని అందరిలో ఎంతో మమేకమైన పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ‘పతంగ్’. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాను ఆడియన్స్‌కు ఓ మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇవ్వడానికి హెవీ సీజీ వర్క్‌ను గత కొంత కాలం నుంచి ఎంతో క్వాలిటీతో ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో చేయిస్తున్నారు నిర్మాతలు. ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదల చేసిన పాటలకు చిత్ర టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం విడుదల తేదిని ప్రకటించారు మేకర్స్. డిసెంబరు 25న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ‘ఈ సినిమా థియేటర్‌లో యూత్‌ఫెస్టివల్‌లా వుంటుంది. కొత్తవాళ్లతో చేసిన మా సినిమా కొత్తగా వుండటంతో పాటు చాలా పెద్ద సినిమా క్వాలిటీతో వుంటుంది అన్నారు. ఎంతో కలర్‌ఫుల్‌గా ఉండే ఈ సినిమాకు కథే హీరో. ఈ చిత్రానికి జోస్ జిమ్మి అద్భుతమైన పాటలు ఇచ్చాడు. పాట వింటూంటే అందరిలో పాజిటివ్ వైబ్స్ కలుగుతాయి. సినిమా చూస్తున్నంత సేపు ఆ పంతగుల పోటీ మీలో ఉత్సుకతను కలిగిస్తుంది. తప్పకుండా మా పతంగ్ చిత్రం అన్నివర్గాల వారిని అలరిస్తుందనే నమ్మకం వుంది. కొత్త కంటెంట్‌ను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం వుంది. డిసెంబరు 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం’ అని తెలిపారు.



## డిసెంబర్ 25న ‘యుఫోరియా’ గ్రాండ్ రిలీజ్



**గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్** బ్యానర్‌పై శ్రీమతి రాగిణి గుణ సమర్పణలో.. నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మాణంలో బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం ‘యుఫోరియా’. నూతన నటీనటులతో గుణశేఖర్ నేటి యూత్‌కి, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యేలా వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో భూమిక చావ్లా, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచిలి, అడ్డాల పృధ్వీరాజ్, కల్ప లత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాష్, నవీనా రెడ్డి, లికిత్ నాయుడు వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటికే సినిమా నుంచి విడుదలైన గ్లింప్స్, ఫ్లై హై పాటకు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది.

దీపావళి పండుగ సందర్భంగా ‘యుఫోరియా’ చిత్రాన్ని డిసెంబర్ 25న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా పోస్టర్ ద్వారా తెలియజేశారు. పోస్టర్‌ను గమనిస్తే భూమిక స్మైలీ లుక్‌లో కనిపిస్తోంది. మరో చోట ఓ పిల్లాడుతో సరదాగా నవ్వుకుంటోంది. 20 ఏళ్ల క్రితం గుణ శేఖర్, భూమిక సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ ఒక్కడు మూవీలో కలిసి పని చేసిన సంగతి తెలిసిందే. యుఫోరియా కోసం మరోసారి ఈ బ్లాక్ బస్టర్ కాంబో చేతులు కలిపింది. భూమికను దృష్టిలో ఉంచుకుని గుణశేఖర్ ఓ పవర్‌ఫుల్ రోల్‌ను క్రియేట్ చేశారు. అన్నీ వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా సినిమా ఉంటూనే చక్కటి మెసేజ్ కూడా యుఫోరియా సినిమాలో ఉంటుంది. కాల భైరవ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రానికి ప్రవీణ్ కె పోతన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

# ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ షూటింగ్ ప్రారంభం..



**షోయింగ్ బిజినెస్** బ్యానర్‌పై ‘ప్రేమలు’ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేసి భారీ విజయాన్ని సాధించి అభిరుచి గల నిర్మాతగా ఎస్ఎస్ కార్తికేయ మంచి పేరు సంపాదించుకున్నారు. భారతదేశం గర్వించదగ్గ చిత్రమైన ‘బాహుబలి’ ఫ్రాంచైజీని నిర్మించిన అర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ సంస్థలు కలిసి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ తో నిర్మాణంలోకి వస్తున్నట్లు ప్రకటించారు. విలక్షణ నటుడు ఫాహద్ ఫాజిల్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ అనే థ్రిల్లింగ్ ఫాంటసీ ఎంటర్‌టైనర్ మూవీతో నూతన దర్శకుడు శశాంక్ యేలేటి తెరపై తన సత్తాను చాటుకోబోతున్నారు. ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్ శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని ఈ క్రేజీ ప్రాజెక్ట్, కంటెంట్‌తో కూడిన చిత్రాన్ని నిర్మించడానికి ఎస్ఎస్ కార్తికేయతో చేతులు కలిపారు. ఆదివారం (అక్టోబర్ 19) ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈరోజు ఫాహద్ ఫాజిల్ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఫాహద్ ఫాజిల్, దర్శకుడు శశాంక్, నిర్మాత ఎస్ఎస్ కార్తికేయ సెట్ లో ఉన్న స్టిల్స్ షేర్ చేసి ఈ సినిమాకి సంబంధించిన ప్రకటనను చేశారు. ఈ ఫస్ట్ షెడ్యూల్ నవంబర్ 8 వరకు కొనసాగుతుందని, ఇందులోని ప్రధాన సన్నివేశాలను చిత్రీకరించనున్నామనీ మేకర్స్ తెలిపారు. ఈ మూవీని 2026 ద్వితీయార్థంలో గ్రాండ్ రిలీజ్ చేయడానికి టీమ్ ప్లాన్ చేస్తోంది. ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ నుంచి గతంలో రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రానికి కాల భైరవ సంగీతం అందిస్తున్నారు.



# నవంబర్ 7న విడుదల కానున్న ‘ప్రేమిస్తున్నా’

**వరలక్ష్మీ పప్పుల** ప్రజెన్స్‌లో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో సరికొత్త ప్రేమకథతో రాబోతున్న సినిమా ప్రేమిస్తున్నా. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లుగా నటించారు. పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ప్రేమిస్తున్నా సినిమా నవంబర్ 7న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీరు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ‘ప్రేమిస్తున్నా’ చిత్రం నుండి సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నాను మేకర్స్ విడుదల చేశారు. 56 సెకెన్స్ నిడివి ఉన్న కంటెంట్ యువతను విపరీతంగా ఆకట్టుకొంటోంది. ఇంటెన్స్ లవ్ స్టోరీగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. స్వచ్ఛమైన ప్రేమకథతో రాబోతున్న ఈ సినిమాలో సాత్విక్ వర్మ, ప్రీతి నేహా పోటీపడి నటించారు. దర్శకుడు భాను ప్రేమిస్తున్నా సినిమాను న్యూ ఏజెడ్ లవ్ స్టోరీగా ఆడియన్స్ కు చూపించబోతున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది, యూట్యూబ్‌లో మిలియన్ వ్యూస్‌తో ప్రేక్షకాధారణ పొందింది. ఈ సందర్భంగా దర్శకుడు భాను మాట్లాడుతూ.. “అన్ కండీషనల్ లవ్ తో తెరకెక్కిన సినిమా ప్రేమిస్తున్నా. ఇప్పటివరకు తెలుగులో అంత అన్ కండీషనల్ లవ్‌తో ఏ సినిమా రాలేదు, అద్భుతమైన పాటలు, పర్ఫార్మెన్స్ తో ఈ చిత్రం నవంబర్ 7న థియేటర్స్ లో విడుదల కానుంది. చాలా కాలం తరువాత వస్తోన్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఈ సినిమా, మేము విడుదల చేసిన సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నాకు అన్ని వర్గాల ఆడియన్స్ నుండి సూపర్బ్ రెస్పాన్స్ లభిస్తోందని“ అన్నారు. ఇదొక మ్యూజికల్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



దీపం జ్యోతి పరబ్రహ్మ, దీపం జ్యోతి జనార్థన ! దీపో హరతుమే పాపం, దీపం జ్యోతి నమోస్తుతే !!

ఆశ్వీయుజ శుక్ల త్రయోదశి మొదలు దీపావళి ఉత్సవం ప్రారంభం అవుతుంది. నరకాసుర వధానంతరం సత్యభామ సాధించిన విజయానికి లోకంలో చీకట్లు పోయి వెలుగులు ప్రారంభం కాబడ్డాయి. అజ్ఞానాంధకారంలో మునిగిన ప్రపంచాన్ని వెలుగులతో నింపే సాంప్రదాయమే దీపావళి ఉత్సవం లేదా పండుగగా మనం జరుపుకుంటున్నాము. వళీ అనగా వరుస క్రమం, దీపావళి అనగా దీపముల వరుస.

# జిలుగు వెలుగుల దివ్వెల దీపావళి

పండుగ అంటే ఆనందం, సంబరం. పండుగ అంటే ఆనందం, ఉత్సాహం. పండుగ అంటే సంస్కృతి, సంప్రదాయం, ఘన వారసత్వం. అలాంటి అన్ని అంశాల సమాహారమే నేటి దీపావళి పర్వదినం. ప్రతి పండుగ ఆనందార్ణవమే, ఆనందమే రూపు దాలిస్తే అది దీపావళి పర్వదినం అవుతుంది. ఎప్పటికప్పుడు జీవితం అనే అలుపెరుగని ప్రయాణానికి ఇందనంగా తోడ్పడుతూ మనల్ని నవ్య ఉషస్సుల వైపు నడిపించడానికి మన పండుగలు దోహదపడుతున్నాయి. ఆ పరంపరలోని జిలుగు వెలుగుల పర్వం దీపావళి. మన పండుగలలో ఎంతో సందడి నింపిన పండుగ దీపావళి. దీపావళి పర్వదినం నేపథ్యంగా ఎన్నో ఆచారాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ఆ సంప్రదాయాలు, సంస్కృతులు ఎన్నో సామాజిక, జీవన ఉపయుక్త కరమైన సందేశాలను అందిస్తాయి.



మన భారతీయ సంస్కృతికి, దీపావళికి ఉన్న సంబంధం గురించి తెలుసుకుందాం. భారతీయ సంస్కృతి విధానంలోనైనా, జీవన విధానంలోనైనా వేడుక, వినోదాలు తర్వాత లోతైనటువంటి ఆధ్యాత్మికత తరువాత సామాజిక పరమైనటువంటి ఏకత్వం ఈ మూడు కూడా ప్రతి పండుగలోనూ మనకి కనిపిస్తాయి. అలాగే దీపావళిలోను మనకి కనిపిస్తాయి. పండుగ వచ్చింది అంటే పిండి వంటలు చేసుకుని మనమే తినం, బంధుమిత్రులను పిలుస్తాం, అందర్నీ కలుస్తాం. ఇలా సామాజికపరమైనటువంటి ఏకత్వానికి దీపావళి పండుగ దోహదం చేస్తుంది. రెండవది వేడుకలు, వినోదం. ప్రతి పండుగకి ఏదో ఒక వేడుక, వినోదం అందులో ఉంటాయి. పిండి వంటలు చేసుకుంటాం, చక్కగా తింటాం. అలాగే వినోదంగా టపాకాయలు కాల్చుకుంటాం. ఇలా చేస్తే పర్యావరణం శుభ్రం అయిపోతుంది. ఆపై వేడుకలు, వినోదాలు, విందులు అందరితో కలిసి ఉండటం. దీని తర్వాత ఆధ్యాత్మిక చింతనతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తాం. దీపావళి పండుగలో అత్యంత ముఖ్యమైన నరకాసురుడి చరిత్రను హిందూ పురాణల ఆధారంగా తెలుసుకుందాం. పూర్వం హిరణ్యకక్షుడనే రాక్షసుడు ఉండేవాడు. అతను రాక్షసులకు రాజులా ఉండేవాడు. పుట్టుకతోనే మహాబలశాలి. అతను బ్రహ్మదేవుని కోసం ఘోర తపస్సు చేసి ఒక శక్తివంతమైన వరం పొందాడు. దేవతలు, దానవులు, యక్షులు, మనుషులు, మరియు క్రూర మృగాలైన సింహం, పులి వంటి జంతువుల చేతిలో తనకు మరణం లేకుండా వరం కోరుకున్నాడు. అయితే గర్వంతో ఒక పంది అంటే వరాహం వంటి అల్ప జంతువు తనని ఏమి చేయగలదని భావించి దాని పేరును తన జాబితాలో చేర్చడం మర్చి పోయాడు. హిరణ్యాక్షుడు ఆ గర్వంతోనే దేవతలను ఓడించి స్వర్గాన్ని ఆక్రమించాడు. ఇలా అతని అరాచకాలకు హద్దు లేకుండా పోయింది. ఇలా అతను అహంకారంతో సహనానికి, ఓర్పుకి ప్రతీక అయిన భూదేవిని, భూలోకాన్ని తీసుకువెళ్లి పాలసముద్రంలో దాచేస్తాడు. దాంతో భూదేవి "రాక్షసుడి భారీ నుండి నన్ను కాపాడండి" అని మహావిష్ణువుని ప్రార్థిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న విష్ణు ప్రత్యేక అవతారం ఎత్తాలని నిర్ణయించుకున్నాడు. హిరణ్యాక్షుడు తను వరం కోరుకునేటప్పుడు మర్చిపోయిన వరాహరూపాన్ని ధరించాడు. ఆ రూపంతో పాలసముద్రంలోకి దూకి వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసి హత మారుస్తాడు. ఆపై పాలసముద్రంలోకి దూకి భూదేవిని కనిపెట్టి భూలోకాన్ని తన దంతాల మీద పెట్టుకొని ముందు భూదేవి ఎక్కడ ఏ స్థానంలో ఉందో అక్కడ పెట్టేస్తాడు. ఆ సమయంలో శ్రీమహావిష్ణువు యొక్క దివ్యమైన వరాహావతారం స్పర్శకు భూదేవి పులకరించి పోయింది. ఆ సందర్భంలో భూదేవికి నరకాసురుడనే రాక్షసుడు జన్మిస్తాడు. అయినా భూదేవి ప్రేమగా పెంచుతుంది. ఆ ప్రేమతో విష్ణువును వేడుకుంటుంది. మీరు రాక్షసులను సంహరిస్తారు కదా మన కొడుకుని మాత్రం ఎప్పటికీ చంపకూడదని వరం కోరుకుంటుంది. నేను మాత్రం ఎప్పటికీ చంపను. కానీ మన కొడుకు చావు మాత్రం ఒక స్త్రీ చేతిలో ఉంది అంటాడు. అది విని భూదేవి సంతోషిస్తుంది తండ్రి చేతిలో చావు లేనందుకు. నరకాసురుడు పెరిగి పెద్దయ్యేకొద్దీ రాక్షస క్రీడలు ఎక్కువ అవుతాయి. దాంతో సత్యభామ చేతిలో నరకాసురుడు హతమవుతాడు. కన్నయ్య తన భార్య సత్యభామ సహాయంతో రాక్షస రాజైన నరకాసురుణ్ణి సంహరించాడు. నరకాసురుడు ఒక మహిళ చేతిలో మరణించాలని శాపానికి గురయ్యాడు. అందుకే సత్యభామ చేతిలో మరణించాడు. ఈ పవిత్రమైన రోజే ఆశ్వీజ మాసంలోని కృష్ణపక్షం చతుర్దశి తిథి. నరకాసురుడి హింస, బీభత్సం, దౌర్జన్యం నుంచి విముక్తి పొందిన ప్రజలు ఆనందంతో దీపావళి పండుగను జరుపుకుంటారు.



దీపావళి అంటే అభ్యంగన స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి పిండివంటలు ఆరగించి, జ్యోతిర్మయమై ప్రకాశిస్తే అదే దీప కాంతులతో కూడిన సరికొత్త దీపావళి. ఈ రోజు విజయానికి గుర్తుగా అమావాస్య చీకట్లను పారద్రోలుతూ అందరూ తలస్నానం చేసే కొత్త బట్టలు ధరిస్తారు. మామిడితోరణాలతో గుమ్మాలను అలంకరస్తారు. రంగవల్లులు తీరినచద్దుతారు. తీపి పిండి వంట తింటారు. లక్ష్మీదేవి పూజ చేస్తారు. వ్యాపారస్తులందరూ సాయంత్రం పూట లక్ష్మీ పూజ చేసి ఎకౌంటు బుక్స్ కూడా అమ్మవారి ముందు పెట్టి పూజ చేస్తారు. ఇది అన్ని పండుగల్లోకి చాలా ఆకర్షణ ఏమైనటువంటి పండుగ. ఈ దీపావళిని జరుపుకునేటప్పుడు దీపాలు వెలిగిస్తాం. "తమ సోమా జ్యోతిర్గమయా" అనేది వేదవాక్కు. చీకటిలో నుంచి నన్ను వెలుగులోకి నడిపించు అనే ప్రగతిశీల దృక్పథాన్ని వేదవాక్కు ప్రతిఫలిస్తుంది. చీకటి నుంచి వెలుగుల్ని విరజిమ్మే పండుగ దీపావళి. చెడుపై మంచిని సాధించిన గుర్తుకు ఘన విజయ గాథ దీప కాంతుల పండుగ దీపావళి. వెలుగులు ప్రవాహంగా నవ్య కాంతుల్ని దీపాలు ఎన్నో ఆధ్యాత్మిక, పారమార్థిక, సామాజిక సందేశాల సమాహారమే ఈ దీపావళి. దీపాలు వెలిగించేటప్పుడు ఈ క్రింది శ్లోకం చదివి దీపాలు వెలిగిస్తారు. "దీపం జ్యోతి పరబ్రహ్మం దీపం/ సర్వతమోపహారం/ దీపేన సాధ్యతే సర్వం/ దీప లక్ష్మీ మ్ నమోస్తుతే"! అంటూ దీపాలు వెలిగించి టపాసులు కాలుస్తూ పిల్లలు పెద్దలు అందరూ ఆనందోత్సాహాలతో, కేరింతలతో దీపావళి పండగకు సరికొత్త శోభ తేవాలని కోరుకుంటూ... అందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు.

**- పింగళి భాగ్యలక్ష్మి**

# నరకాసురుని వధ



దీపావళి అనగానే నరకాసుర వధ, సత్యభామ కథలు మనసులో మెదులు తాయి. శ్రీకృష్ణునితో కలిసి ఆమె ప్రదర్శించిన శౌర్యప్రతాపాలు స్ఫురిస్తాయి. సత్య ద్వాపరయుగంలోని పాత్రే అయినా ఆధునిక వనితల స్వభావాలన్నీ ఆమెలో కనిపిస్తాయి. కంప్యూటర్ కాలంలోని వనితల మనోభావాలకు సమీపంగా తోస్తాయి. నరక చతుర్దశి సందర్భంగా సత్యభామ శక్తిసామర్థ్యాలను సుగుణ స్వభావాలను తరచిచూద్దాం. సత్యభామ తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలనే తత్త్వం ఆమెది అందుకే మిగతా యువతుల కంటే భిన్నంగా సంగీత, నృత్య కళలతోపాటు యుద్ధ నైపుణ్యాన్నీ సంపాదించింది. నేటితరం మగువలు ఆమెను చూసి అలవరచుకోవాల్సిన మంచి లక్షణమిది. అందం, అనురాగం, సకల కళానైపుణ్యం, రాజనీతిజ్ఞత, వీరత్వం సమపాళ్లలో కలిసిన స్త్రీమూర్తి సత్య. మన వ్యక్తిత్వం గొప్పదైనప్పుడే మన మాటకు విలువ ఇస్తారన్న సత్యానికి నిదర్శనం. సాక్షాత్తూ శ్రీకృష్ణుడినే 'మీర జాలగలడా నాయానతి సత్యాపతి' అని ధీమాగా అనగలిగింది. సత్యభామ కథలు మనసులో మెదులుతాయి. శ్రీకృష్ణునితో కలిసి ఆమె ప్రదర్శించిన శౌర్యప్రతాపాలు స్ఫురిస్తాయి. సత్య ద్వాపరయుగంలోని పాత్రే అయినా ఆధునిక వనితల స్వభావాలన్నీ ఆమెలో కనిపిస్తాయి. కంప్యూటర్ కాలంలోని వనితల మనోభావాలకు సమీపంగా తోస్తాయి. నరక చతుర్దశి సందర్భంగా సత్యభామ శక్తిసామర్థ్యాలను సుగుణ స్వభావాలను తరచిచూద్దాం. ఆశ్వయుజ బహుళ చతుర్దశి నరక చతుర్దశిగా ప్రసిద్ధి పొందింది. నరకాసురుడునే రాక్షసుడు చెలరేగి సాధు జనాలను పీడిస్తూ దేవ, మర్త్య లోకాలలో సంక్షోభాన్ని కలిగిస్తుంటాడు. కృతయుగంలో హిరణ్యాక్షుని వధించిన వరాహస్వామికి, భూదేవికి అసుర సంధ్యా సమయంలో జన్మిస్తాడు నరకడు. అతడు లోక కంటకుడైనా మహావిష్ణువు వధించరాదని, తల్లియైన తన చేతిలోనే మరణించేలా వరం పొందుతుంది భూదేవి. మహావిష్ణువు ద్వాపర యుగంలో శ్రీ కృష్ణ భగవానునిగా అవతరించినప్పుడు భూదేవి సత్యభామగా జన్మిస్తుంది. అప్పటికి నరకాసుడు లోక కంటకుడై చేస్తున్న ఆధర్మకృత్యాలను అరికట్టడానికి సత్యభామా సమేతంగా తరలివెళ్లాడు శ్రీకృష్ణుడు. వారి మధ్య జరిగిన భీకర సంగ్రామంలో భూదేవి అంశ అయిన సత్యభామ శరాఘాతాలకు మరణిస్తాడు నరకుడు. తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరక చతుర్దశిగా పిలువడుతుందని వరం ప్రసాదిస్తాడు శ్రీకృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు. పదహారువేలమంది రాజకన్యలు విడిపించబడ్డాయి. ధర్మం సుప్రతిష్ఠమైంది. నరకాసుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరు సటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకునే రోజు అమావాస్య కావడంతో, చీకటిని పారద్రోలుతూ ప్రజల దీపాలతో తోరణాలు వెలిగించి, బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది.

## దీపావళి నేర్పిస్తుంది..



ఇక్కడ
కుళ్ళుతో కాలే మతాబులు
ఇక్కడ
ఈర్ష్యతో పేలే టపాసులు
ఇక్కడ
కక్షతో రగిలే కాకరొత్తులు
పేలుతూనే ఉంటాయి
ఇక్కడ
మాటల తూటాలు
చమత్కార చమక్కులు
ఇంద్రజాల జిమ్మిక్కులు
జరుగుతూనే ఉంటాయి
దీపావళి సందర్భంలేకుండా
దీనత్వం తెల్లబోతుంటే
మంచితనమెసపోతుంటే
మానవత్వం మసకబారుతుంది
అలంకారంముందు
ఆకారం తెల్లబోతుంది
ఆహారం ముందు
దీపాల సమాహారం చినబోతుంది
కానీ
దీపావళి నేర్పిస్తుంది
అందరికి వెలుగునివ్వమని
కష్టంలో చేయందిచమని

**- బాలాజీ దీక్షితులు పి.వి.**

# రంగుల్లో రెజిన్ దీపాలు..





వత్తులు వెలిగించడంతోనే సరిపెట్టుకోవడం లేదు ఈతరం. ఇంటిని వైవిధ్యంగానూ అలంకరించాలనుకుంటున్నారు. అలాగని ఏ ఎల్ఇడి సీరియల్ లైట్‌తోనో నింపేత్తే పోలా అనీ అనుకోవడం లేదు. తమ సృజననూ జోడించాలనుకుంటున్నారు. అందుకోసం వచ్చేశాయి రెజిన్ దియాస్. క్యాండిల్ టీహోల్డర్ తరహాలో కనిపించే వీటిని ఎక్కడైనా పెట్టుకోవచ్చు. రంగవల్లులనూ, ఉర్లీలనూ, మైమరిపించేలా పూలనూ, చక్కటి ఛాయలను పులుముకుని పారదర్శకంగా కనినిండు చేస్తున్నాయివి. దీపకాంతులకు తళుక్కున మెరుస్తూ వర్ణ సౌరభాలను వెదజల్లుతున్నాయి. వివిధ ఆకృతుల్లోనూ ఆకట్టుకుంటున్నాయి. మరి ఇంకెందుకాలస్యం నచ్చినవి









# మోతీచూర్ లడ్డూ..



కావాల్సినవి : శనగపిండి, చక్కెర-రెండు కప్పుల చొప్పున, ఆరెంజ్ ఫుడ్ కలర్-పావు చెంచా, ఇలాచీ పొడి-చెంచా, నెయ్యి-పెద్ద చెంచా, బాదం, కాజు తరుగు-చెంచా చొప్పున, నూనె- సరిపడా, ఉప్పు-చిటికెడు.

తయారీ : గిన్నెలో శనగపిండి, ఉప్పు, ఫుడ్ కలర్ వేసి తగినన్ని నీళ్ల పోసి బజ్జీ పిండిలా కలిపి పక్కన పెట్టుకోవాలి. మరో గిన్నెలో పంచదార వేసి, నీళ్ల పోసి చిన్న మంటపై తీగపాకం వచ్చేలా కలుపుతూ ఉండాలి. మరో పొయ్యి మీద కడాయి పెట్టి నూనె వేడి చేయాలి. ఇప్పుడు చిల్లుల గరిటెలో పిండి పోసి నూనెలో బూందీలా వేస్తూ మంటను మధ్యస్థంగా పెట్టి చక్కగా వేయించాలి. ఇలా తయారుచేసి పెట్టుకున్న బూందీలా మిశ్రమాన్ని వెడల్పాంటి గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో ఇలాచీ పొడి, సన్నగా తరిగిన కాజు, బాదం పలుకులను వేసుకోవాలి. నెయ్యినీ జత చేయాలి. ఇప్పుడు వేడి వేడి పంచాదార పాకాన్ని పోసి వేడి తగ్గకముందే చక్కగా కలిపి చేతులతో లడ్డూల్లా చేసుకోవాలి. అంతే తియ్యటి నోరూరించే మోతీచూర్ లడ్డూలు సిద్ధం.

# కుటుంబ శ్రేయస్సు కోసం..

భర్త, కుటుంబ క్షేమాన్ని కోరుతూ మహిళలు ఎన్నో వ్రతాలు, పూజలు చేస్తారు. కర్వాచౌత్ కూడా అలాంటిదే! ఉత్తరాదిన ఎక్కువగా జరుపుకునే ఈ పండగను ఇప్పుడు దక్షిణాదిన కూడా కొందరు జరుపు కుంటున్నారు. రోజంతా ఉపవాసం చేసి.. సాయంత్రం జల్లెడలో చంద్రుడిని చూసి.. ఆపై భర్త ముఖాన్ని చూసి దీక్ష విరమిస్తారు. ఇటు ఆనందాన్ని, అటు ఆధ్యాత్మికతను పంచే ఈ పండగ.. అలుమగల మధ్య అనుబంధాన్ని దృఢపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం..!

ఆ నిబద్ధతే జీవితాంతం..!కర్వాచౌత్ పండగలో భాగంగా మహిళలు తమ భర్త క్షేమాన్ని, కుటుంబ శ్రేయస్సును కాంక్షించి రోజంతా ఉపవాస దీక్ష చేస్తున్నారు. ఇక భార్యలు తమ కోసం అంత చేస్తున్నప్పుడు.. వారికోసం మేమూ ఉపవాసం ఉంటామంటూ ఈ రోజుల్లో చాలామంది భర్తలు కూడా ఆ రోజు ఉపవాసం చేయడం చూస్తున్నాం. ఇక సాయంత్రం వెన్నెల వెలుగుల్లో ఇద్దరూ జల్లెడలో ఒకరినొకరు చూసుకొని.. ఒకరి చేతుల మీదుగా మరొకరు ఉపవాస దీక్ష విరమిస్తున్నారు. నిజానికి ఇలా ఈ రోజు ఒకరి కోసం మరొకరు పడే ఆరాటం ఆలుమగలిద్దరి మధ్య ప్రేమను, అనుబంధాన్ని పెంచుతుందని నిపుణులుభావిస్తున్నారు. అలాగని ఈ ఒక్కరోజుతోనే వదిలేయకుండా.. ప్రతి విషయంలోనూ ఈ నిబద్ధతను దంపతులిద్దరూ జీవితాంతం కొన సాగిస్తే అనుబంధాన్ని నిత్య నూతనం చేసుకోవచ్చంటున్నారు..

వృత్తి ఉద్యోగ బాధ్యతలను భార్యాభర్తలిద్దరూ సమానంగా పంచుకుంటోన్న ఈ రోజుల్లో ఇంటి పనులు కలిసే సర్వసాధారణమై పోయింది. ముఖ్యంగా పండగలు, ప్రత్యేక సందర్భాలలో ఒకరికి ఇష్టమైన వంటకాలను మరొకరు తయారు చేసి సర్ప్రైజ్ చేయడం పరిపాటిగా మారిపోయింది. కర్వాచౌత్ కూడా దంపతులకు అలాంటి అవకాశం ఉంది. ఈ రోజున ఉపవాస దీక్ష విరమణ కోసం.. తయారు చేసుకునే ప్రత్యేక వంటకాల్లో మీ పాకశాస్త్ర నైపుణ్యాలను ప్రదర్శిస్తుంది.. వంటకాలు సిద్ధమయ్యాక.. జల్లెడలో చంద్రుని చూసి.. ఒకరి ముఖం మరొకరు చూసుకున్నాక.. ఆ వెన్నెల వెలుగుల్లోనే క్యాండిల్ లైట్ డిన్నర్ ఏర్పాటు చేసుకుంటే. ఇష్టంగా తయారుచేసిన వంటకాలను ఒకరికొకరు ప్రేమగాతిని పించు కుంటే..? భలే ఉంది కదా.. ఈ ఐడియా! ఆలస్యమెందుకు? అమలు చేసేయండి..! ఇలా గడిపిన ఏకాంత సమయం మీకు జీవితాంతం గుర్తుండిపోతుంది.



**ఓ సారీ.. ఓ థ్యాంక్యూ!** భార్యాభర్తల మధ్య ప్రేమే కాదు..అప్పుడప్పుడూ చిన్న చిన్న తగాదాలు చోటుచేసుకోవడం.. తిరిగి కలిసిపోవడం. చిన్న చిన్న మాట పట్టింపులతో అప్పటిదాకా ఎడమొహం మొహంగా ఉన్న పండగలు, ప్రత్యేక సందర్భాల్లో తిరిగి కలిసిపోవడం మామూలే. కర్వాచౌత్ పండగ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. ఈ విధంగా మధ్య ఉన్న బేదాభిప్రాయాల్ని పరిష్కరించుకోవడానికి.. తప్పైతే ఓ సారీ, ఓ థ్యాంక్యూ చెప్పి దూరాన్ని దగ్గర చేసుకోవాల నుకుంటే నిపుణులు. నిజానికి సాధారణ సమయాల్లో కంటే ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో భార్యాభర్త లిద్దరూ తమ సమస్యలను పరిష్కరించు కుంటే అది వారికి ప్రత్యేక జ్ఞాపకంగా మిగిలి పోతుంది. ఇక ఈ రోజు ఇద్దరూ కలిసి గడిపే సమయం.. అప్పటి దాకా ఒకరినొకరు మిస్సయిన ఫీలింగ్‌ని దూరం చేస్తుంది. కాబట్టి అనుబంధమూ దృఢమవుతుంది.

**అత్తా కోడళ్ల అనుబంధానికి..!** కర్వాచౌత్ పండగ ఆలుమగల మధ్య ప్రేమను పెంచడమే కాదు.. కోడలికి అత్తింటి వారికీ మధ్య ఉన్న అనురాగాన్నీ, అందులోనూ అత్తాకోడళ్ల మధ్య అనుబంధాన్ని దృఢపరుస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాదిన ఎక్కువగా జరుపుకునే ఈ పండగ సందర్భంగా కోడలికి అత్తగారు ప్రత్యేకంగా 'సర్గి' తయారుచేసి అందించడం ఆనవాయితీ దక్షిణాదిలో మనం జరుపుకునే అట్లతద్దిలో కర్వాచౌత్ రోజున ఉపవాస దీక్ష తీసుకోబోయే కొన్ని గంటల ముందు ఆహారంగా తీసుకునే ప్రత్యేక థాలీ ఇది. స్వీట్లు, పండ్లు, పాలు, పెరుగు, డ్రైఫ్రూట్స్,, వంటి ప్రత్యేక పదార్థాలతో తయారుచేసిన ఈ సర్గిని అత్తగారి ఆశీర్వాదంతో పండగ రోజున సూర్యోదయానికి ముందే తీసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల ఆ రోజంతా ఉపవాస దీక్ష చేసినా అలసిపోకుండా ఉండచ్చు. ఇదేవిధంగా ఈ రోజున అత్తాకోడళ్లు పరస్పరం కొన్ని బహుమతులు కూడా ఇచ్చిపుచ్చుకుంటారు. వీటన్నిటివల్ల ఇద్దరి మధ్య అనుబంధం మరింత దృఢమవుతుంది.

# ఇల్లంతా వెలుగులు



ఇల్లూ.. వాకిలీ వెలుగులతో నిండిపోతూ దీపావళి చూడముచ్చటగా ఉంటుంది కదా! కానీ ఆ ఆలంకరణకే మనేం చాలా కష్టపాడల్సి ఉంటుంది. పండగ శ్రమలా ఉండొద్దు. ఇల్లూ కళకళలాడాలా? అయితే ఈ చిట్కాలు ప్రయత్నం చేయాండి.

❖ ఫర్నిచర్ ఒక చోట నుంచి మరో పక్కకి మార్చేయండి. ఆపై కిటికీలకు కాస్త ముదురు రంగు కర్టెన్లు వేశారంటే చాలు.కొత్త కళ వచ్చేస్తుంది. ఇక సోఫాల్లోని దిండ్లకు కాంతిమతమైన రంగుల కవర్లు వేశారంటే లుక్కే మారిపోతుంది. ❖ మూలల్లో పచ్చని కుండీలు ఉంచి, చుట్టూ పూలనూ సర్దితే చాలు. అక్కడక్కడా దీపాలు పెట్టండి చూడముచ్చటగా ఉంటుంది. ❖ గోడలకి రంగు రంగుల చున్నీలను ఎగుడు దిగుడుగానో.. భిన్న ఆకారాల్లోనో వేలాడదీసినా కొత్తగా ఉంటుంది. లేదంటే హాలు గోడంతా భిన్న రంగుల పూలను అంటించుకుంటూ ఏ వెళ్లండి అదీ కొత్తగానే ఉంటుంది. ❖ ముగ్గు కోసమంటూ నానా తిప్పలు పడొద్దు. రెడీమేడ్ ముగ్గు స్టిక్కర్లనో, పూలనే ముగ్గులా అమర్చి దీపాలను ఉంచినా చక్కగా ఉంటుంది. ఇక మెట్లకు ఇరు వైపులా దీపాలను ఉంచి చుట్టూ పూల రెక్కలను వేయండి. ప్రత్యేకంగా కనిపిస్తాయి. ❖ ఎక్కువ స్థలం లేకపోతే హాలు మధ్యలో చిన్న టేబుల్ వేయండి. ఒక రాగి పాత్రలో నీళ్ల పోసి పూలరెక్కలు, నీటిలో తేలే క్యాండిళ్లను వెలిగించి ఉంచండి అక్కడక్కడా సెంటెడ్ క్యాండిళ్లను వెలిగిస్తేపరిమళాలతో నిండిపోతుంది. తాజాగానూ అనిపిస్తుంది.

# టపాసులతో జాగ్రత్త



కొన్ని పండగల్లో సందడంతా ! ఇక దీపావళి అంటే చెపేది ఏముంది. వారం రోజుల ముందు నుంచే పిల్లలు టపాసులు కాల్చి హడావుడి చేస్తుంటారు. ఈ సంతోషాలు మనకి చేదు జ్ఞాపకాలుగా మిగలకూడదంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్తు లైట్లతో ఇంటిని అందంగా అలంకరిస్తాం. వీటితో పొంచి ఉండే ప్రమాదం గురించి పిల్లలకి తగిన జాగ్రత్తలు చెప్పాకే వాళ్లని బయటకు వదలాలి. అలాగే చిన్నారులకు వదులుగా ఉండే కాటన్ దుస్తుల్లే వేయండి. జుట్టుని వదిలేయకుండా జడ అల్లేయండి. అప్పుడే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

★ టపాసులు కాల్చడం సరదాగానే ఉంటుంది. కానీ కాలుష్యం మాటేంటి. శబ్ద, వాయు కాలుష్యాన్ని నివారించే దిశగా ఈ తరాన్ని సిద్ధం చేద్దాం. విలునంతవరకూ కాలుష్య రహిత దీపవళిని చేసుకొనేలా ప్రోత్సహిద్దాం. పెంపుడు జంతువులకీ, పెద్దవాళ్లకి ఇబ్బంది కలగకుండా తక్కువ శబ్దం చేసేవి. పొగ వెదజల్లని టపాసులనే ఎంచుకొమ్మని పిల్లలకి నచ్చ చెప్పాలి. వారు మీ పర్యవేక్షణలోనే టపాసులు వెలిగించేలా కనిపెట్టుకుని ఉండండి. చిన్న చిన్న గాయాలైతే ఉపశమనం కోసం బర్నాల్ వంటివాటిని ఉపశమనం కోసం బర్నాల్ వంటివాటిని అందుబాటులో ఉంచుకోవడం చాలా అవసరం.

★ నాలుగు టపాసులు కాల్చడం ఆ రసాయనాలు అంటిన చేతులతోనే స్వీట్లు తినడం చేస్తుంటారు పిల్లలు. తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకున్నాకే తినేలా వాళ్లని సిద్ధం చేయాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే పండగ ఆనందం రెట్టింపు అవ్వదూ!

## ఆసియా ఛాంపియన్‌షిప్..
# భారత్‌కు తొలి డబుల్స్ మెడల్స్



**న్యూఢిల్లీ:** ఆసియా పారా టిటి ఛాంపియన్‌షిప్-2025లో సోనాల్‌బెన్-రాజలక్ష్మి భారత్‌కు తొలి డబుల్స్ పతకాన్ని సాధించారు. చైనాలోని బీజింగ్‌లో ఆదివారం జరిగిన ఈ పారా ఛాంపియన్‌షిప్‌లో సోనాల్‌బెన్ పటేల్ మరియు రాజలక్ష్మి శంకర్ జనార్ధనమూర్తి జంట అద్భుత ప్రదర్శన చేశారు. మహిళల డబుల్స్ క్లాస్ డబ్ల్యూడి5 లో ఈ జంట వారి సింగిల్ రౌండ్ రాబిన్ గ్రూప్‌లో 2 విజయాలు, 2 ఓటములతో మూడవ స్థానంలో నిలిచిన తర్వాత కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ వారం ప్రారంభంలో మహిళల సింగిల్స్ క్లాస్ 3 విభాగంలో కాంస్య పతకం గెలిచిన తర్వాత ఇదే ఈవెంట్‌లో సోనాల్బెన్ సాధించిన రెండవ పతకం ఇది. ఈ జంట టోర్నమెంట్‌లో 4వ స్థానంలో నిలిచిన తోటి భారత జంట ఏక్తా భ్యాన్ మరియు ఉషాబాహెన్ రామ్‌జీభాయ్ రాథోడ్‌లపై 3-1 తేడాతో విజయం సాధించి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అయితే, వారు ఆ ఫామ్‌ను నిలబెట్టుకోలేకపోయారు. దక్షిణ కొరియా-థాయ్ ద్వయంతో జరిగిన వరుస గేమ్‌లలో వారి తదుపరి రెండు మ్యాచ్‌లను ఓడిపోయారు. కానీ, వారు తిరిగి విజేత ఫామ్‌లోకి వచ్చి, పతకాన్ని నిర్ధారించడానికి తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో కజకిస్తాన్ జోడీ అలెగ్జాండ్రా స్టెపనోవా-యకటెరినా ఫెడోరెంకోను ఓడించారు. దీనితో, భారత బృందం ఐదు కాంస్య పతకాలతో టోర్నమెంట్‌ను ముగించింది, ఇది భారతదేశం ఒకే ఎడిషన్‌లో ఇప్పటివరకు గెలుచుకున్న అత్యధిక పతకాలు కూడా.




# జపాన్ ఓపెన్ గెలుచుకున్న రాణిగా లేలా

**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ 2025 కిరీటాన్నిలేలా ఫెర్నా ండెజ్ దక్కించుకుంది.టెరెజా వాలెంటోవాను ఓడించి లేలా ఈ టైటిల్ గెలుచుకుంది. ఆదివారం జరిగిన జపాన్ ఓపెన్ ఫైనల్లో కెనడాకు చెందిన లేలా ఫెర్నాండెజ్ 6-0, 5-7, 6-3 తేడాతో చెక్ టీనేజర్ టెరెజా వాలెంటోవాను ఓడించి ఈ ఏడాది తన రెండో టైటిల్‌ను గెలుచుకుంది. రెండవ సెట్ కు ముందు జరిగిన మార్పు చూసి వాలెంటోవా షాక్ కు గురైనట్లు అనిపించింది. కానీ ఆమె ముందుకు వచ్చి మ్యాచ్ ను సమం చేసింది. మూడో సెట్‌లో ఫెర్నాండెజ్ తిరిగి పైచేయి సాధించింది, ఆమె ప్రత్యర్థి నెట్‌లోకి సర్వీస్ రిటర్న్ కొట్టడంతో విజయాన్ని ఖాయం చేసు కుంది. ఇక ప్రపంచ 27వ ర్యాంక్ క్రీడాకారిణి లేలా జూలైలో వాషింగ్టన్‌లో జరిగిన డిసి ఓపెన్‌లో తన విజయాన్ని కొనసాగించింది. ఒసాకాలో క్వాలిఫైయర్ వాలెంటోవాను ఓడిం చిన తర్వాత మరో టోర్నమెంట్ విజయంతో తన సత్తా చాటింది. 23 ఏళ్ల ఫెర్నాండెజ్ కెరీర్ లో ఇది ఐదవటైటిల్ మరియు ఒకే సంవత్స రంలో రెండుసార్లు గెలవడం ఇదే మొదటిసారి. ఫెర్నాండెజ్ వచ్చే వారం టోక్యోలో జరిగే పాన్ పసిఫిక్ ఓపెన్‌లో పోటీ పడనుంది, అక్కడ ఆమె తొలి రౌండ్‌లో తోటి కెనడియన్ విక్టోరియా ఎంబోకోతో తలపడనుంది. కాగా జపాన్ ఓపెన్‌లో టాప్ సీడ్, మాజీ ప్రపంచ నంబర్ వన్ నవోమి ఒసాకా, కాలి గాయం నుంచి కోలుకోకపోవడంతో క్వార్టర్ ఫైనల్‌కు ముందే నిష్క్రమించింది.

# భారత్ స్టార్ తన్వీ ఓటమి.. రన్నరప్‌తో సరి




**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ బ్యాడ్మింటన్ స్టార్ తన్వి శర్మ ఓటమి చవిచూసింది. తన్వీ శర్మ థాయ్‌లాండ్‌కు చెందిన అన్యపత్ ఫిచిత్‌ప్రీచాసక్ చేతిలో ఓడి 17 ఏళ్ల తర్వాత బాలికల సింగిల్స్‌లో రన్నరప్‌కే పరిమితమైంది. గౌహతిలో ఆదివారం జరిగిన ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో తన్వి శర్మ చివరిలో తడబడింది. కేవలం 28 నిమిషాలు మాత్రమే జరిగిన ఈ మ్యాచ్‌లో 16 ఏళ్ల టాప్ సీడ్ థాయిలాండ్‌కు చెందిన అన్యాపట్ ఫిచిత్ప్రీచాసక్ చేతిలో 7-15, 12-15 స్కోరుతో పరాజయం పాలయింది. అయితే సైనా నెహ్వాల్, అపర్ణ పోపట్ తర్వాత బాలికల సింగిల్స్ ఫైనల్‌కు చేరుకున్న మూడవ భారతీయ మహిళగా తన్వి నిలిచింది. మొదటి సెట్‌ను 7-15తో కోల్పోయిన తర్వాత, తన్వి రెండవ గేమ్‌లో నియంత్రణ సాధించి, 8-5తో మూడు పాయింట్ల ఆధిక్యాన్ని కొనసాగించింది. కానీ ప్రత్యర్థి నుండి అనవసర తప్పిదాలతో స్కోరును 8 ఆల్ తో సమం చేసింది. అంతకుముందు, తన్వి సెమీఫైనల్లో చైనాకు చెందిన లియు సి యాను 15-11, 15-9 తేడాతో ఓడించి అసాధారణ ప్రదర్శనను ప్రదర్శించింది. తన్వి రజత పతకం సాధించడం ద్వారా ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో మహిళల సింగిల్స్‌లో భారత్ 17 సంవత్సరాల పతకాల కరువుకు ముగింపు పలికింది. కాగా చైనాకు చెందిన టాన్ కే జువాన్ 15-13, 19-17 తేడాతో మలేషియాకు చెందిన నోరాకిలా మైసారాపై విజయం సాధించి బాలికల డబుల్స్ కిరీటాన్ని గెలుచుకుంది.

# వన్డే విజేతల్లో టాప్ ఆస్ట్రేలియా

## నంబర్ టుగా టీమిండియా




**న్యూఢిల్లీ:** వన్డే ఇంటర్నేషనల్ క్రికెట్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు గెలిచిన దేశాల జాబితాలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. భారత్ ఈ జాబితాలో 2వ స్థానంలో, పాకిస్థాన్ 3వ స్థానంలో ఉన్నాయి. వన్డే ఇంటర్నేషనల్‌లో అత్యధిక మ్యాచ్‌లు గెలిచిన టాప్-5 దేశాల జాబితాలో ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. 2000వ దశకంలో ఆస్ట్రేలియా వన్డే క్రికెట్‌లో చాలా కాలం పాటు ఆధిపత్యాన్ని చెలాయించింది. ఆస్ట్రేలియా ఇప్పటివరకు 1,016 వన్డేలు ఆడగా, వాటిలో 615 మ్యాచ్‌ల్లో విజయం సాధించి మరో 357 మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. ఐసీసీ వన్డే వరల్డ్ కప్‌లను అత్యధికంగా గెలిచిన రికార్డు కూడా ఆస్ట్రేలియా పేరు మీదే ఉంది. ఇప్పటివరకు ఆ జట్టు 6 సార్లు వరల్డ్ కప్‌ను గెలుచుకుంది. ఇక వన్డే ఇంటర్నేషనల్‌లో అత్యధిక మ్యాచ్‌లు 567 విజయాలతో టీమిండియా 2వ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటివరకు 1,066 వన్డే మ్యాచ్‌లు ఆడింది. వాటిలో 567 మ్యాచ్‌లలో విజయం సాధించగా, 445 మ్యాచ్‌లలో ఓటమి చవిచూసింది. భరత్ 2 సార్లు వన్డే వరల్డ్ కప్‌లను (1983, 2011లో) గెలుచుకుంది. అలాగే 521 వన్డేలు గెలిచి పాకిస్థాన్ 3వ స్థానంలో ఉంది. పాక్ ఇప్పటివరకు 990 మ్యాచ్‌లు ఆడింది. వాటిలో 521 మ్యాచ్‌లలో విజయం సాధించి, 439 మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. పాకిస్థాన్ 1992లో ఒకసారి వన్డే వరల్డ్ కప్‌ను గెలుచుకుంది. వన్డే ఇంటర్నేషనల్‌లో అత్యధికంగా 434 విజయాలతో శ్రీలంక 4వ స్థానంలో ఉంది. లంక ఇప్పటివరకు 937 మ్యాచ్‌లు ఆడగా, వాటిలో 434 మ్యాచ్‌ల్లో విజయం సాధించి, మరో 456 మ్యాచ్‌లలో ఓటమి ఎదుర్కొంది. శ్రీలంక 1996లో తమ మొదటి, ఏకైక వన్డే వరల్డ్ కప్ ట్రోఫీని గెలుచుకుంది. టాప్ 5 జాబితాలో చివరిగా 429 వన్డే విజయాలతో వెస్టిండీస్ 5వ స్థానంలో ఉంది. ఈ జట్టు ఇప్పటివరకు 891 మ్యాచ్‌లు ఆడింది. వాటిలో 429 మ్యాచ్‌లలో విజయం సాధించి, 420 మ్యాచ్‌లలో ఓటమి చెందింది. వెస్టిండీస్ వన్డే వరల్డ్ కప్ మొదటి రెండు ఎడిషన్‌లు అయిన 1975, 1979లలో వరల్డ్ కప్‌లను గెలుచుకుంది.




# తొలి వన్డేలో భారత్ ఫ్లాప్

## శుభమన్, రోహిత్. కోహ్లీ విఫలం.. ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** భారీ అంచనాలతో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియా ఓటమితో ప్రారంభించింది. వర్షం అంతరాయం నడుమ పెర్త్‌లో ఆదివారం జరిగిన తొలి వన్డేలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఆసీస్ 7 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ విజయంతో మూడువన్డేల సిరీస్‌లో 1-0తో కంగారూ టీమ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ వర్షం అంతరాయాల నడుమ జరుగుతున్న తొలి వన్డేలో భారత్ ఇన్నింగ్స్ తడబడుతూ మొదలైంది. ఆరంభంలోనే హేజిల్‌వుడ్ రోహిత్ శర్మ(8)ను ఔట్ చేసి ఆసీస్‌కు బ్రేకిచ్చాడు. క్రీజులో కుదురుకునేలా కనిపించిన విరాట్ కోహ్లీ(0)ని మిచెల్ స్టార్క్ డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఆ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్(10) శ్రేయాస్ అయ్యార్(11)లు సైతం విఫలమయ్యారు. 45 కే నాలుగు వికెట్లు పడిన దశలో కేఎల్ రాహుల్(38), అక్షర్ పటేల్(31) ఆపద్బాంధవుల పాత్ర పోషించారు. కంగారూ పేస్ దళాన్ని దీటుగా ఎదుర్కొన్న అక్షర్‌ను కుహ్నేమాన్ ఔట్ చేయగా భారత్ మరింత కష్టాల్లో పడింది. అయితే. వాషింగ్టన్ సుందర్(10), నితీశ్ కుమార్ (19 నాటౌట్)ల జతగా జట్టు స్కోర్ 120 దాటించారు. రాహుల్. టెయిలెండర్లు విఫలమవ్వడంతో 26 ఓవర్లలో భారత్ 9 వికెట్లు కోల్పోయి 131 రన్స్ కొట్టింది. ఇక వర్షం అంతరాయంతో డక్‌వర్త్ పద్ధతిన ఆస్ట్రేలియా లక్ష్యాన్ని 26 ఓవర్లలో 131గా నిర్ణయించారు. స్వల్ప ఛేదనలో బరిలోకి దిగిన డేంజరస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్‌ను (8) రెండో ఓవర్లో అర్షదీప్ సింగ్ ఔట్ చేశాడు. దాంతో 10 పరుగులకే ఆసీస్ తొలి వికెట్ పడింది. అనంతరం కెప్టెన్ మిచెల్ మార్ష్(46 నాటౌట్), మాథ్యూ షార్ట్(8) ఇన్నింగ్స్ నిర్మించి జట్టు స్కోర్ 40 దాటించారు. థర్డ్ మ్యాన్‌లో రోహిత్ చేతికి సులువైన క్యాచ్ ఇచ్చాడు. దాంతో 44 వద్ద కంగారూ టీమ్ రెండో వికెట్ కోల్పోయింది. మార్ష్ జతగా ఫిలిప్పే బౌండరీలతో చెలరేగాడు. దాంతో ఆసీస్ స్కోర్‌బోర్డు పరుగులు తీసింది. మూడో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయాన్ని సుందర్ విడదీశాడు. అప్పటికే ఆస్ట్రేలియా పటిష్ట స్థితిలోనే ఉంది. ఆ తర్వాత వచ్చిన మ్యాట్ రెన్‌షా (21 నాటౌట్) సైతం దంచగా, 21.1 ఓవర్లోనే ఆసీస్ విజయం సాధించింది.




## 186 లగ్జరీ కార్లు.. రూ.21కోట్ల డిస్కౌంట్లు

### జైన్ సామాజికవర్గ 'జీటో' బృహత్తర కార్యాచరణ



**అహ్మదాబాద్, అక్టోబరు 19:** వ్యాపార మెళుకువల్లో ఆరితేరిన వారుగా పేరున్న జైన సామాజిక వర్గం ఒకేసారి 186 లగ్జరీ కార్లు కొనుగోలుచేసి 21 కోట్ల డిస్కౌంట్‌ను కూడా సొంతంచేసుకుంది. జీటోగా పిలుచుకునే జైన్ ఇంటర్నేషనల్‌ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంఘంలోని 65 వేలమంది సభ్యులకు ఈ కార్లను డెలివరీచేసింది. జీటో ఉపాధ్యక్షుడు హిమాంశు షా మాట్లాడుతూ తమ సంఘ చరిత్రంలో ఇదే అతిపెద్ద డీల్ అని లగ్జరీ బ్రాండ్లలో బిఎం డబ్ల్యు, మెరిస్డిడిస్ బెంజ్ వంటి కంపెనీల డీలర్లతోకూడా సంప్రదింపులు జరిపి డిస్కౌంట్ సాధించగలిగామని చెప్పారు. గుజరాత్‌లోని జైనులే లగ్జరీ కార్లు ఎక్కువ కొనుగోలుచేసినట్లు హిమాంశు చెప్పారు. కార్లు అన్నీ కూడా 60 లక్షలనుంచి 1.3 కోట్లఖరీదుతో ఉన్నాయన్నారు. జనవరి జూన్‌మధ్యకాలంలోనే ఈ కార్లను అందరికీ అప్పగించామన్నారు. ఈ డీల్‌ద్వారా తమ సభ్యులందరికీ 21 కోట్ల రూపాయల విలువైన డిస్కౌంట్లు అందాయన్నారు. సంఘ సభ్యుడు నితిన్‌జైన్ మాట్లాడుతూ జీటో సభ్యులంతా ఈ డీల్‌ను చెప్పినపుడు ఈ ప్రతిపాదనలు తెచ్చామన్నారు. వెనువెంటనే డిస్కౌంట్లను కూడా కంపెనీలు ఆఫర్‌చేయడంతో జీటో సభ్యులు కొనుగోళ్లుప్రారంభించారన్నారు. మొత్తం 186 కార్లు కొనుగోలుచేసి 21 కోట్లు ఆదాచేసామన్నారు. ప్రతిసభ్యుడు సగటున 8 లక్షలనుంచి 17 లక్షల రూపాయలవరకూ ఆదాచేసుకోగలిగారని చెపుతున్నారు. ఆటోమొబైల్‌లోమెగా డీల్‌చేసిన జీటో ఇపుడు ఆభరణాల కొనుగోళ్లలో కూడా తమ సంఘ సభ్యులకు ఇదేవిధమైన సాయం అందించాలనినిర్ణయించింది. జ్యూయెలరీ, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లోకూడా కొత్త కార్యాచరణను 'ఉత్సవ్' పేరిట ప్రారంభిస్తున్నట్లు హిమాంశుషా చెప్పారు.

## ఆర్బీఎల్ బ్యాంకులో ఎమిరేట్స్ ఎన్బీడీకి 60% వాటా

**ముంబయి, అక్టోబరు 19:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌బిడి పిజెఎస్‌సి ఆర్బీఎల్ బ్యాంకులో 60శాతం వాటాను కొనుగోలుచేస్తుండటంతో బ్యాంకు ఆర్థిక పరిపుష్టి ఈసారి మరింతపెరుగుతుందన్న అంచనాలున్నాయి. మిడ్‌సైజ్ బ్యాంకరు ఇపుడు దేశంలోని అతిపెద్ద బ్యాంకుల్లో




ఒకటిగా నిలుస్తోంది. ఈ నిధుల సమీకరణతో ఆర్బీఎల్‌బ్యాంకు కార్పొరేట్ రుణపరపతిపైనా దృష్టిపెడుతోంది. ఇపుడు తాజాగా వెల్త్‌మేనేజ్‌మెంట్ బిజినెస్ లోకి కూడా వస్తోంది. అలాగే రిటైల్‌రుణపరపతిని మరింత పెంచుకోవాలనిచూస్తోంది. అలాగే మధ్యప్రాచ్య మార్కెట్‌ను కూడా రాబట్టుకునేదిశగా డిజిటల్‌టెక్నాలజీని అప్‌గ్రేడ్‌చేస్తోంది. ప్రస్తుతం మిడ్‌సైజ్‌బ్యాంక్‌గా ఉన్న తాము రానున్న కాలంలో మెగాబ్యాంకుల్లో ఒకటిగా అవతరిస్తామని ఎండిసిఇఒ సుబ్రహ్మణియకుమార్ అన్నారు. బ్యాంకు పంపిణీకేంద్రాలుకూడా ఇపుడు రెట్టింపు అవుతాయని డిపాజిట్లసేకరణను కూడా పెంచుకోగలుగుతామని అన్నారు. ఇప్పటివరకూ బ్యాంకుశాఖలు లేని ప్రాంతాలకుసైతం విస్తరించాలన్నప్రణాళిక ఉందని డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థను మరింతగా వృద్ధిచేసి వెల్త్‌మేనేజ్‌మెంట్ విభాగంలో కూడా వృద్ధిచెందేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఇపుడు ఎన్‌బిడి ఎమిరేట్స్‌సంస్థ పెట్టుబడులతో బ్యాంకు కార్పొరేట్ బ్యాంకింగ్ ఉనికి మరింత విస్తరించగలదన్నారు. అంతేకాకుండా హైరేటెడ్ కార్పొరేట్స్‌కు రుణపరపతిని అందించగలమన్న ధీమాను వ్యక్తంచేసారు.

## వాణిజ్యం



### ట్యారిఫ్‌ల కారణంగా ఇతర 24 దేశాలపై
# 'భారత్' ఫోకస్
### 6నెలల్లోనే 129.3 బిలియన్ డాలర్ల ఎగుమతులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** భారత్ ఎగుమతిదారులు 24 దేశాల్లో తమతమ ఎగుమతులను పెంచుకోగలిగారు. మొదటి ఆరునెలల కాలంలో ఈ ఏడాది అమెరికాకు షిప్‌మెంట్లు తగ్గినప్పటికీ ఇతర దేశాలపై దృష్టిపెట్టారు. దీనితో కొరియా,యుఎఇ, జర్మనీ, టోగో, ఈజిప్టు, వియత్నం, ఇరాక్,మెక్సికో, రష్యా, కెన్యా, నైజీరియా, కెనడా, పోలండ్, శ్రీలంక, ఓమన్, థాయిలాండ్, బంగ్లాదేశ్, బ్రెజిల్, బెల్జియం, ఇటలీ, టాంజానియా దేశాలకు ఎగుమతులు పెరిగాయి. ఈ 24దేశాలకు 129.3 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. ఏప్రిల్‌సెప్టెంబరు మధ్యకాలంలనే గత ఏడాదితోపోలిస్తే 59శాతం వాటాతో ఎగుమతులుజరిగినట్లు వాణిజ్యశాఖ అధికారులు చెపుతున్నారు. 30.2శాతం పెరిగి ఈ ఏడాది 220.12 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. దిగుమతులు కూడా 4.53శాతంపెరిగి 375.11 బిలియన్ డాలర్లకు చేరింది. దీనితో వాణిజ్యటోలు కూడా 154.99 బిలియన్ డాలర్లుగా ఉంది. ఆరుదేశాలకు ఎగుమతులు మాత్రం ప్రతికూలంగా ఉన్నాయి. ఈ దేశాల్లో 27శాతం వాటాతో ఎగుమతులుంటాయి. అంటే 60.3బిలియన్ డాలర్లవరకూ ఉంటాయని వాణిజ్య గణాంకాలు చెపుతున్నాయి. సుంకాల దెబ్బకు అమెరికా ఎగుమతులు భారీగా తగ్గిపోయాయి. ఆఫ్రికా, లాటిన్ అమెరికా,మధ్యప్రాచ్యదేశాలవైపు ఇపుడు ఫోకస్ పెరుగుతోంది. భారత వాణిజ్య ఎగుమతులు అమెరికాకు 11.93శాతం క్షీణించి 5.46 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.50శాతం ట్యారిఫ్‌లవల్లనే ప్రతికూల వృద్ధి ఉంది. అమెరికా విధించిన సుంకాలపై రెండుదేశాలమధ్య చర్చలు జరుగుతున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం కృషిచేస్తున్న భారత్ రెండువైపులా వాణిజ్యం పెరగాలన్న లక్ష్యంతో ఉంది. 2024-25నుంచి కూడా అమెరికా భారత్‌కు అతిపెద్ద వాణిజ్యభాగస్వామిగా ఉంది.

## 800 మిలియన్ డాలర్ల సమీకరణకు మీషో




**ముంబయి, అక్టోబరు 19:** ఈకామర్స్‌సంస్థ మీషో సవరించిన ఐపిఒ ముసాయిదాను సెబీకి మళ్లీ దరఖాస్తుచేసింది. డిసెంబరులో పబ్లిక్ లిస్టింగ్‌కు వస్తున్న కంపెనీ తాజా డిఆర్‌హెచ్‌పిని సెబీకి నివేదించింది. 700 మిలియన్ డాలర్లనుంచి 800 మిలియన్ డాలర్లను సేకరించాలని నిర్ణఇంచింది. వీటిలోప్రైమరీ సేల్ 500 మిలియన్ డాలర్లుగా ఉంది. కంపెనీ ఈక్విటీ నిర్మాణక్రమం, వివరాలు, ప్రస్తుత వాటాదారుల పాల్గొంటున్న వైనం వారి వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌లో విక్రయం వంటి పూర్తి వివరాలనునివేదించింది. మీషోలో ఎలివేషన్ క్యాపిటల్; పీక్ ఎక్స్‌వి పార్టనర్స్, వెంచర్ హైవేలు భాగస్వాములుగా ఉన్నాయి. మీషో సహభాగస్వాములు విదిత్ ఆత్రే, సంజీవ్ బర్న్వాల్ ప్రమోటర్లుగా ఉన్నారు. ఈ ఐపిఒతో వారి వాటాలను కూడా తగ్గించుకోనున్నారు. జులైలో రహస్యపద్ధతిలో ఫైలింగ్‌చేసిన దరఖాస్తును ప్రైమరి ఇష్యూలో కేవలం 500 మిలియన్ డాలర్లుగాపేర్కొన్నారు. మళ్లీ రివైజ్‌చేసిన డిఆర్‌హెచ్‌పిలో మొత్తం 800 మిలియన్ డాలర్లవరకూ సమీకరించాలనినిర్ణయించారు. ఎలివేషన్ క్యాపిటల్‌కు 14శాతం వాటా ఉంది. పీక్ ఎక్స్‌వి పార్టనర్‌కు 13.2శాతం వాటా ఉంది.



## ధన్‌తేరాస్ రోజున లక్షకుపైగా చిన్నకార్ల డెలివరీలు!

**ముంబయి, అక్టోబరు 19:** ధన్‌తేరస్ పుణ్యమా అని ఒక్కరోజులోనే ఆటోమొబైల్ ఉత్పత్తిదారులు పంపిణీదారులు డీలర్లు లక్షకుపైగా కార్లు డెలివరీ ఇచ్చారు. జిఎస్టీ రేట్ కట్స్‌తోసహా పండుగ డిమాండ్‌పెరగడంతో చిన్నకార్ల కొనుగోళ్లు అనుకోకుండానే పెరిగాయి. ఆదివారం ఒక్కరోజే లక్షకుపైగా డెలివరీ ఇచ్చినట్లు ఆటోమొబైల్ డీలర్లు చెపుతున్నారు. పసిడి విక్రయాలు కూడా రేట్లతో భారీగాపడిపోయాయి. ధరలు 65శాతం కంటే ఎక్కువ పెరిగాయి. పదిగ్రాములు 1.35 లక్షలరూపాయలు పలికింది. దీనితో ధరలు పెరగడంతో బంగారం కంటే తేలికపాటి ఆభరణాలు, వెండి ఆభరణాల కొనుగోలుకే మొగ్గుచూపించారు. ఈ ఫోకస్ అంతా ఆటోమొబైల్‌పై పడింది. మారుతిసుజుకి అయితే 41 వేలు డెలివరీ ఇచ్చింది. మొత్తం ఈసారి ధన్‌తేరస్‌కు 51వేల యూనిట్లు డెలివరీ ఇచ్చామని చెప్పారు. ఇక హుండై మోటార్స్ కూడా ధన్‌తేరస్ రోజున 14 వేల యూనిట్లు అమ్మినట్లు చెపుతున్నది. ఇదే తరహాలో ఇతర కంపెనీల్లో కూడా డెలివరీలు ఉన్నట్లు ఆటోమొబైల్ ఉత్పత్తిదారులు చెపుతున్నారు. గత ఏడాది ధన్‌తేరస్‌తో పోలిస్తే ఈసారి అమ్మకాలు గణనీయంగా ఉన్నాయని, దీనికంతటికీ కారణం కొంత వెండిబంగారం ధరలు పెరగడమేనని డీలర్లు సైతం అంగీకరిస్తున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.